www.jagritiweekly.com
సంపుటి : 76 సంచిక : 05 పుటలు : 52

# జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ కార్తిక బహుళ చతుర్దశి
11-17 డిసెంబర్ 2023
వెల : ₹20/-




## విజేత బీజేపీ

## తెలంగాణ కొత్త ముఖ్యమంత్రి

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

76 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక


virinchi
HOSPITALS
Cell Correct
happy
Diwali
PARTNERSHIP OF HUMANITY WITH MEDICINE
OUR BRANCHES
VIRINCHI HOSPITALS
Virinchi Circle, Rd Number 1, Shyam Rao Nagar, Banjara Hills, Hyderabad, Telangana 500034
Phone: 040 4699 9999
BRISTLECONE HOSPITALS
Plot No. 3-4-136/A, Street No.6, Barkatpura, Hyderabad, Telangana 500027
Phone: 040 4599 9999
BRISTLECONE HOSPITALS
NH 9, Thorruur X Road, Beside Sai Baba Temp, Hyderabad, Telangana 501505
Phone: 040 2411 2233
www.virinchihospitals.com

# నౌకాబలానికి మార్గదర్శకుడు

ఛత్రపతి శివాజీ మహరాజ్ ప్రతిమను డిసెంబర్ 4న ప్రధాని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. మహారాష్ట్రలోని సింధుదుర్గ జిల్లాలోని రాజ్‌కోటలో ఈ కార్యక్రమం జరిగింది. నౌకాబలానికి శివాజీ ఇచ్చిన ప్రాముఖ్యం అనన్య సామాన్యమైనది. దానిని ఈ తరాల వారికి గుర్తు చేసే ఉద్దేశంతో ఈ విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారు. సింధుదుర్గ కోట, రాజ్‌కోట్ కోట శివాజీ నౌకాబలం కోసం నిర్మించినవే. ఇందుకు సంబంధించి శివాజీ కాలంలోని ఒక ముద్రిక కూడా నిరుడు దొరికింది. దానినే ఐఎన్ఎస్ విక్రాంత్ మీద ప్రతిష్ఠించారు కూడా. ఆ నౌక పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించారు. సింధుదుర్గ కోటలోనే నిర్వహించిన 2023 నేవీ దినోత్సవానికి కూడా ప్రధాని హాజరయ్యారు.



Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

**జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013**

## చందాదారులకు విన్నపం

జాగృతి వారపత్రికలను క్రమంతప్పకుండా అందజేయుటకు తపాలశాఖ వారు ఈ మధ్యనే **'మ్యాగజైన్ పోస్ట్'** అనే పేరుతో **'ట్రాకింగ్ సిస్టం'** ప్రవేశ పెట్టారు. ట్రాకింగ్ ఉంటుంది కాబట్టి పత్రిక తప్పనిసరిగా అందుతుంది. చందాదారునికి పత్రిక పోస్ట్ చేసిన తేదీ, పత్రిక అందజేసిన విషయం ఎస్ఎంఎస్ ద్వారా తపాలా శాఖవారు తెలియజేస్తారు. జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు అదనంగా సంవత్సరానికి **రూ. 624/–** (వారానికి రూ. 12/–) తపాలాశాఖకు చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి ఈ సదుపాయం పాఠకులు వినియోగించుకోవాలని విన్నపం. అందుకోసం జాగృతి అకౌంట్‌కు అదనంగా రూ. 624/– చెల్లించగలరు. ప్రస్తుత చందా దారులు రాబోయే వారాలకు తగిన మొత్తం (వారానికి రూ. 12/– చొప్పున) పంపిన వివరాలతోపాటు తమ చందా నెంబరు వివరాలు, పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెంబరు తెలుపగలరు. ఈ వివరాలు అందిన 15 రోజుల నుండి **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పత్రిక పంపే ప్రక్రియ మొదలవుతుంది.

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust,**
**92001006140 5325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

**మరిన్ని వివరాలకు**

**040-27561453/9959997013** నెంబర్లలో సంప్రదించవచ్చు.

– సర్క్యులేషన్ మేనేజర్

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

**చందా పంపవలసిన చిరునామా :**

✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్–500 027.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | |
|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ |
| సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్ : సిహెచ్. కుమార్

డిసెంబర్ 3న వెల్లడైన ఫలితాలు, వచ్చే లోక్‌సభ ఎన్నికల ఫలితాల తీరును సూచనప్రాయంగా వెల్లడిస్తున్నాయన్న వ్యాఖ్య వినిపిస్తున్నది. అంటే కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం తథ్యమనే. ఇది సహజంగా ఏర్పడే అభిప్రాయం. ఇప్పుడు మూడు రాష్ట్రాలలో సాధించిన ఘన విజయంతో హిందీ భాషా ప్రాంతాల సంపూర్ణ మద్దతు బీజేపీ పరమైందన్నది ఆ విశ్లేషణల విశ్వాసం. ఇది తప్పు పట్టవలసినది కాదు. కానీ నానాటికీ ఎన్నికల విశ్లేషణలు మూస ధోరణికి మరలుతున్నాయని అనిపిస్తుంది. వాటిలో ఇంకాస్త సమగ్రత అవసరమని చెప్పినా దోషం కాదు. ఎన్నికలు, రాజకీయం పరిధుల నుంచి బయటకొచ్చి చూడవలసిన విషయాలు ఉన్నాయని గుర్తించాలి. ఒక వర్గం టీవీ వ్యాఖ్యాతలు, పత్రికా రచయితలు ఈ మూస ధోరణిలో ఉండిపోతున్నారు. కారణం బీజేపీ మీద ఉన్న అంధ వ్యతిరేకత. ఇదే బీజేపీ వరస విజయాల వెనుక ఉన్న ఒక నిర్మాణాత్మక కోణం ప్రజల దృష్టికి చేరకుండా నిరోధిస్తున్నది.

ఇంకొంచెం సూటిగా– బీజేపీ విస్తరణకీ, బీజేపీయేతర పక్షాలు క్రమంగా చతికిల పడడానికి వెనుక ఉన్న కారణాలను ఆ మీడియా వాస్తవికంగానే చర్చిస్తున్నదా? లేదనేదే సమాధానం. గడచిన పదిహేనేళ్లుగా బీజేపీ అయోధ్య అంశాన్ని ఎన్నికల ప్రచారంలో తీసుకురావడం లేదు. ఎన్ని ఎన్నికలు జరిగితే అంతగా పార్టీ బలపడుతుందని నమ్మే నాయకత్వం బీజేపీది కాదు. మీడియా పరిభాషలో 'మత ఉద్రిక్తతలు రేపే ఉద్వేగపూరిత అంశాన్ని' ప్రచారంలోకి తేలేదు. అయినా బీజేపీ ఎన్నికల పోరాటాలలో విజయాలు సాధిస్తూనే ఉన్నది. రాజకీయపక్షంగా అన్ని వర్గాలకు చేరువ అవుతూనే ఉన్నది. దీనిని అర్థం చేసుకోవడం నేటి అవసరం. తన దృష్టి యావత్తు సమ్మిళిత వృద్ధికి అంకితం చేసే అవకాశం ఇప్పుడు బీజేపీకి వచ్చింది. బీజేపీ తన విస్తరణను, విజయాలను అందుకు ఉపయోగించుకుంటున్నది కూడా. సమ్మిళిత వృద్ధి అన్న పదబంధం రాజకీయ ఆర్థిక కోణం నుంచి అంటున్నా, బీజేపీ ఎదుగుదల వరకు ఆ అంశాన్ని రెయిన్‌బో సోషల్ కొయిలిషన్ అనడం సబబు. అంటే జాతి, వర్గ

**శాలివాహన 1945 శ్రీ శోభకృత్ కార్తిక బహుళ చతుర్దశి**

### లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం
**విజేత బీజేపీ**
6లో



ప్రత్యేక వ్యాసం
**భక్త కల్పవల్లి ఆండాళ్ తల్లి**
26లో



జాతీయం
**పుణ్యభూమి మీద ప్రాణం విలువ**
32లో

# జాగృతి

## సంపాదకీయం

భేదాలకు చోటులేని బహుళ సంస్కృతీ సమ్మేళనాన్ని ఆహ్వానించడం, విశ్వసించడం. అలాంటి సమాజాన్ని నిర్మించడం. ఆ దిశగానే బీజేపీ ప్రయాణిస్తున్నది.

ఐదేళ్ల క్రితం మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌ల ఎన్నికలకీ, తాజా ఎన్నికలకీ మధ్య వ్యత్యాసం ఆ ప్రయాణాన్ని సూచించేదే. 2018 ఎన్నికలలో ఆ మూడు చోట్ల బీజేపీ పరాజయం చవి చూసింది. తరువాత మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలడంతో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. ఆ చర్యను ఇప్పటికీ విమర్శిస్తున్నవారి వాదనను త్రోసిరాజని ప్రజలు మళ్లీ బీజేపీకే అఖండ విజయం ఇచ్చారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను పటాపంచలు చేస్తూ బీజేపీ దూసుకువచ్చింది.

## ఇది విస్మరించవద్దు!

ఈ మూడు రాష్ట్రాలలో కమల వికాసమే 2024 లోక్‌సభ ఎన్నికలలో విజయం గురించి ప్రధాని నరేంద్ర మోదీ ముందే ధీమా వ్యక్తం చేసే అవకాశం ఇచ్చింది. వీటికి ఆ విధమైన ప్రాధాన్యం కూడా ఉంది.

బీజేపీ తన సామాజిక న్యాయసూత్రాన్ని అక్కడి పరిస్థితులకు అనుగుణంగా అమలు చేసే ప్రయత్నం చేస్తున్నది. తెలంగాణలో వెనుకబడిన వర్గాల వ్యక్తికే ముఖ్యమంత్రి అవకాశం ఇస్తామని ప్రకటించింది. ఎస్సీ వర్గీకరణకు హామీ ఇచ్చింది. అయినా ఎనిమిది స్థానాలతో పార్టీ సరిపుచ్చుకుంది. ఇక్కడ ప్రశ్న సీట్లు కాదు. ఐదేళ్లకు ఒకసారి జరిగే ఎన్నికలూ కాదు. బీజేపీ దృష్టి. అధికారంలోకి వచ్చి వెళ్లిన పార్టీ ఇచ్చిన ఎస్సీ ముఖ్యమంత్రి హామీ దారుణంగా అపహాస్యం పాలైన చరిత్రను గుర్తు చేసుకుంటే బీజేపీ హామీ, విధానంలోని గొప్పతనం అర్థమవుతుంది. మధ్యప్రదేశ్‌లో మూడు 'ఎం'లు తారక మంత్రాలుగా పనిచేశాయి. అవే మోదీ, మామ (శివరాజ్‌సింగ్ చౌహాన్ ముద్దుపేరు), మహిళ. ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లాడ్లీ బెహన్, లాడ్లీ బెమన్ పథకం కీలకంగా కనిపించాయి. ప్రభుత్వ వ్యతిరేకతను నిరంతరం గమనిస్తూ సత్వర చర్యలు తీసుకోవడం కూడా బీజేపీ జాగరూకత ప్రదర్శిస్తున్నది. అంటే తప్పులు ఎప్పటికప్పుడు దిద్దుకోవడం. పలువురు లోక్‌సభ సభ్యులను శాసనసభలకు పోటీ చేయించడం కూడా సమ్మిళిత దృష్టిలో భాగమేనని విశ్లేషకులు చెబుతున్నారు. పార్టీలో, రాష్ట్ర రాజకీయాలలో ఉనికిని చాటుకున్న నేతలను, ఇంకా చెప్పాలంటే తరువాతి తరం నాయకులను శాసనసభలకు పంపించాలని బీజేపీ అధిష్ఠానం భావించినట్టు కనిపిస్తుంది. పలుచోట్ల బీజేపీ ఎదుర్కొంటున్న నాయకత్వ సమస్యకు ఇదొక పరిష్కారం.

బీజేపీ ప్రయాణం ఈ దిశగా సాగుతుంటే కాంగ్రెస్, దాని నాయకత్వంలోని ఇండియా కూటమి కుల గణనను నమ్ముకున్నాయి. విభజన రాజకీయాలకు పాల్పడుతున్నదని బీజేపీని విమర్శిస్తూనే బుజ్జగింపు ధోరణిని ఇంకాస్త బలపడేటట్టు చేస్తున్నాయి. అవి ముస్లింలను వాస్తవిక దృక్పథంలోకి తీసుకురావాలని కోరుకోవడం లేదు. ఇందుకు ఇందోర్ (మధ్యప్రదేశ్) ఘటన సాక్ష్యం. అక్కడ బీజేపీ చేపట్టిన విజయయాత్రకు వకీల్ పఠాన్ అనే ముస్లిం అభ్యంతరం చెప్పాడు. వాదోపవాదాలు జరిగాయి. అతడి ఆదేశం మేరకు భార్య షబ్నమ్ బీజేపీ కార్యకర్తల మీద వేడినీళ్లు పోసింది. చాలా ముస్లిం దేశాలు నిషేధించిన ముస్లిం సంప్రదాయాలను ఇక్కడి ముస్లిం మతోన్మాదులు కాపాడాలని అనుకుంటూ ఉంటే, దానికి కాంగ్రెస్, ఇతర విపక్షాలు వంత పాడుతున్నాయి. సంక్షేమం, సమన్వయం, సంస్కృతీ పరిరక్షణ అన్న బీజేపీ పాలనా సూత్రాన్ని అర్థం చేసుకోవడం అందరికీ మంచిది. సనాతన ధర్మాన్ని కూకటివేళ్లతో పెళ్లగిస్తామని బీరాలు పలికే పార్టీలకు మిగిలిన పక్షాలు దూరంగా ఉంటే దేశానికి మంచిది. దేశంలో ముస్లింలు మాత్రమే మైనారిటీలు కారు. ఇది గుర్తించాలి. మైనారిటీలందరి మనోభావాలను గౌరవిస్తూనే మెజారిటీలకూ హక్కులు ఉంటాయన్న విజ్ఞతను విపక్షాలు పాటించాలి. ★



అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



38లో

కథ

**లడ్డూ పెడతా గోవిందా..!**

– కె.ఎ. మునిసురేష్ పిళ్లె




నేపాల్‌లో 'హిందూ'నినాదం (అంతర్జాతీయం) – 22
'అలివేణి' ఆణిముత్యమా!! (మహిళ) – 28
రాజకీయ 'జల'క్రీడ (ఆంధ్రప్రదేశ్) – 30
ఆధ్యాత్మికం – 34
ఇండియా కూటమి ఇక్కట్లు (ఎన్నికల ఫలశ్రుతి) – 36
పర్యావరణ కాలుష్యంపై అవగాహన.. (హితోక్తి) – 44
భారత చదరంగంలో నవతరంగం! (క్రీడ) – 43
ఇలాంటి 'యానిమల్'కు దూరంగా ఉండాలి! (సినిమా) – 50



బీజేపీ కేంద్ర కార్యాలయం(ఢిల్లీ)లో సంబరాలు..

నాలుగు మాసాలలోనే లోక్‌సభ ఎన్నికల నగారా మోగనున్న నేపథ్యంలో జరిగిన ఐదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికల ఫలితాలు వెలువడినాయి. తిరుగులేని ఒక వాస్తవాన్ని దేశ ప్రజల ముందు ఆవిష్కరించాయి. మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరం ఎన్నికల ఫలితాలు వెలువడి, వచ్చే లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో, ఎటు వైపు మొగ్గబోతున్నాయో ముందుగానే చెప్పేశాయి.

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టడానికి సిద్ధంగా ఉందన్నదే వాటి ఫలశ్రుతి.

ప్రధాని నరేంద్ర మోదీ మీద, భారతీయ జనతా పార్టీ మీద కొనసాగుతున్న విమర్శలను సాధారణ ప్రజానీకం పట్టించుకోవడం లేదని ఈ ఫలితాలు రుజువు చేశాయి. మూడు రాష్ట్రాలలో బీజేపీ విజయ దుందుభి మోగించింది. తెలంగాణలో ఒకటి నుంచి ఎనిమిది స్థానాలకు కమలం ఎగబాకింది.

ఎగ్జిట్ పోల్స్‌ను ఎగతాళి చేస్తూ మూడు ఉత్తరాది రాష్ట్రాలు బీజేపీకి తిరుగులేని ఆధిక్యాన్ని కట్టబెట్టాయి. రాజస్తాన్‌లో అడ్డూ ఆపూ లేకుండా హనుమాన్ శోభాయాత్రల మీద, రామనవమి ఉరేగింపుల మీద జరిగిన ముస్లిం మతోన్మాదుల దాడులను చూస్తూ మిన్నకున్న అశోక్ గెహ్లాత్

ప్రభుత్వానికి ప్రజానీకం ఈ విధంగా బుద్ధి చెప్పింది. పాకిస్తాన్ నుంచి ప్రాణాలు అరచేత పట్టుకుని వచ్చిన హిందూ శరణార్థుల పట్ల వ్యవహరించిన తీరుకు బ్యాలెట్ ద్వారా ప్రజలు ఇలాంటి సమాధానం చెప్పారు. గెహ్లాత్‌కూ, సచిన్ పైలట్‌కూ ఉన్న విభేదాలు కాంగ్రెస్ దుస్థితిని ఎత్తి చూపాయి. ప్రజాసేవ కంటే పదవీ వ్యామోహమే ఆ పార్టీలో ఎక్కువ అన్న వాస్తవాన్ని ఆ విభేదాలు నిరంతరం ఎత్తి చూపాయి. ఛత్తీస్‌గఢ్‌లో విజయం అనూహ్యం. ఎగ్జిట్ పోల్స్ ఇక్కడ ఒక ప్రహసనంగా మిగిలిపోయాయి.

'ఇండియా' కూటమి బతుకు బండలైంది. ఎక్కడా ఆ ఉసే లేదు. కాంగ్రెస్ వైఫల్యాన్ని ఇండియా కూటమి దాని ఖర్మగానే తీర్పు చెప్పాయి. ఇది మీ వైఫల్యం, మమ్మల్ని పిలవలేదు కదా అంటున్నాయి. మూలిగే నక్క మీద తాటికాయ పడినట్టు ఒంటరిగా పోటీ చేసి కాంగ్రెస్ ఘోర తప్పిదానికి పాల్పడిందని జేడీ(యు) తిట్ల దండకం అందుకుంది. బీజేపీ విభజన రాజకీయాల గురించి ప్రజలకు విడమరచి చెప్పడంలో కాంగ్రెస్ విఫలమై కుప్పకూలిందని కూడా ఆ పార్టీ అధికార ప్రతినిధి నీరజ్ కుమార్ తేల్చిపారేశారు. మరీ ఇంత తలబిరుసా అని జేడీ (యు) అంటే, మీది జమిందారీ పోకడ అని ఆర్జేడీ దుమ్మెత్తి పోసింది. రిపబ్లిక్ టీవీ వ్యాఖ్యానించినట్టు కాంగ్రెస్‌కు పట్టిన ఈ దీనావస్థ 'సనాతన శాప'మే కావచ్చు? సనాతన ధర్మాన్ని తిట్టిన వారిని అంటకాగితే జరిగేది ఇదే అని ప్రజలు కచ్చితంగా హెచ్చరించినట్టయింది.

ఏ ప్రభావం లేకుండా జరిగిన తెలంగాణ ఎన్నికల ఫలితాలు ఊహించినదాని కంటే ఎక్కువగానే భారత రాష్ట్ర సమితిని చావు దెబ్బ తీశాయి. ఉద్యమ పార్టీ మూడో అసెంబ్లీ ఎన్నికలలోనే మట్టి కరిచింది. నిజానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అహంకారానికి ఇది చెంపపెట్టు అన్న భావనే సర్వత్రా వినిపిస్తున్నది. కరీంనగర్‌లో బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి



జెయింట్ కిల్లర్ కె. వెంకటరమణారెడ్డి

# విజేత బీజేపీ

సంజయ్ ఓటమి ఎదురు దెబ్బ. ముఖ్యమంత్రినీ, ముఖ్యమంత్రి అభ్యర్థినీ కూడా ఓడించిన ఘనత బీజేపీకే దక్కింది. కామారెడ్డి అసెంబ్లీ స్థానంలో సంభవించిన ఈ అరుదైన విజయంతో కె. వెంకటరమణారెడ్డి జెయింట్ కిల్లర్ మకుటధారిగా మిగిలారు. ఎంఐఎం ఏడు స్థానాలలో గెలిస్తే బీజేపీ ఎనిమిది స్థానాలను గెలుచుకుని భవిష్యత్ చిత్రపటాన్ని ప్రజలకు చూపిందనే అనాలి.

కేసీఆర్ మీద ఎంతగా ప్రజాగ్రహం పెల్లుబికినదీ అంటే, మ్యాజిక్ ఫిగర్‌కు అవతల కాంగ్రెస్ సాధించిన స్థానాలు కేవలం నాలుగు. అంటే ఆ పార్టీ, ముఖ్యమంత్రి ఎంతగా అసిధారావ్రతం చేయవలసి ఉన్నదో ఊహించవచ్చు. ఏ ఒక్కరికీ ఆగ్రహం తెప్పించకూడదు. అసలే కాంగ్రెస్ హేమాహేమీలంతా నెగ్గారు.

ఈ నేపథ్యంలో ఎ. రేవంత్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది.



# మామాజీ మ్యాజిక్

విశ్లేషకుల అంచనాలను తలకిందులు చేస్తూ మధ్యప్రదేశ్‌లో అనూహ్య విజయం సాధించింది భారతీయ జనతా పార్టీ. ఒక రకంగా ఇది ప్రతిపక్ష కాంగ్రెస్‌ను చావుదెబ్బ కొట్టిన చారిత్రిక విజయం. 230 స్థానాలున్న ఆ రాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ 163 చోట్ల విజయం సాధిస్తే, కాంగ్రెస్ 66 సీట్లకే పరిమితమైంది. ఒక స్థానాన్ని భారత్ ఆదివాసీ పార్టీ దక్కించుకుంది. బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం కష్టమని, కాంగ్రెస్‌కు అవకాశాలున్నాయని ఎన్నికలకు ముందు వరకూ విశ్లేషకులు భావించారు. పోలింగ్ తర్వాత వెలువడిన ఎగ్జిట్ పోల్స్ అయితే బొటాబొటి మెజారిటీతో బీజేపీ అధికారం నిలుపుకుంటుందని చెప్పాయి. చివరకు అందరి అంచనాలు తలకిందులయ్యాయి.

నిజానికి మధ్యప్రదేశ్‌లో బీజేపీకి ఈ స్థాయి విజయం మాత్రం అనూహ్యమే. ఎందుకంటే మధ్యలో 15 నెలల కాంగ్రెస్ పాలనను మినహాయిస్తే రాష్ట్రంలో 20 ఏళ్లుగా బీజేపీదే అధికారం. ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత అంతో ఇంతో పెరిగే ఉండాలి. కానీ ఎన్నికల ఫలితాలు చూస్తే ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది.ఆ రాష్ట్ర ఓటర్లు పూర్తి సానుకూలతతో ఇచ్చిన ఓటు ఇది. ఈ ఘనత కచ్చితంగా ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌దే.. ప్రధాని మోదీ ప్రభావం దీనికి అదనం.

అంచనాలన్నీ ఉత్తి మాటలేనని చేతలలో చూపించారు శివరాజ్ సింగ్. కొద్ది నెలల క్రితం దాకా కూడా కొట్టొచ్చినట్టుగా కనిపించిన ప్రభుత్వ వ్యతిరేకతను శివరాజ్ సింగ్ సమర్థంగా అధిగమించిన వైనం అబ్బురపరిచేదే. ఈ విజయానికి దోహదం చేసిన అంశాలు ఎన్నో ఉన్నాయి.



శివరాజ్ సింగ్ చౌహాన్

**క్షేత్రస్థాయి సమన్వయం**

బీజేపీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీలోని ముఖ్య నాయకులు మొదలు క్షేత్రస్థాయి కార్యకర్తల వరకూ ఎంతో శ్రమించారు. ఆటుపోట్లను తమకు అనుకూలంగా మలుచుకోవడానికి, కేంద్ర మంత్రులు సహా అనేక మంది ప్రాంతీయ నేతలు, ఎంపీలను ఎన్నికల్లో పోటీ చేయించాల్సిన అవసరం ఉందని బీజేపీ ప్రారంభంలోనే అర్థం చేసుకుంది. వారిని పోటీకి దింపింది. శివరాజ్ సింగ్ చౌహాన్ నేతృత్వంలో క్షేత్రస్థాయిలో శ్రమించారు.

**మేరా బూత్ సబ్సే మజ్‌బూత్**

2018 అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీకి స్వల్ప దూరంలో ఆగిపోయిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి బీజేపీ ముందు నుంచే చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించింది. గత జూలై నుంచే పూర్తి స్థాయిలో రంగంలోకి దిగింది. కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జిగా, మరో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ఆయనకు డిప్యూటీగా నియమించింది. ఇంకో మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌ను పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్‌గా నియమించింది.

2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్రమోదీ భోపాల్‌లో ప్రారంభించిన 'మేరా బూత్ సబ్సే మజ్‌బూత్' ప్రచారం బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి దోహదపడింది. బీజేపీ సంస్థాగత బలం, దాని హిందుత్వ కార్డు, ప్రధానమంత్రి అభివృద్ధి మంత్రం, ప్రచారంలో జాతీయ అహంకారం గురించి మాట్లాడటం బీజేపీకి బాగా పనిచేసినట్లు కనిపించింది.

**'లాడ్లీ బహ్నా' పథకం**

శివరాజ్ సింగ్ చౌహాన్ తన ప్రభుత్వ పథకాలు, ముఖ్యంగా 'లడ్లీ బెహనా పథకం చుట్టూ బీజేపీ తన ప్రచారాన్ని నడిపించింది. రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల మహిళలకు నెలవారీ ఆర్థిక సాయం అందించే 'లాడ్లీ బెహనా' పథకాన్ని ప్రారంభించిన బీజేపీ మహిళా కార్డు అధికార పార్టీకి బాగా పనిచేసినట్లు కనిపిస్తోంది. దీనికి అదనంగా డబుల్ ఇంజన్ ప్రభుత్వం. కేంద్ర ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు కూడా ప్రజల హృదయాలను హత్తుకున్నాయని చెప్పవచ్చు.

మళ్లీ అధికారంలోకి వస్తే 'నారీ సమ్మాన్' నిధి పేరిట ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామన్న కాంగ్రెస్ హామీకి ప్రతిగా లాడ్లీ బెహనా యోజన తీసుకొచ్చారు. ప్రతి మహిళకు నెలకు రూ.1,250 చొప్పున ఇచ్చే ఈ పథకం బాగా హిట్టయింది. ఈ మొత్తాన్ని క్రమంగా నెలకు రూ.3,000కు పెంచుతానని కూడా శివరాజ్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 2.72 కోట్ల మహిళా ఓటర్లుంటే, ఏకంగా కోటిన్నర మంది మహిళలు దీని లబ్ధిదారులు! ఇది బీజేపీకి బాగా కలిసి వచ్చిందని భావిస్తున్నారు. అంతేగాక శివరాజ్‌పై అధిష్టానం అభిప్రాయాన్ని మార్చడం ద్వారా ఆయన్ను తిరిగి సీఎం అభ్యర్థి రేసులో బలంగా నిలిపింది.

**కలిసొచ్చిన మోదీ ప్రచారం**

ఈ విజయాన్ని సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రధాని మోదీ ఘనతగా అభివర్ణించారు. ఆయన నేతృత్వంలోని 'డబుల్ ఇంజిన్ సర్కార్' వల్లే ప్రజలు బీజేపీపై విశ్వాసముంచారని తెలిపారు. మరోవైపు ప్రభుత్వ పథకాలు కూడా విజయానికి బాటలు వేసినట్లు పేర్కొన్నారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్యప్రదేశ్ ప్రజల హృదయాల్లో ఉన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారు, కేంద్ర– రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రజల అభ్యున్నతికి తోడ్పాటునందించాయి. బీజేపీ శ్రేణులంతా కలిసికట్టుగా కష్టపడి పనిచేశాయి. రాష్ట్ర ప్రజల్లో అసలు ఎక్కడా ప్రభుత్వ వ్యతిరేకత లేదు. ప్రజలంతా మాతోనే ఉన్నారు. కొంత మంది కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూశారు. కానీ, ప్రజలు మమ్మల్ని విశ్వసించారు' అని అన్నారు.

**అందరివాడు ఈ మామాజీ**

మధ్యప్రదేశ్ ప్రజలు 'మామాజీ' అని అప్యాయంగా పిలుచుకునే శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సామాన్యులకు సైతం అందుబాటులో ఉండే ముఖ్యమంత్రిగా పేరుంది. రాజకీయాల్లో ఆయన అపార అనుభవశాలి. 2005 నుంచి సీఎంగా (2018–2020 మధ్య 15 నెలలు మినహా) కొనసాగుతున్నారు. అయితే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఆయన్ను దాదాపుగా పక్కన పెట్టేసినంత పనిచేసింది. ఓ దశలో తన రాజకీయ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నా ఆయన మనోధైర్యం కోల్పోలేదు. పార్టీ తరఫున విస్తృతంగా ప్రచారం నిర్వహించి మరోసారి అధికార పీఠానికి బాటలు వేశారు. కాంగ్రెస్‌తో హోరాహోరీ ఉంటుందనుకున్న పోరును కాస్తా ఏకపక్షం చేయడంలో కీలక పాత్ర పోషించారు. మధ్యప్రదేశ్ ఒక కుటుం బంగా మారిందని, ప్రజలు తమపై ఉన్న ప్రేమతో బీజేపీకి గ్రాండ్ మెజారిటీ వస్తుందని తాను ముందే చెప్పినట్లు శివరాజ్‌సింగ్ తెలిపారు. అది ప్రతిచోటా స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.

**నాలుగుసార్లు సీఎం**

శివరాజ్‌సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్‌కి నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేశారు. మొదటిసారిగా 2005లో మొదటి సారిగా సీఎం అయ్యారు. ఆ తర్వాత 2008లో రెండోసారి, 2013లో మూడోసారి సీఎంగా చేసింది. 2018 ఎన్నికల్లో మాత్రం బీజేపీకి ఎదురుదెబ్బ తగిలింది. 109 సీట్లకే ఆ పార్టీ పరిమితమైంది. 114 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్ పార్టీ, ఇతర పార్టీలు, స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ పార్టీ సీనియర్ నేత కమల్‌నాథ్ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే 2020లో ఆ పార్టీ సీనియర్ జ్యోతిరాదిత్య సింధియా సహా 22 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారడంతో కమల్‌నాథ్ ప్రభుత్వం పడిపోయింది. దీంతో శివరాజ్ సింగ్ చౌహాన్ నాలుగో సారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ పరిణామం తర్వాత ఈసారి మధ్యప్రదేశ్‌లో బీజేపీ సర్కారు మళ్లీ రావడం కష్టమని భావించినా, తన పని తీరుతో అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారు.

**కాంగ్రెస్ సమన్వయ లోపం**

శివరాజ్ సింగ్ వివాదాలకు దూరంగా నిరాడంబరతపై రాష్ట్ర ప్రజల్లో మొదటి నుంచీ ఉన్న సానుకూల భావన ఓట్ల రూపంలోనూ ప్రతిఫలించింది. మరోవైపు, కాంగ్రెస్ పార్టీని సమన్వయ రాహిత్యం ఈసారి బాగా దెబ్బ తీసింది. పీసీసీ చీఫ్ కమల్‌నాథ్, అగ్రనేత దిగ్విజయ్‌సింగ్ మధ్య విభేదాలు ప్రచార పర్వంలో పలుసార్లు తెరపైకి వచ్చాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష 'ఇండియా' కూటమిలో భాగంగా ఉన్నప్పటికీ మధ్యప్రదేశ్ ఎన్నికల్లో ఒంటరిగా బరిలో దిగిన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), జేడీయూ, ఆప్‌లకు రిక్తహస్తాలే మిగిలాయి.

**దిగ్విజయ్‌కు ఘోర పరాభవం**

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్‌కు ఈ ఎన్నికలు ఘోర పరాభవాన్ని మిగిల్చాయి. ఆయన కుటుంబ సభ్యులు, మద్దతుదారులలో చాలా మంది ఓటమిని చవిచూశారు. ఆయన సోదరుడు లక్ష్మణ్ సింగ్, మేనల్లుడు ప్రియవ్రత్ సింగ్ సహా చాలా మంది బంధువులు వారి వారి నియోజకవర్గాల్లో పరాజయాన్ని మూటకట్టుకున్నారు. ఆయన కొడుకు జైవర్ధన్ సింగ్ మాత్రమే రఘోఘర్ నియోజకవర్గం నుంచి స్వల్ప మెజారిటీతో గట్టెక్కారు. ఇక దిగ్విజయ్ మద్దతుదారులు అనేక మంది ఈ ఎన్నికల్లో మట్టికరిచారు. ముఖ్యంగా లహర్ నియోజకవర్గం నుంచి డాక్టర్ గోవింద్ సింగ్, రౌ నియోజకవర్గం జీతూ పట్వారీ ఓటమిపాలయ్యారు.

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను మాజీ సీఎం, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కమల్‌నాథ్ కలిశారు. రాజధాని భోపాల్‌లోని శివరాజ్ సింగ్ చౌహాన్ నివాసానికి వచ్చిన కమల్‌నాథ్ ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా శివరాజ్ సింగ్ చౌహాన్.. కమల్‌నాథ్‌ను సాదరంగా ఆహ్వానిస్తూ ఇంట్లోకి తీసుకెళ్లారు.



కమలనాథ్ దిగ్విజయ్ సింగ్

**ఓటమికి కమల్‌నాథ్ కారణం.. సంజయ్ రౌత్**

మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ ఓటమికి కాంగ్రెస్ నాయకుడు కమల్ నాథ్ కారణమని శివసేన (ఉద్ధవ్) నాయకుడు సంజయ్ రౌత్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ కొన్ని సీట్లను ఇండీ కూటమిలోని భాగస్వామ్యులతో పంచుకుని ఉంటే మరోలా ఉండేదన్నారు. సమాజ్‌వాదీ పార్టీతో సీట్లు పంచుకోవాలనే ఆలోచనను కమల్‌నాథ్ వ్యతిరేకించారని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ వంటి నేతలు చురుగ్గా ప్రచారం చేసినప్పటికీ మధ్యప్రదేశ్‌లో ఓటమికి కమల్‌నాథ్ కారణమని, విపక్ష కూటమితో కలిసి కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదని అభిప్రాయపడ్డారు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



రమణ్ సింగ్

పోగొట్టుకున్న కంచుకోటను తిరిగి కైవసం చేసుకుంది బీజేపీ. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు పూర్తి భిన్నంగా.. కాంగ్రెస్‌ను ఓడించి ఘన విజయం సాధించింది ఛత్తీస్‌గడ్ కమలదళం. 2018 ఎన్నికల్లో 90 సీట్లలో కేవలం 15 స్థానాలకే పరిమితమైన బీజేపీ , ఐదేళ్లలో అసాధారణ రీతిలో పుంజుకుని 54 స్థానాలతో మేజిక్ ఫిగర్ దాటింది. కాంగ్రెస్ పాలనలో జరిగిన తప్పులను ఎండగట్టి విజయం సాధించింది. కాంగ్రెస్ 35 చోట్ల గెలుపొందింది. గోండ్వానా గణతంత్ర పార్టీకి ఒక్క సీటు వచ్చింది.

# తిరిగి దక్కిన కంచుకోట


ఈ కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి టీఎస్ సింగ్ దేవ్ సహా భూపేష్ బఘేల్ సర్కారులో కొందరు మంత్రులకు పరాజయం తప్పలేదు. సింగ్ దేవ్ తన సొంత నియోజకవర్గం అంబికాపుర్‌లో 94 ఓట్ల తేడాతో ఓడిపోయారు. హోంమంత్రి తమ్రాధ్వజ్ సాహు, వ్యవసాయ శాఖ మంత్రి రవీంద్ర చౌబే సహా మొత్తం 9 మంది మంత్రులు పరాజయం పాలయ్యారు. ఈసారి అసెంబ్లీలో రాజవంశీయులకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. కాంగ్రెస్, బీజేపీ, ఆప్ నుంచి పోటీ చేసిన ఏడుగురు రాజవంశీయులు ఓటమి చెందడమే ఇందుకు కారణం

**ఎదురుదెబ్బ నేపథ్యంలో..**

ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ వరుసగా 15 ఏళ్ల పాటు అధికారంలో ఉండటంతో ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడి 2018 ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయింది. అప్పుడు రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ విజయం సాధించింది. ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన భూపేష్ బఘేల్ పలు సంక్షేమ, ప్రజాకర్షక పథకాలు ప్రారంభించారు. రైతులు, గిరిజనులు, పేదలను ఎవరినీ వదలకుండా అందరికీ సాయం అందేలా చూశారు. ముఖ్యంగా వరికి ఆయన అందిస్తున్న బోనస్ సూపర్ హిట్టయింది. మళ్లీ గెలిస్తే పథకాన్ని మరింత విస్తరిస్తామని కూడా కాంగ్రెస్ ప్రకటించింది. భూమిలేని కార్మికులకు వార్షిక ఆర్థిక సాయం రూ.10 వేలకు పెంచుతామని, కేజీ టు పీజీ ఉచిత విద్య, 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ సహా పలు హామీలెన్నో కాంగ్రెస్ ఇచ్చింది.

**మోదీ గ్యారంటీలు**

కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలకు పోటీగా బీజేపీకీ కూడా 'మోదీ గ్యారంటీలు' పేరుతో పథకాలు ప్రకటించింది. క్వింటాల్‌కు రూ.3,100 చొప్పున ఎకరాకు 21 క్వింటాళ్లను సేకరిస్తామని పేర్కొంది. ప్రతి వివాహితకూ ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం, పీఎం ఆవాస్ యోజన కింద 18 లక్షల ఇళ్ల నిర్మాణం, పేదలకు రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, కాలేజీ విద్యార్థులకు ప్రయాణ భత్యం, నిరుపేద కుటుంబంలో పుట్టే ఆడపిల్లకు రూ.1.5 లక్షలు తదితరాలెన్నో ప్రకటించింది. ఇవన్నీ ప్రజలపై



భూపేష్ బఘేల్

సింగ్‌దేవ్

బాగా ప్రభావం చూపాయి. చివరికి బఘెల్ సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ కొత్త హామీల కంటే బీజేపీ 'మోదీ గ్యారంటీ'ల వైపే ప్రజలు మొగ్గు చూపారు.

**'మహదేవ్' ఆరోపణలు...**

పోలింగ్ సమీపిస్తున్న సమయంలో వెలుగు చూసిన మహదేవ్ బెట్టింపు ఆరోపణలు కాంగ్రెస్‌ను దెబ్బతీశాయి. సీఎం బఘెల్‌పై ముసురుకున్న బెట్టింగ్ యాప్ ముడుపుల ఆరోపణలు కాంగ్రెస్‌కు బాగా చేటు చేశాయి. ఈ ఉదంతంలో ఒక కొరియర్‌ను అరెస్టు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రకటించడం, దుబాయ్‌కి చెందిన మహదేవ్ బెట్టింగ్ యాప్ నుంచి బఘెల్‌కు ఏకంగా రూ.508 కోట్ల మేరకు ముడుపులు అందించినట్టు అతడు చెప్పాడని పేర్కొనడం సంచలనం రేపింది.

దీనికి తోడు బొగ్గు గనులు, ఆవు పేడ సేకరణ పథకం, డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ వంటి వ్యవహారాల్లో అవినీతికి పాల్పడినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపణలు ఎదుర్కొంది. వీటికి సంబంధించిన కేసుల్లో ఈడీ దర్యాప్తు చేస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ, జేపీ నడ్డా, అమిత్ షా వంటి బీజేపీ అగ్రనేతలు వీటిని విమర్శనాస్త్రాలుగా ఎక్కుపెట్టి బఘెల్ సర్కార్‌ను దోషిగా చూపే ప్రయత్నం చేశారు. ఛత్తీస్‌గడ్ కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిందనే ఆరోపణలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లింది బీజేపీ.

గిరిజనులు అధికంగా ఉండే ప్రాంతాలు, ముఖ్యంగా బస్తర్ డివిజన్‌లో మత మార్పిడిపై గత రెండేళ్లలో అనేక గొడవలు జరిగాయి. క్రైస్తవ మతంలోకి మారిన గిరిజనులు, మారని వారి మధ్య హింసాత్మక ఘర్షణలు చోటుచేసుకున్నాయి. అయితే మత మార్పిడులకు పాల్పడిన వారిని ప్రభుత్వం కాపాడటం విమర్శలకు దారి తీసింది. ఈ పరిణామాలు ప్రజల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకతను పెంచాయి.

**మాట తప్పిన అధిష్టానం**

కాంగ్రెస్ పార్టీ 2018లో ఛత్తీస్‌గఢ్‌లో అధికారం చేపట్టినప్పుడు ముఖ్యమంత్రి పదవి కోసం రాజవంశస్థుడైన టీఎస్ సింగ్ దేవ్ కూడా పోటీ పడ్డారు. అయితే అధిష్టానం భూపేష్ బఘెల్‌కు సీఎం పదవి కట్టబెడుతూ సింగ్‌దేవ్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం తొలి రెండున్నరేళ్లు బఘేల్, తదుపరి రెండున్నరేళ్లు సింగ్‌దేవ్ ముఖ్యమంత్రి పదవిలో ఉంటారు. అయితే ఒప్పందం ప్రకారం రెండున్నరేళ్లు గడచినా సింగ్‌దేవ్‌కు ఈ పదవి దక్కలేదు. దీంతో అధిష్టానంపై ఆగ్రహంతో రగిలిపోయారాయన. ఈ అంతర్గత విభేదాలు కాంగ్రెస్ ఓటమికి దారి తీశాయి

**కలిసొచ్చిన ప్రక్షాళన**

ఛత్తీస్‌గఢ్‌లో 2018లో ఓటమి తర్వాత బీజేపీ కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఛత్తీస్‌గఢ్ పార్టీ విభాగం అధ్యక్షుడిని మూడుసార్లు మార్చింది. అసెంబ్లీలో విపక్ష నేతను కూడా ఇటీవల మార్చింది. మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్‌ను సైతం పక్కన పెట్టింది. పార్టీని నడిపించే బలమైన నాయకుడు లేకపోవడం లోటే అయినా ఏకపక్ష నాయకత్వం, కుటుంబ రాజకీయాలు ఉండరాదని ప్రధాని నరేంద్ర మోదీ భావించారు. అందుకే మోదీ కరిష్మాతోనే ఛత్తీస్‌గఢ్‌లోనూ పోరాడాలని బీజేపీ నిర్ణయించింది. డబుల్ ఇంజిన్ సర్కార్ నినాదంతో కమలదళం ప్రజల్లోకి వెళ్లింది. ఇందులో బీజేపీ అనూహ్యంగా విజయం సాధించింది.

**ప్రధాని మోదీ ప్రచారం**

వీటన్నింటికీ తోడుగా ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలతో హోరెత్తించారు. డబుల్ ఇంజన్ సర్కారుకు అవకాశమిస్తే అభివృద్ధి పథంలో పరుగులు తీయిస్తామని చెప్పుకొచ్చారు. అధికారమే లక్ష్యంగా ఛత్తీస్‌గడ్‌లో మోదీ, అమిత్ షా సుడిగాలి పర్యటనలు చేశారు. కేంద్ర మంత్రులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రెండు విడతల్లో జరిగిన పోలింగ్ కోసం 40 మంది స్టార్ క్యాంపెయినర్లను రంగంలోకి దించింది కమలదళం. అభ్యర్థుల్లో ప్రముఖ నటులు, మాజీ ఐఏఎస్ అధికారులకు ప్రాధాన్యం ఇచ్చింది. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఓట్లును మలచుకోవడంలో సఫలమైంది.

**సత్తా చాటుకున్న కూలీ**

సీఎం భూపేష్ బెఘెల్ సంతుష్టీకరణ రాజకీయాలకు చెంప పెట్టులాంటి పరిణామం ఒకటి ఈ ఎన్నికల్లో చోటు చేసుకుంది. ఈ ఎన్నికల్లో ఒక అభ్యర్థి విజయం అందరి దృష్టినీ ప్రధానంగా ఆకర్షించింది. అతడు దినసరి కూలీ ఏడుసార్లు ఎంఎల్ఏగా గెలిచిన అభ్యర్థిని ఓడించాడు. సాజా


ఈశ్వర్ సాహు

నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంఎల్ఏ రవీంద్ర చౌబే మీద బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఈశ్వర్ సాహు 5,527 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. సాహు ఎన్నికల్లో పోటీ చేయడానికి ఒక కారణం ఉంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆయన సాజా అసెంబ్లీ నియోజకవర్గంలోని బీరాన్‌పూర్ గ్రామంలో మతపరమైన అల్లర్లు జరిగాయి. ఈ ఘటనలో మొత్తం ముగ్గురు చనిపోయారు. వారిలో ఈశ్వర్ సాహు కుమారుడు భువనేశ్వర్ సాహు కూడా ఉన్నాడు. ఈ ఘటనలో భూపేష్ బఘెల్ ప్రభుత్వం దోషులను శిక్షించంలో విఫలమైంది. ఎమ్మెల్యే రవీంద్ర చౌబే దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. ఒక మతస్తులను ప్రభుత్వం వెనుకేసుకు వచ్చిందనే విమర్శలు వచ్చాయి.

సాహు కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ప్రకటించినట్లు తెలిసింది. కానీ ఈశ్వర్ సాహు దానిని తీసుకోవడానికి నిరాకరించాడు. నిందితులకు శిక్ష పడాల్సిందేని డిమాండ్ చేశాడు. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఈశ్వర్ సాహు బీజేపీ టికెట్ మీద పోటీ చేశారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే రవీంద్ర చౌబేను ఓడించి ప్రతీకారం తీర్చుకున్నాడు. ★





కేసీఆర్

అధికారం శాశ్వతం కాదని తెలియనంత అమాయకులు కారు రాజకీయ నాయకులు. కానీ ఒక దశలో అధికార మత్తు వారిని ఈ వాస్తవం నుంచి కాస్త దూరంగా నెడుతుంది. అయితే ప్రజలు ఐదేళ్ల తరువాత ఓటుతో కిందకు లాగిపడేస్తారు. అప్పుడు మాత్రమే రాజకీయ పార్టీలకు, వాటి నేతలకు జ్ఞానోదయం అవుతుంది. ఇప్పుడు తెలంగాణలో జరిగింది ఇదే. తెలంగాణ ప్రజలు ప్రత్యామ్నాయం కోరుకున్నారు. కల్వకుంట్ల చంద్రశేఖరరావు వైఖరి మీద, అహంకారం మీద వారు ఆగ్రహించారు. అధికారాంతమందు ఆయన కాంగ్రెస్ పార్టీ వ్యవహార సరళిని నాలుగు మాసాలు పాటు పరిశీలిద్దాం అని పార్టీ సమావేశంలో అన్నట్టు వార్త వచ్చింది. ఏమైనా తెలంగాణ ప్రజలు తెలంగాణ ఉద్యమ పార్టీ బీఆర్ఎస్‌ను కోలుకోలేని దెబ్బ తీశారు. కాంగ్రెస్‌పార్టీకి అధికారం కట్టబెట్టారు. మరోవైపు తాము గెలవడం పక్కనబెట్టి భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు సర్వశక్తులూ ఒడ్డిన బీఆర్ఎస్‌కు ఓటర్లు తమదైన పాఠం నేర్పారు. ఫలితంగా బీజేపీకి చెందిన ముఖ్యనేతలు ఓటమి పాలైనప్పటికీ అసెంబ్లీలో బీజేపీ బలం రెట్టింపు కన్నా ఎక్కువయ్యింది. ఈ పరిణామం రాష్ట్ర ప్రజల చైతన్యానికి నిదర్శనం. అధికారమే పరమావధిగా భావించే వాళ్లకు చెంపపెట్టులా మారింది.

# ఉద్యమ పార్టీకి ఉద్వాసన

# మార్పు కోరిన

2023 తెలంగాణ ఎన్నికలు కొన్ని పార్టీల నాయకుల భ్రమలను పటాపంచలు చేశాయి. కమ్యూనిస్టులు తెలంగాణ గురించి, ఇక్కడి పోరాటాల గురించి మాట్లాడే హక్కు తమకు తప్ప వేరొకరికి ఉండదని గట్టిగా నమ్ముతారు. కానీ అది వట్టి భ్రమ అని ఈ ఎన్నికలలో ఓటర్లు తేల్చేశారు. కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్న సీపీఐ తనకు కేటాయించిన ఒక్క స్థానం (కొత్తగూడెం) గెలుచుకుంది. 19 స్థానాలలో పోటీ చేసిన సీపీఎం ఒక్కచోట కూడా డిపాజిట్ దక్కించుకోలేకపోయింది. హిందూ వ్యతిరేక ముద్ర ప్రబలంగా ఉన్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో పోటీచేసిన బీఎస్పీ కూడా ఎక్కడా డిపాజిట్‌కు నోచుకోలేదు. అలాగే బీజేపీ ఇచ్చిన ఎనిమిది స్థానాలలోను జనసేన పార్టీ కంగు తినవలసి వచ్చింది. బీజేపీ బలహీన పడడం కాంగ్రెస్‌కు లాభించింది. గ్రేటర్ హైదరాబాద్ ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాలలో బీజేపీ తన బలాన్ని నిలుపుకోవడమో, పెంచుకోవడమో జరిగిందన్నది నిజం. లేకపోతే బీఆర్ఎస్ గౌరవ ప్రతిపక్ష స్థానం దక్కించుకుని ఉండేది కాదు. బీఆర్ఎస్ ప్రజాగ్రహం ఎంతటిది అంటే, కేవలం 11 మంది యాభయ్ శాతం ఓట్లతో గెలిచారు.

ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రమంతటా ఆసక్తికర చర్చ మొదలయ్యింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఏ వాదన గెలిచింది? ఏ అంశం ప్రజల్లోకి బలంగా వెళ్లింది? ఓటరు దేన్ని విశ్వసించాడు? దేనికి ప్రభావితుడయ్యాడు? అనే సందేహాలు అందరి మదినీ తొలుస్తున్నాయి. రాజకీయ పార్టీల విశ్లేషణ కూడా ఈ కోణంలోనే సాగుతోంది. అయితే, మొత్తానికి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రత్యేక రాష్ట్రంలో ప్రత్యామ్నాయమే అత్యావశ్యకమని ఓటర్లు భావించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యామ్నాయ పాలన కోరుతూ ప్రజలు తీర్పు ఇచ్చారు. ముఖ్యంగా యువ ఓటర్లు, కొత్తగా ఓటు హక్కు పొందిన వాళ్లు, నిరుద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. ఇలా జనం మదిలో ఫిక్సయిన ప్రభుత్వ వ్యతిరేక ఓటును కాంగ్రెస్ పార్టీ కొల్లగొట్టుకు పోయింది. పదేళ్లుగా కొనసాగిన బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావాలన్న దాంతో కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారు. ప్రధానంగా నిరుద్యోగులు, యువత మార్పునకు నాంది పలికారు. బీఆర్ఎస్ మరోసారి అధికారం చేజిక్కించుకోవడానికి సర్వశక్తులు ఒడ్డింది. రైతుల, పింఛనర్ల ఓట్లను కాపాడుకోవడంలో బీఆర్ఎస్ గట్టి ప్రయత్నం చేసింది. కానీ, అర్బన్ ప్రాంతంలోని ఓటు బ్యాంక్‌ను మాత్రమే వాడుకోవడంలో బీఆర్ఎస్ విజయం సాధించింది. గ్రామీణ ప్రాంతంలో.. నిరుద్యోగ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు.

ఈసారి ప్రధాన పార్టీలు మేనిఫెస్టోలో అన్ని వర్గాలకూ ప్రాధాన్యమిచ్చే ప్రయత్నం చేశాయి. సంక్షేమ పథకాల హామీల్లో ప్రధాన పార్టీలూ పోటీ పడ్డాయి. ఈ క్రమంలో సామాజిక సమీకరణలనూ తెర మీదకు తెచ్చాయి. ఇవి ఓట్లు రాలుస్తాయని భావించాయి. అయితే ఈసారి ప్రజాక్షేత్రంలో పార్టీల ప్రచారం, నినాదాలు ఒక స్థాయి వరకే పరిమితం కాలేదు. ఎన్నికల వేడి పెరిగే కొద్దీ కొత్త అంశాలను అస్త్రాలుగా ఎంచుకున్నాయి. ఈవీఎంలు ఫలితాలు

# తెలంగాణ

సుజాత గోపగోని, 6302164068

నిర్దేశించిన తర్వాత మాత్రం కొన్ని అంశాలే ఈసారి బలమైన ప్రభావం చూపాయనేది సుస్పష్టంగా అర్థమయ్యింది.

తెలంగాణ ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ పోల్స్‌కు తగ్గట్టే ఉన్నా కొన్ని నియోజకవర్గాలు, కొందరి ఫలితాలు మాత్రం ఊహించనివిగా మారాయి. కొందరు ఉద్దండులు ఓటమి పాలైతే, కొన్నిచోట్ల సామాన్యులు విజయం సాధించారు. కొందరైతే యథావిధిగా భారీ మెజార్టీ నమోదు చేశారు. 119 నియోజకవర్గాలున్న అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ 64 స్థానాల్లో గెలుపొందింది. రెండుసార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ 39 స్థానాలకు పరిమితమైంది. బీజేపీ అనూహ్యంగా పుంజుకుని 8 స్థానాలు కైవసం చేసుకుంటే మజ్లిస్ తన 7 స్థానాల్ని పదిలం చేసుకుంది. కాంగ్రెస్ పొత్తుతో సీపీఐ ఒక స్థానాన్ని దక్కించుకుంది. తెలంగాణ ఓటరు మార్పు కోరుకోవడంతో పదేళ్ల ఉద్యమపార్టీ పాలనకు బ్రేక్ పడింది.

కుత్బుల్లాపూర్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి వివేకానంద్ రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థిపై 85 వేల మెజార్టీతో గెలిచారు. తరువాత సిద్దిపేట నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి హరీష్ రావు 82 వేల ఓట్లతో విజయం సాధించారు. కానీ ఇక్కడ గత ఎన్నికల కంటే ఆయన మెజారిటీ ఈసారి తగ్గిన వాస్తవాన్ని కూడా చూడాలి. ఇక మూడో స్థానంలో చాంద్రాయణ గుట్ట నుంచి ఎంఐఎం అభ్యర్థి అక్బరుద్దీన్ ఒవైసీ 81 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు. కూకట్‌పల్లి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు 70 వేల ఓట్ల మెజార్టీ సాధించారు. ఐదవ స్థానంలో ఎస్సీ రిజర్వ్‌డ్ నకిరేకల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం 68 వేల ఓట్లతో గెలిచారు.

బీజేపీ హేమాహేమీలు బండి సంజయ్, ధర్మపురి అరవింద్, ఈటల రాజేందర్, రఘునందన్‌రావులు ఓటమి పాలయ్యారు. జనసేన పోటీ చేసిన 8 స్థానాల్లో అభ్యర్థులు డిపాజిట్ కోల్పోయారు. బీజేపీ హేమాహేమీలు ఓడినా... 8 స్థానాల్లో విజయం సాధించడం ఆ పార్టీకి ఉపశమనం ఇచ్చింది. అంతేకాదు.. బీజేపీ ఓట్ల శాతం కూడా గణనీయంగా పెరిగింది.

రెండు పర్యాయాలు పాలించిన బీఆర్ఎస్‌గా మారిన టీఆర్ఎస్ అభివృద్ధి మంత్రంతో మూడోసారి అధికారమివ్వాలంటూ, హ్యాట్రిక్ విజయాన్ని అందించాలంటూ ఓటర్లను కోరింది. దీన్ని బలమైన నినాదంగా ఆ పార్టీ భావించింది. అటు.. కాంగ్రెస్ పార్టీ..'మార్పు కావాలి.. కాంగ్రెస్ రావాలి' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లింది. ఒక్క అవకాశం ఇవ్వాలనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థన.. బీఆర్ఎస్ నినాదం కన్నా ఎక్కువ ప్రభావం చూపినట్టు ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. సంప్రదాయ కాంగ్రెస్ నినాదాలకు విరుద్ధంగా అందరికీ అర్థమయ్యే భాషలో తీసుకెళ్లిన మార్పు కావాలనే నినాదం బలంగా పనిచేసిందంటున్నారు విశ్లేషకులు.

ఒక్క గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతం మినహా రాష్ట్రమంతటా బీఆర్ఎస్ ఈసారి ప్రతికూలతను చవి చూసింది. ఈ పరిణామం ఆ పార్టీ ముఖ్యనేతల్లో తీవ్ర కలకలం రేపింది. తిరుగులేదని భావించిన ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీలతో పాగా వేసింది. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో కొద్దిపాటి కొత్తదనాన్ని జొప్పించడం ఆ పార్టీకి కలిసివచ్చింది. మహిళలకు రూ. 2500, కౌలు రైతులు, రైతుకూలీలకు సహాయం కాంగ్రెస్ మేనిఫెస్టోలో కనిపించిన కొత్త అంశాలు. ఇవి జనంలోకి బాగా చొచ్చుకెళ్లాయి. గ్రామీణ మహిళా ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టంగట్టడం చూస్తుంటే ఈ నినాదాలు ఆకట్టుకున్నాయనేది అర్థమవుతోంది.

ఇక, ఈసారి యువ ఓటర్లు, కొత్తగా ఓటుహక్కు పొందిన ఓటర్లు పోలింగ్‌కు పోటెత్తారు. ఓట్లేయడానికి బారులు తీరారు. అయితే, అధికార బీఆర్ఎస్‌కు కాకుండా.. గంపగుత్తగా కాంగ్రెస్ పార్టీకి కొత్త ఓటర్లు ఓట్లేశారు. ఉద్యోగాలిస్తామన్న కాంగ్రెస్ హామీకి... జాబ్ క్యాలెండర్‌ను జోడించడం కూడా యువతలో మరింత నమ్మకాన్ని చేకూర్చింది. అధికార పార్టీ అవినీతి నినాదాన్ని బలంగా విన్పించే ప్రయత్నం చేసినా, బీఆర్ఎస్ బలమైన స్థానాలే కాదు.. కాంగ్రెస్ బలమైన స్థానాల్లోనూ దీని ప్రభావం కనిపించలేదు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అన్న రాజకీయ నినాదం కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది. దీనివల్ల ప్రయోజనమూ పొందింది. కొన్ని వర్గాల ఓట్లు కాంగ్రెస్‌కు ఏకపక్షంగా మళ్లడం ఫలితాల్లో ఎన్నికల స్పష్టంగా కన్పిస్తోంది.



రేవంత్ రెడ్డి

భారత రాష్ట్ర సమితి తన పదేళ్ల పాలనలో అభివృద్ధి అంటూ నినాదాన్ని తలకెత్తుకుంది. ఆ వాదననే నమ్ముకుంది. తాము రెండుసార్లు అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన సంక్షేమ పథకాలు.. కొత్త కొత్త పథకాలను ప్రవేశపెట్టడం వంటి అంశాలనే ప్రచార ఆయుధంగా చేసుకుంది. రైతుబంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, పెన్షన్లను తమకే ప్రత్యేకమైనవిగా నినాదాలుగా మార్చింది. పాజిటివ్ మార్గంలోనే ఓటర్లను ప్రభావితం చేసేందుకు శాయశక్తులా ప్రయత్నం చేసింది. ప్రతీ పథకంలోనూ మరింత పెంపును జోడించింది. ఇప్పుడు చెల్లిస్తున్న మొత్తాలను దశల వారీగా భారీగా పెంచుతామని ఎర వేసింది.

కానీ, రానురాను బీఆర్ఎస్ ప్రచార సరళి మార్చింది. పాజిటివ్ నుంచి కాంగ్రెస్‌పై విరుచుకుపడే నెగెటివ్ సరళిని ఎంచుకుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించిన బీఆర్ఎస్ ఈ వ్యూహాన్ని అనివార్యంగా భావించింది. తమ ఎన్నికల ప్రసంగాల్లో సంక్షేమ పథకాల గురించి చెప్పడం మానేసి ప్రచార సరళిని మార్చేసింది. కాంగ్రెస్‌పైకి విమర్శల బాణం ఎక్కుపెట్టింది. మళ్లీ కాంగ్రెస్ వస్తే... కరెంట్ ఉండదు.. మత కలహాలు వస్తాయి... ముఖ్య

మంత్రులు మారతారు... అభివృద్ధి కుంటుపడుతుందనే అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. రాజకీయ ప్రత్యర్థి కాంగ్రెస్ దూకుడుకు ఈ వ్యూహం కళ్లెం వేస్తుందని భావించింది. కానీ, నెగెటివ్ ప్రచార సరళి అప్పటి వరకూ జరిగిన పాజిటివ్ ఓటింగ్ వేవ్‌ను డామినేట్ చేసిందని విశ్లేషకులు అంటున్నారు. అంతేకాదు.. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై అసంతృప్తి వల్ల నష్ట నివారణకు.. ముఖ్యమంత్రిగా తన వ్యక్తిగత ఇమేజ్‌తో ఓట్లు రాబట్టే ప్రయత్నం చేశారు కేసీఆర్. కానీ, ప్రజాక్షేత్రాన్ని ఇవేవీ అందుకోలేకపోయాయి.

ఇక, భారతీయ జనతాపార్టీకి ఓట్లు, సీట్లూ రెండూ పెరిగాయి. ఒకరకంగా కింగ్‌మేకర్ పాత్ర పోషించే అవకాశం వస్తుందని భావించినప్పటికీ.. ఆశించదగిన స్థాయిలోనే సీట్లు వచ్చాయి. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షాల ప్రచారమే బీజేపీకి కలిసివచ్చిందంటున్నారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌కు పాజిటివ్‌గా ఉన్నప్పటికీ.. ఓటర్లు ఈసారి బీజేపీకి భారీగానే ఓట్లు వేశారు. ఏడాది క్రితం ఊహించని స్థాయిలో ఊపు పెంచిన బీజేపీ ఎన్నికల సమయంలో కాస్త తగ్గినట్లు అయ్యింది. కానీ, ఆశాజనకమైన ఫలితాలనే అందుకుంది. ప్రధానంగా తాము అధికారంలోకి వస్తే బీసీలకే పెద్దపీట వేస్తామని బీజేపీ చెప్పింది. అంతేకాదు.. బీసీ నాయకుడినే ముఖ్యమంత్రిగా చేస్తామని ప్రకటించింది. జాతీయస్థాయి నేతలు కూడా ఈ అంశాన్ని ప్రజల్లోకి బాగానే తీసుకెళ్లారు. అయితే, బీసీలుగా చెప్పుకునే బలమైన నేతలు బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్ ఓటమి పాలయ్యారు.

అటు.. జాతీయస్థాయిలో చూస్తే.. ప్రధానంగా ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరిగాయి. ఈశాన్య రాష్ట్రం మిజోరంను మినహాయిస్తే.. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ బోల్తాపడింది. ఒక్క తెలంగాణలో మాత్రమే ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఆ పార్టీకి కలిసివచ్చింది. అక్కడ భారతీయ జనతాపార్టీ ప్రభంజనం కనిపించింది.

**రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలి సంబరం**

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత తొలిసారి గాంధీభవన్ పరిసరాలు కళకళలాడాయి. గత పదేళ్లుగా జరిగిన ఏ ఎన్నికల్లోనూ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఎప్పుడు ఎన్నికల ఫలితాలు వచ్చినా గాంధీభవన్ బోసిపోతూ కనిపించేది. కానీ, ఇప్పుడు దానికి భిన్నంగా గాంధీభవన్‌లో హడావుడి నెలకొంది. ఫలితాలు అనుకూలంగా రావటంతో పార్టీ శ్రేణులు గాంధీభవన్ బాట పట్టాయి. నృత్యాలు చేస్తూ కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. జిల్లాలు, నియోజకవర్గ కేంద్రాల్లోనూ కేడర్ సంబురాలు చేసుకుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్



వెంకటరమణారెడ్డి, మోదీ

## ఉప ఎన్నిక తప్పించిన

# జెయింట్ కిల్లర్

అన్నింటికంటే ముఖ్య పరిణామం కామారెడ్డి నియోజకవవర్గం. ఈ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్, కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థి రేవంత్ రెడ్డి ఇద్దరినీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఓడించారు. వాళ్లిద్దరూ ప్రధాన పార్టీల రాష్ట్ర అధ్యక్షులు. వాళ్లిద్దరిపై కాటిపల్లి వెంకటరమణారెడ్డి అనూహ్యవిజయం సాధించి జెయింట్ కిల్లర్‌గా నిలిచారు. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది... అనునిత్యం జనానికి అందుబాటులో ఉండే వెంకటరమణారెడ్డికి నియోజకవర్గంలో బలమైన కేడర్ ఉంది. ఆయనకు సేవాగుణం, స్థానికుడు అన్న సెంటిమెంట్ కలిసి వచ్చి, రెండు దిగ్గజాలను ఓడించారు. ఆయన్ని అభిమానంతో గెలిపించుకున్న కామారెడ్డి ఓటర్లు ఉపఎన్నిక అవసరాన్ని తప్పించారు.

ఇటు కేసీఆర్.. అటు రేవంత్ రెడ్డి .. కామారెడ్డి నియోజకవర్గానికి ఇద్దరూ కొత్త అభ్యర్థులే ... పోటీ వీరిద్దరి మధ్యేనని అనుకున్నారంతా... ప్రచారమంతా వీరి చుట్టూనే సాగింది ... కౌంటింగ్ సగం పూర్తయ్యే దాకా కూడా వారి మధ్య పోరు నువ్వా నేనా అన్నట్లుగా సాగింది. అయితే ఉన్నట్టుండి ఆ ఇద్దరు దిగ్గజాల్ని వెనక్కి నెట్టి లీడ్‌లోకి వచ్చారు బీజేపీ అభ్యర్థి. ఆ ఆధిక్యాన్ని చివరిదాకా నిలుపుకున్నారు. వారిపై విజయం సాధించి జెయింట్ కిల్లర్‌లా అవతరించారు. ఎవరూ ఊహించని రీతిలో కామారెడ్డిపై బీజేపీ జెండా ఎగరేశారు.

ఐదేండ్లుగా ప్రజల్లోనే ఉన్న వెంకట రమణారెడ్డి నిత్యం ప్రజా సమస్యలపై ఉద్యమిస్తూ వచ్చారు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా నిరుడు రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించారు. మాస్టర్ ప్లాన్‌తో మున్సిపాలిటీలో విలీనమైన 9 గ్రామాల రైతులు నష్టపోతారని వ్యతిరేకించారు. విలువైన భూములను గ్రీన్ జోన్‌గా, ఇండస్ట్రియల్ జోన్‌గా ప్రకటించడం, అవసరం లేని ఏరియాల్లో 100 ఫీట్ల రోడ్లకు ప్రతిపాదనలు వంటి వాటిని మాస్టర్ ప్లాన్‌లో పేర్కొనడంపై రైతుల్లో చైతన్యం తెచ్చి వారి పక్షాన ఉద్యమం నడిపారు. నెలరోజుల పాటు వివిధ రూపాల్లో సాగిన ఉద్యమం ఇతర ప్రతిపక్షాలను కదిలించింది పరిస్థితులు చేజారుతున్నాయని భావించిన ప్రభుత్వం దిగి వచ్చి మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తున్నట్లు మున్సిపాలిటీలో తీర్మానం చేయించింది. అలా వెంకటరమణారెడ్డి రైతు జనానికి ఆప్తులయ్యారు.

డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ బకాయిలపైనా వెంకటరమణారెడ్డి పోరాటం చేశారు. కామారెడ్డి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల మహిళలతో కలిసి వరుసగా ఆయన ఆందోళనలు చేశారు. దాంతో డ్వాక్రా మహిళలకు సంబంధించి పావలా వడ్డీ బకాయిలపై కొంత ఫండ్స్‌ను సర్కారు విడుదల చేసింది. అంతకుముందు 2018లో కూడా డ్వాక్రా మహిళలపై పావలా వడ్డీ బకాయిలపై వెంకటరమణారెడ్డి ఆమరణ నిరాహార దీక్ష చేశారు. తన పోరాటాలతో మహిళలకు అన్న అయ్యారు.

ధరణితో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కామారెడ్డి జిల్లా కేంద్రంలో వెంకటరమణారెడ్డి నాలుగు రోజుల పాటు నిరవధిక నిరాహార దీక్ష చేశారు. కామారెడ్డి టౌన్, నియోజకవర్గంలోని గ్రామాల్లో భూకబ్జాలు, ఆక్రమణలు, రియల్ ఎస్టేట్‌లో స్కీమ్‌ల పేరిట మోసాలపై ఆందోళనలు నిర్వహించారు. ప్రజా దర్బార్ చేపట్టి, పలువురు బాధితులకు మేలు జరిగేలా చేశారు. కామారెడ్డి టౌన్‌లో డబుల్ బెడ్రూం ఇండ్లను పంచాలంటూ ధర్నాలు చేశారు. తాను గెలిస్తే నియోజకవర్గంలో అవినీతి రహిత పాలన అందిస్తానని, ఆఫీసర్లు



తెలంగాణ ముఖ్యమంత్రిని, కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థి రేవంతరెడ్డిని ఓడించి తెలంగాణలో చరిత్ర సృష్టించి, మార్పు తీసుకురావడానికి కావలసిందల్లా కొంచెం ధైర్యం, ఆత్మవిశ్వాసం అని ప్రపంచానికి రుజువు చేశారు. నిశ్శబ్దంగా కష్టించి పని చేసి, కామారెడ్డి అసెంబ్లీలో ఎన్నికల యుద్ధంలో గెలిచిన మన బీజేపీ అభ్యర్థి శ్రీకాటిపల్లి వెంకటరమణను ప్రెజెంట్ చేస్తున్నాను. నమస్కారాన్ని అందుకోండి రెడ్డిగారూ...

**– ఖుష్బూ సుందర్, నటి, బీజేపీ నాయకురాలు**

నిర్భయంగా తమ పని చేసుకోవచ్చని, వ్యాపారులు తమ బిజినెస్‌లు ఎలాంటి చందాలు ఇవ్వకుండా, ఎవరికీ భయకుండా చేసుకోవచ్చని భరోసా ఇచ్చారు.

గతంలో కాంగ్రెస్ నుంచి జడ్పీ చైర్మన్‌గా మూడేండ్లు పదవిలో కొనసాగిన ఆయన అప్పుడు తీసుకున్న నిర్ణయాలు వివిధ వర్గాలను దగ్గర చేశాయి. టీచర్ల బదిలీలు, ఇసుక క్వారీలు, వైన్ షాపుల్లో అధిక రేట్లు తదితర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుని, పకడ్బందీగా అమలు చేయించారు. ఆ క్రమంలో గజ్వేల్‌తో పాటు, కామారెడ్డిలోనూ పోటీ చేస్తానని కేసీఆర్ అనూహ్యంగా ప్రకటించారు. దీంతో గజ్వేల్‌లో అభివృద్ధి పేరిట జరిగిన విధ్వంసం, రైతుల కష్టాలు, పునరావాసం లేక భూ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా కామారెడ్డి ప్రజలకు చూపిస్తానంటూ 'చలో గజ్వేల్' ప్రోగ్రామ్‌ను వెంకటరమణారెడ్డి చేపట్టారు. అప్పుడు పోలీసులు ఆయనను ముందస్తు అరెస్టు చేయడం ప్రజల్లో సానుభూతి పెంచింది.

**ఉప ఎన్నికను తప్పించిన కామారెడ్డి ఓటర్లు :**

మరోవైపు కాంగ్రెస్ పార్టీ చివరి నిమిషంలో ఇక్కడ రేవంత్ రెడ్డిని పోటీలో దింపింది. అయినప్పటికీ వెంకటరమణారెడ్డి వెనకడుగు వేయలేదు. ప్రణాళికాబద్ధంగా ప్రచారం చేశారు. కేసీఆర్, రేవంత్ నాన్‌లోకల్స్ అని, వారిలో ఎవరు గెలిచినా మళ్లీ వారిని కలవాలంటే మధ్యవర్తుల ద్వారా వెళ్లాల్సి ఉంటుందని, ఉప ఎన్నిక వచ్చే పరిస్థితి ఉంటుందని వివరిస్తూ జనంలోకి వెళ్లారు. కేసీఆర్ ఇక్కడి భూములపై కన్నేసి పోటీ చేస్తున్నారని విమర్శలు గుప్పించారు స్థానికుడైన తననే గెలిపించాలని కోరారు. దీంతో నియోజకవర్గంలో అప్పటికే ఎంతో గుడ్‌విల్ పెంచుకున్న వెంకటరమణారెడ్డికే ఓటర్లు పట్టంకట్టి ఉప ఎన్నికను తప్పించారు. ★

**అన్ని సర్వేలను తల్లక్రిందులు చేస్తూ రాజస్తాన్‌లో భారతీయ జనతాపార్టీ భారీ ఘన విజయం సాధించింది. ఎన్నికలు జరిగిన 199 స్థానాల్లో 115 స్థానాల్లో అప్రతిహత విజయాన్ని సాధించగా, కాంగ్రెస్ 69 స్థానాలతో సరిపెట్టుకుంది. భారత్ ఆదివాసీ పార్టీ 3 సీట్లు, బీఎస్‌పీ రెండు, ఇతరులు 12 స్థానాల్లో గెలుపొందారు.**

# కోటల రాష్ట్రంలో మళ్లీ పాగా

**19**93 నుంచి అసెంబ్లీ ఎన్నికల సరళిని పరిశీలిస్తే ఏ పార్టీకి ఓటర్లు వరుసగా రెండోసారి పట్టం కట్టిన దాఖలాలు కనిపించవు. బీజేపీ, కాంగ్రెస్‌లకు ఒకదాని తర్వాత మరొకటి అధికారాన్ని అప్పగించడం రివాజు. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు మాంత్రికుల కుటుంబం నుంచి వచ్చిన ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ చేసిన సంక్షేమ 'మ్యాజిక్' అవినీతి సునామీలో కొట్టుకుపోయింది. రాజస్తాన్‌లో ఐదేళ్లకోమారు ప్రభుత్వం మారడానికి ఒకే కారణం కీలక పాత్ర పోషిస్తున్నదని చెప్పలేం.

**కర్ణుడి చావుకు...**

తనను ఓడించే పనిని సాధారణంగా కాంగ్రెస్ విపక్షాలకు ఇవ్వదు. తన పతనాన్ని తానే తెచ్చి పెట్టుకుంటుంది. అవినీతి, కుమ్ములాటలు లేని కాంగ్రెస్‌ను ఊహించలేం. రాజస్తాన్‌లో ఇదే జరిగింది. ఇటీవలి సంవత్సరాల్లో పలు ప్రభుత్వ ఉద్యోగాల పరీక్షల ప్రశ్నపత్రాలు వరుసగా లీక్ కావడంతో ప్రభుత్వంపై యువకులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ముఖ్యంగా 22 లక్షల మంది కొత్తగా ఓటర్లుగా నమోదైనవారు, ప్రభుత్వం పట్ల తమ ఆగ్రహాన్ని ఓట్ల రూపంలో చూపారని భావించాలి. ఈ పేపర్ లీక్ బాగోతాన్ని బీజేపీ ప్రచారాస్త్రంగా మలచుకుంది. ప్రస్తుత ఎమ్మెల్యేల్లో చాలామంది అవినీతిపరులుగా ముద్ర పడటంతో, అశోక్ గెహ్లాత్ సంక్షేమ మంత్రం పని చేయలేదు. కాంగ్రెస్



దియా కుమారి



వసుంధరా రాజే

బుజ్జగింపు రాజకీయాలు, టైలర్ కన్నయ్యాలాల్ హత్య, అనంతరం జరిగిన అల్లర్లను బీజేపీ బలమైన ప్రచార అస్త్రాలుగా వాడుకొని, అశోక్ గెహ్లాట్ గెలుపు విశ్వాసాన్ని వమ్ము చేసింది. ఈ ఎన్నికలు అశోక్ గెహ్లాట్‌కు అగ్నిపరీక్ష వంటివే. ఈ పరీక్షలో ఆయన నెగ్గలేకపోయారు. ముఖ్యమంత్రి పదవిని వీడి పార్టీ అధ్యక్ష పదవిని చేపట్టాలని చేసిన సూచనను తిరస్కరించి అధిష్ఠానం ఆగ్రహానికి గురయ్యారు. ఈ ఎన్నికలు తన రాజకీయ జీవితాన్ని శాసిస్తాయని బాగా తెలిసిన ఆయన, ఏకంగా కారుచౌకకే గ్యాస్ సిలిండర్, రూ.25లక్షల వరకు ఆరోగ్య బీమా వంటి సంక్షేమ పథకాలను గత ఏడాది కాలంగా ప్రకటిస్తూ వచ్చారు. కానీ అవేవీ ప్రజల మనోగతాన్ని మార్చలేకపోయాయి.




2018 ఎన్నికల్లో బీజేపీకి 38.77% ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 39.30% వచ్చాయి. ఆ ఎన్నికల్లో వసుంధరా రాజె సింధియా నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీని కాంగ్రెస్ ఓడించి అధికార పగ్గాలు చేపట్టింది. అశోక్ గెహ్లాట్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కానీ మరో ముఖ్య నేత సచిన్ పైలట్, గెహ్లాట్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడంతో ఎట్టకేలకు 2020లో ఆయనకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి అధిష్ఠానం పరిస్థితిని చక్కదిద్దింది. ప్రస్తుతం అధికార కాంగ్రెస్‌ను గద్దెదించి, బీజేపీకి ఓటర్లు పట్టం కట్టడానికి ప్రధాన కారణాల్లో ఈ ఇద్దరు నేతల మధ్య నెలకొన్న రాజకీయ జగడం కూడా ఒకటి. సచిన్ పైలట్ గుజ్జర్ వర్గానికి చెందినవారు. ఆయనకు రాజకీయంగా అన్యాయం జరిగిందన్న భావన ఆ వర్గంలో బలంగా నాటుకు పోయింది. దాదాపు 30కి పైగా అసెంబ్లీ స్థానాల్లో వీరిదే ప్రాబల్యం. అవకాశం కోసం చూస్తున్న గుజ్జర్లు ఈ ఎన్నికల్లో ప్రతీకారం తీర్చుకున్నారు. పైలట్‌ను పక్కనపెట్టడం ఎంత ప్రమాదకరమో కాంగ్రెస్‌కు ఈ దెబ్బతో బాగా తెలిసొచ్చుంటుంది. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ప్రభావం ఇక్కడ కనిపించ లేదు. ప్రధాని మోదీ సహా బీజేపీ జాతీయ నాయకులు రాజస్తాన్‌లో గట్టిగానే ప్రచారం చేశారు.

నేషనల్ క్రైమ్ బ్యూరో గణాంకాల ప్రకారం 2021లో దేశంలోనే అత్యధిక అత్యాచార కేసులు రాజస్తాన్‌లో నమోదయ్యాయి. రాష్ట్రంలో మహిళలపై నేరాల సంఖ్య 2020తో పోలిస్తే 2021లో 17శాతం పెరిగింది. ఈ నేపథ్యంలో రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలపై అత్యాచారాలు బీజేపీకి ప్రధానాస్త్రంగా మారింది. బీజేపీ నేతలు రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యను కూడా ప్రజల్లోకి గట్టిగా తీసుకెళ్లి కాంగ్రెస్ వైఫల్యాలను ర్యాలీలు, బహిరంగ సభల్లో ఎండగట్టారు. మ్యానిఫెస్టోలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ కూడా ఇదే హామీ ఇచ్చినప్పటికీ ప్రజలు దాన్ని విశ్వసించలేదని ఎన్నికల ఫలితాలు నిరూపించాయి.

**తప్పిన ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు**


నిజానికి ఎగ్జిట్ పోల్ సర్వేలు చాలా వరకు బీజేపీకే అధికారం దక్కుతుందని అంచనా వేశాయి. పీపుల్స్ పల్స్ సర్వే, న్యూస్-18, జన్‌కీ బాత్, టీవీ9 భారత్ వర్ష్, టైమ్స్ నౌ సర్వే ఫలితాలు ఇంచుమించు నిజం కాగా, న్యూస్ నేషన్, రిపబ్లిక్ టీవీ, ఇండియా టుడే సర్వే అంచనాలు తప్పాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్-బీజేపీల మధ్యనే కీలకపోటీ ఉంటుందని, ప్రాంతీయ పార్టీలు కింగ్‌మేకర్లుగా మారే అవకాశ ముందన్న ఎగ్జిట్‌పోల్ అంచనాలు కూడా తప్పాయి. ఈ అంచనాల నేపథ్యంలో హంగ్ అసెంబ్లీ వస్తుదేమోనన్న భయంతో కాంగ్రెస్, బీజేపీలు ఒకదశలో రెబెల్ అభ్యర్థులను బుజ్జగించే పనిలో పడ్డాయి కూడా! టికెట్ నిరాకరించడంతో బీజేపే, కాంగ్రెస్‌ల నుంచి 40 మంది రెబెల్స్ పోటీచేశారు.

**ఎన్నికల సరళి**

200 సీట్లు కలిగిన అసెంబ్లీలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీలు హోరాహోరీగా తలపడ్డాయి. బహుజన్ సమాజ్‌వాదీ పార్టీ (బీఎస్‌పీ), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్), ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ (ఐఎన్ఎల్‌డీ), రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్‌పీ) కూడా రంగంలో ఉన్నప్పటికీ వాటి ప్రభావం పెద్దగా లేదు. మొత్తం 199 స్థానాలకు ఎన్నికలు జరగ్గా, శ్రీగంగానగర్‌కు చెందిన కరనాపూర్ సీటుకు ఎన్నిక వాయిదా పడింది. అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గుర్‌మీత్ సింగ్ కన్నార్ మృతితో ఇక్కడ ఎన్నిక నిలిచిపోయింది. బీజేపీ అన్నిస్థానాల్లో పోటీచేయగా, కాంగ్రెస్ 199 స్థానాల్లో తలపడి, భరత్‌పూర్ స్థానాన్ని తన మిత్ర పార్టీ అయిన రాష్ట్రీయ లోక్‌దళ్‌కు వదిలేసింది. 2018లో కూడా కాంగ్రెస్ ఈ స్థానాన్ని ఆర్ఎల్‌డీకి వదిలేయడం గమనార్హం. రాష్ట్రం మొత్తం మీద 75.45% ఓటింగ్ నమోదు కాగా ఇది గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే స్వల్పంగా అధికం. అప్పట్లో 74.71% పోలింగ్ నమోదైంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 100 సీట్లు సాధించి మెజారిటీకి ఒక్క స్థానం తక్కువ కావడంతో బీఎస్‌పీ సహకారంతో అధికారపగ్గాలు చేపట్టింది. అశోక్ గెహ్లాట్ ముఖ్యమంత్రి అయ్యారు. 2013 ఎన్నికల్లో బీజేపీ 163 సీట్లు సాధించింది. అదే బీజేపీ 2018లో కేవలం 73 సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2013లో కాంగ్రెస్‌కు కేవలం 21 సీట్లు మాత్రమే లభించడం గమనార్హం. పరిశీలిస్తే 1993 నుంచి రాజస్తాన్‌లో బీజేపీ, కాంగ్రెస్‌ల జాతకాలను మారుస్తున్నవి 48 అసెంబ్లీ స్థానాలు! 2008 నుంచి ఇదే పోకడ కనిపిస్తోంది. మరో విషయమేమంటే 25 లేదా 12.5% అసెంబ్లీ స్థానాలు 2008, 2013లో బీజేపీ ఖాతాలో ఉండగా, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటేసాయి. ఉదాహరణకు జైపూర్ నగరంలోని ఆదర్శ్‌నగర్, విరాట్‌నగర్ అసెంబ్లీ స్థానాలను 2008, 2013లో బీజేపీ గెలుచుకోగా, 2018లో ఇవి రెండూ కాంగ్రెస్ ఖాతాలోకి వెళ్లిపోయాయి. అదేవిధంగా జాట్, మెవాట్ ప్రాంతాల్లో బీజేపీ గత ఎన్నికల్లో ఓటమి చవిచూసింది. అయితే ఈసారి ఈ స్థానాల్లో బీజేపీ పుంజుకున్నది.

**వైవిధ్య భౌగోళిక-రాజకీయాలు**

రాజస్తాన్‌లో వైవిధ్యభరితమైన భౌగోళిక, రాజకీయ పరిస్థితులు కనిపిస్తాయి. మొత్తం ఆరు జిల్లా ప్రాంతాలుగా విభజితమైన రాష్ట్రంలో ప్రతి జిల్లా ఒక ప్రత్యేకతను కలిగివుంది. మేవార్ ప్రాంతంలో ఉదయ్‌పూర్, రాజసమండ్, చిత్తోర్‌గఢ్, దుర్గాపూర్, బాన్స్‌వారాల్లో గిరిజన జనాభా అధికం. చారిత్రకంగా రాజకీయాధిపత్యం వీరిదే. షేఖ్‌వతి ప్రాంతంలో ఛురు, ఝుంఝువును, సికార్‌లు సంక్లిష్ట రాజకీయ స్థితిని ప్రదర్శిస్తాయి. బికనా ప్రాంతంతో బికనీర్, గంగానగర్, హనుమాన్‌గఢ్‌లు ఉండగా, జైపూర్, దౌసాలు దుంధర్ ప్రాంతం కిందికి వస్తాయి. బ్రిజ్ ప్రాంతంలో భరత్‌పూర్, ధోల్‌పూర్, కరోలీ,



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

మార్వార్ ప్రాంతాల్లో జోధ్‌పూర్, పాలి, శిరోహి, ఝలాడ్, బాల్మర్, జైసల్మేర్‌లుంటాయి. రాజ్‌పుట్‌లు, బ్రాహ్మణులు వంటి అగ్రకులాల ఓట్లు 20–22% వరకు ఉంది. యాదవ్‌లు, జాట్‌లు, గుజ్జార్‌లు, సంఘీల ఓట్లు 40–45% వరకు ఉన్నాయి. షెడ్యూల్డు కులాలవారి ఓట్లు 16–17%, షెడ్యూల్డ్ ట్రైబ్స్ 13%, ముస్లింలు 9% ఉన్నారు. అగ్రవర్ణాల్లో 60% మంది ఓటర్లు బీజేపీ మద్దతుదార్లు. వీరిలో కాంగ్రెస్‌కు కేవలం 20% మంది మాత్రమే మద్దతివ్వడం గమనార్హం. చిన్నా చితకా పార్టీలకు 15% ఓటర్ల మద్దతుంటుంది.

ఓబీసీ కేటగిరీలో బీజేపీ–కాంగ్రెస్‌లకు గణనీయంగా ఓటర్ల మద్దతు కొనసాగుతోంది. ఒక్కొక్క పార్టీ 35–40% ఓట్లు ఈ కేటగిరీ నుంచి పొందగలవు. ఇతర చిన్నాచితకా పార్టీలు 15% వరకు ఓట్లు సాధిస్తాయి. ఎస్సీ/ఎస్టీల్లో బీజేపీ కాంగ్రెస్‌లకు సమాన బలం ఉంది. మిగిలిన ఓట్లు భారతీయ ట్రైబల్ పార్టీ వంటి చిన్న పార్టీల ఖాతాల్లోకి వెళతాయి. ఇక ముస్లింలు దాదాపు పూర్తిగా కాంగ్రెస్ వైపే ఉంటారు. 3/4వంతు ఓట్లు కాంగ్రెస్‌కే వెళతాయి. గత మూడు అసెంబ్లీ ఎన్నికల సరళిని పరిశీలిస్తే ముస్లిం ఓటర్ల మనోగతంలో ఎటువంటి మార్పు రాలేదన్నది స్పష్టమవుతుంది.

**కాంగ్రెస్ ఓట్లకు చిల్లు**

ఒక అంచనా ప్రకారం 2008 నుంచి పరిశీలిస్తే, రాజస్తాన్‌లో బీజేపీ ఒక పద్ధతి ప్రకారం కాంగ్రెస్ ఓట్ల తేడాను తగ్గించుకుంటూ వస్తోంది. అంటే తన ఓటుశాతం పెంచుకుంటున్నదని అర్థం. ఉదాహరణకు 2008లో బీజేపీ 78 స్థానాలు, కాంగ్రెస్ 96 స్థానాల్లో గెలుపు సాధించాయి. కానీ రెండు పార్టీల మధ్య ఓట్ల శాతంలో తేడా 2.5% మాత్రమే. 2013 ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం 21 స్థానాల్లోనే గెలుపొందింది. అప్పుడు రెండు పార్టీల మధ్య ఓట్ల వ్యత్యాసం 12%. అదేవిధంగా 2018లో బీజేపీకి 73 స్థానాలు లభించగా కాంగ్రెస్ 100 సీట్లను గెలుచుకుంది. విచిత్రంగా రెండు పార్టీల మధ్య ఓట్ల శాతంలో తేడా 0.5% మాత్రమే కావడం గమనార్హం. ఈ పోకడను పరిశీలిస్తే బీజేపీ తన ఓటు బ్యాంకును సుస్థిరంగా పెంచుకుంటూ వస్తోందని అర్థమవుతుంది.

**కొత్తతరానికే అవకాశం?**


ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ తరపున ప్రచారాన్ని అన్నీ తానై నిర్వహించారు. అయితే ముందు జాగ్రత్త చర్యగా ముఖ్యమంత్రి అభ్యర్థి పేరును ముందుగా ప్రకటించకుండా జాగ్రత్త వహించడం గమనార్హం. ప్రచారం సందర్భంగా మోదీ ఇమేజ్ ద్వారానే ఓట్లు సాధించాలన్న పార్టీ లక్ష్యం స్పష్టమైంది. ముఖ్యంగా వసుంధరా రాజే సింధియాను పక్కనపెట్టే వ్యూహాన్ని పార్టీ ఇక్కడ అనుసరించింది. రాజస్తాన్‌లో కొత్తతరం



**ఒక అంచనా ప్రకారం 2008 నుంచి పరిశీలిస్తే, రాజస్తాన్‌లో బీజేపీ ఒక పద్ధతి ప్రకారం కాంగ్రెస్ ఓట్ల తేడాను తగ్గించుకుంటూ వస్తోంది. అంటే తన ఓటుశాతం పెంచుకుంటున్నదని అర్థం.**

నాయకులకు పగ్గాలు అప్పగించాలని బీజేపీ నాయకత్వం భావిస్తోందనడానికి ఇది సూచన. వసుంధరా రాజే సింధియా (70) గతంలో రెండుసార్లు (2003–08, 2013–18) ముఖ్యమంత్రిగా పనిచేశారు. అంతకుముందు అటల్‌బిహారీ వాజ్‌పేయి మంత్రివర్గంలో పనిచేసిన అనుభవం ఉంది. ఆమె ఇప్పటికీ అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకురాలన్నది అక్షరసత్యం. కానీ ఆమె ఆధిపత్యధోరణి, మాట దురుసుతనం, ఎవ్వరికీ అందుబాటులో ఉండకపోవడం వంటి ప్రతికూలతలు ఆమె పట్ల కేంద్ర నాయకత్వం వైముఖ్యానికి ప్రధాన కారణం. కొన్ని సందర్భాల్లో ఆమె వైఖరి పార్టీ వృద్ధనేతలను ఇరుకున పడేసిన సందర్భాలున్నాయి. అంతేకాదు తాను అవసరమనుకున్నప్పుడు పార్టీ సిద్ధాంతాలను కూడా పక్కన బెట్టి స్వేచ్ఛగా వ్యవహరించే మనస్తత్వం. సచిన్ పైలెట్ తిరుగుబాటు చేసినప్పుడు తన ప్రభుత్వాన్ని వసుంధరా రాజే సింధియా కాపాడారని కాంగ్రెస్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ స్వయంగా ఒకదశలో పేర్కొనడం ఇందుకు గొప్ప ఉదాహరణ. అయితే ఈ ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించడం తర్వాతి పరిణామం. అదీకాకుండా ఈసారి ఎన్నికల ప్రచారానికి ఆమె దూరంగా ఉంటూ వచ్చారు. పార్టీ విడుదల చేసిన తొలి జాబితాలో ఆమె అనుయాయులకు టిక్కెట్లు దక్కకపోవడం, అధిష్టానం నుంచి ఆమెకు గట్టి హెచ్చరికగా పరిగణించాలి. సింధియా అనుయాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో తర్వాతి జాబితాల్లో వారి పేర్లను చేర్చి పరిస్థితిని పార్టీ చక్కదిద్దింది. ఇంత జరిగినా, తాము పరస్పరం ఒకరిపై మరొకరు ఆధారపడి ఉన్నామన్న సత్యాన్ని సింధియా, బీజేపీ విస్మరించక పోవడం గమనించాలి. పార్టీ నుంచి బయటకు వస్తే తనకు పెద్దగా రాజకీయ భవిష్యత్తు ఉండదని ఆమెకు తెలుసు. అదేవిధంగా రాజే సింధియాను బీజేపీ పూర్తిగా పక్కన పెట్టడం సాధ్యంకాదు.

నవంబర్ 25వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల కమిషన్ సమాచారం ప్రకారం ప్రస్తుతం రాజస్థాన్‌లోని 199 అసెంబ్లీ స్థానాల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 5,25,38,105 కాగా 1862 మంది అభ్యర్థులు ఎన్నికల్లో పోటీచేశారు. ఈ ఓటర్లలో 18–30 మధ్య వయసులైన ఓటర్ల సంఖ్య 1,70,99,334 కాగా వీరిలో 22,61,008 ఓటర్లు కొత్తవారు. ★



# మిజోరంలో పాలకపక్షానికి ఎదురుగాలి

**మిజోరం ఓటర్లు మార్పుకు జై కొట్టారు. ఇక్కడ అధికార మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) పార్టీని ఇంటికి పంపి జోరంపీపుల్స్ మూవ్‌మెంటు (జడ్పీఎమ్) పార్టీని అధికారపీఠంపై కూర్చోబెట్టారు. మిజోరంలోతమ ఆశలు పండించుకుందామని నెగెటివ్ క్యాంపయిన్‌తో ముందుకెళ్లిన కాంగ్రెస్ చతికిలపడింది. బీజేపీ గతంలో కంటే మెరుగైన ఫలితాలు సాధించింది. ఈశాన్య రాష్ట్రమయిన మిజోరంలో ప్రజాతీర్పు ఎలా ఉందో ఇప్పుడు చూద్దాం.**

మొత్తం 40 స్థానాలున్న మిజోరం అసెంబ్లీలో, 27 స్థానాల్లో విజయం సాధించి జోరం పీపుల్స్ మూవ్‌మెంటు (జడ్పీఎమ్) పార్టీ విజేతగా నిలిచింది. 73ఏళ్ల లాల్దుహోమ మిజోరం కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్నారు. ఇప్పటివరకూ అధికారంలో ఉన్న మిజో నేషనల్ ఫ్రంట్ (ఎమ్ఎన్ఎఫ్)కి 10 స్థానాలకు పరిమితమైంది.


లాల్దుహోమ్

బీజేపీ రెండు, కాంగ్రెస్ కు ఒకటి సీటు దక్కింది. ముఖ్యమంత్రి జొరంతంగ తన సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయారు.

1987లో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటయిన నాటి నుంచి మిజోరం ఎన్నికలలో కాంగ్రెస్, మిజోనేషనల్ ఫ్రంట్లు పార్టీలు ఆధిక్యతను ప్రదర్శిస్తూ వచ్చాయి. ఎమ్ఎన్ఎఫ్‌కి చెందిన జొరంతంగ, పదేళ్ల కాంగ్రెస్ పాలనకు తెరవేస్తూ 1998లో ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. దశాబ్దం పాటు ఎమ్ఎన్ఎఫ్ పాలన తర్వాత, 2008, 2013 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారాన్ని హస్తగతం చేసుకుంది. అనంతరం 2018లో తిరిగి అధికారాన్ని దక్కించుకున్న ఎమ్ఎన్ఎఫ్ ఈ దపా మళ్లీ అవకాశం దక్కుతుందని ఆశపడింది. మొదట్లో ప్రాంతీయపార్టీలు, పౌరసమాజ నేతల సంకీర్ణ కూటమిగా ప్రారంభమైన జడ్పీఎమ్ 2019లోనే రాజకీయపార్టీగా గుర్తింపు తెచ్చుకుంది. మాజీ ఆర్థిక మంత్రి లాల్ స్వాతాకు రాష్ట్ర పగ్గాలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వ మార్పుతో తమ అదృష్టం కలిసొస్తుందని ఆశపడింది. బీజేపీ వ్యతిరేక నినాదంతోనే కాంగ్రెస్ ప్రచారం సాగింది. కేవలం 23 స్థానాల్లో అభ్యర్థులను రంగంలోకి దింపిన బీజేపీ తాను 'కింగ్ మేకర్' కాగలనని భావించింది. ప్రధాన పోటీ మాత్రం ప్రాంతీయ పార్టీలు మిజోనేషనల్ ఫ్రంట్ (ఎమ్ఎన్ఎఫ్), జోరం పీపుల్స్ మూవ్‌మెంటు (జడ్పీఎమ్) మధ్య త్రిముఖ పోటీ ఉందన్న ప్రచారం సాగింది. ఆమ్‌ఆద్మీ పార్టీ నాలుగు స్థానాల్లో పోటీ చేస్తే, 17 మంది ఇండిపెండెంట్లు రంగంలో ఉన్నారు.

2018 ఎన్నికలు అంతకు ముందు నిర్వహించిన రెండు ఎన్నికల కంటే విశిష్టంగా నిలిచాయి. ఎమ్ఎన్ఎఫ్ పార్టీ 26 సీట్లు సాధించి విజేతగా నిలవటమే కాదు, కాంగ్రెస్‌ను ఐదు స్థానాలకు పరిమితం చేసింది. 1993తో పోలిస్తే ఓట్ షేర్ విషయంలోనూ ఎమ్ఎన్ఎఫ్ గణనీయంగా మెరుగుదల సాధించింది. దాదాపు 37.7 శాతం సాధించింది. జొరంతంగ ముఖ్యమంత్రిగా మూడో సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

కాంగ్రెస్ 29.98 శాతం ఓట్ షేర్ సాధించినా, సీట్ల విషయంలో 22.9 శాతం ఓట్ షేర్ సాధించిన జడ్పీఎమ్ కంటే వెనకపడింది. జడ్పీఎమ్ కు 8 సీట్లు దక్కాయి. ఇండిపెండెంట్లుగా పోటీ చేసిన విజయం సాధించిన అభ్యర్థులందరూ కలిసి, ఫలితాల అనంతరం ఒకే వేదికపైకి వచ్చారు. కొత్తగా ఏర్పాటయిన జడ్పీఎమ్ పార్టీ గొడుగు కిందకు వచ్చారు. ఆ తర్వాత ఈ పార్టీ గుర్తింపు తెచ్చుకుంది. స్థానిక ఎన్నికల్లో విజేతగా నిలిచింది. జొరంతంగ సొంత గడ్డ అయిజాల్ ఈస్ట్ 1 నియోజకవర్గంలోనూ విజయం సాధించింది. ఇక బీజేపీ కూడా ఈ ఎన్నికల్లో తన ఖాతాను తెరిచింది. కేవలం ఒక్కసీటు, 8.09 శాతం ఓట్ షేర్ సాధించిన బీజేపీ ఈ దఫా క్రిస్టియన్ మెజార్టీ రాష్ట్రం మిజోరంలో నాన్ మిజో ఓట్లపైనదృష్టి పెట్టింది. మిజోరంలో 87 శాతం మంది క్రిస్టియన్లే. కుకి, జామి, హమర్ కమ్యూనిటీలు మిజోరం వాసులతో అనుబంధంగా ఉంది.

మిజోరంలో ఆశ్రయం పొందిన శరణార్థుల పక్షాన ఏ రాజకీయ పార్టీ నిలబడుతుంది అనే అంశం మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో కీలకమైన అంశంగా నిలిచింది. ఐదు దశాబ్దాల తర్వాత, మొట్టమొదటిసారి మిజోరంలో విదేశీయుల అంశం కీలకంగా నిలిచింది. జో కమ్యూనిటీ ఏకీకరణ.. ప్రధానంగా మిజోరాంకు చెందిన ఆధిపత్య మిజో వర్గాలు, మణిపూర్‌కు చెందిన కుకీలు, మయన్మార్, బంగ్లాదేశ్‌లకు చెందిన చిన్‌ల సంక్షేమానికి కట్టుబడుతామని ఎంఎన్ఎఫ్ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. మణిపూర్, మయన్మార్‌ల నుంచి వచ్చిన 12,500 మంది శరణార్థులు మిజోరంలోని ఫాల్క్ లాండ్ కాన్‌సన్‌ట్రేషన్ క్యాంపులో ఆశ్రయం పొందారు. ఇది ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న అయిజాల్ ఈస్ట్1 అసెంబ్లీ నియోజకవర్గంలో ఉంది. తాను తిరిగి అధికారంలోకి వస్తామని ఎమ్ఎన్ ఎఫ్ ధీమా వ్యక్తం చేయటానికి ఇదొక కారణం అని చెప్పాలి.

జడ్పీఎం అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి లాల్దుహోమ దీనిని తప్పుపడతున్నారు. ఐదేళ్ల



**డాక్టర్ పార్థసారథి చిరువోలు**

పాలనలో ప్రభుత్వం వైఫల్యాల నుంచి ప్రజలను దృష్టిని మళ్లించటానికి ఎమ్ఎన్ఎఫ్, మణిపూర్ హింసను వేదికగా తీసుకుందని ఆరోపించారు. అన్ని రాజకీయ పార్టీలకు నిరాశ్రయులయిన ప్రజల పట్ల సానుభూతి ఉందని, కానీ దాని ద్వారా రాజకీయ ప్రయోజనాన్ని పొందాలని మాత్రం చూడటం లేదని వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో జడ్పీఎం తన ప్రజాదరణను పెంచుకుంటూ వస్తోంది.

ఎమ్ఎన్ఎఫ్ పార్టీ బీజేపీకి చెందిన నార్త్ ఈస్ట్ డెమోక్రటిక్ ఎలయెన్స్‌లో భాగస్వామ్యంగా ఉండేది. ఒకవైపు జడ్పీఎమ్‌కు ప్రజాదరణ పెరుగుతూండటం, మరో వైపు మణిపూర్‌లో పరిణామాల నేపథ్యంలో బీజేపీకి వ్యతిరేకత పెరుగుతోందన్న ప్రచారం నేపథ్యంలో, బీజేపీకి దూరంగా జరిగారు ముఖ్య మంత్రి జొరంతంగ. మణిపూర్ లో హింసకు మైతీలే కారణం. మిజోరంలో క్రిస్టియన్లకు వ్యతిరేకంగా, తాను ఎన్నికల ప్రచారానికి వస్తున్న ప్రధాని మోదీతో తాను వేదిక పంచుకోదలుచుకోలేదని వ్యాఖ్యా నించారు. అంతేకాదు. మయన్మార్ శరణార్థులను మిజోరాం నుంచి తరిమివేయాలని, వారికి బయోమెట్రిక్ గుర్తింపు ఇవ్వాలని లేదా కేంద్రం ఆదేశాలను అమలు చేయటం లేదని పేర్కొన్నారు. అలాగే ఏకరీతి పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. మణిపూర్ లో కుకీలకు ప్రత్యేక రాజ్యాంగ వ్యవస్థ ఏర్పాటు చేయాలనే అంశానికి మద్దతు ప్రకటించారు. ఇదంతా ఎన్నికల ఎత్తుగడగా ప్రజలు భావించారు. ప్రధాని మోదీ మిజోరం పర్యటన రద్దయ్యింది. తాను 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈశాన్య రాష్ట్రాల్లో సాగిన అభివృద్ధిని ప్రత్యేకంగా వీడియో సందేశంలో వివరించారు ప్రధాని. రవాణా, టూరిజం, మౌలిక సదుపాయాలు తదితర రంగాల్లో సాగిన అభివృద్ధిని వివరించటమే కాదు. టూరిజం హబ్‌గా మిజోరంను తీర్చిదిద్దు తామని, దీనివల్ల పెట్టుబడులు, పరిశ్రమలు, ఆదాయం వచ్చి చేరుతుందని వివరించారు. ప్రభుత్వఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. అలాగే జొరంతంగ ప్రభుత్వం అవినీతిపైన విచారణ చేపడతామని, ప్రధానంగా ఎమ్ఎన్ఎఫ్ చేపట్టిన సోషియోఎకనమిక్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ లో అవకతవకలపైన దర్యాప్తు చేస్తామని పార్టీ ప్రకటించింది.

మణిపూర్ అంశం కాంగ్రెస్‌కు ఆయుధంగా మారింది. ప్రధాని మోదీని విమర్శిస్తూ కాంగ్రెస్ నేతల ప్రచారం సాగింది."ఆరునెలలుగా మణిపూర్ మండు తోంది. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి మణిపూర్‌లో సంక్షోభాన్ని పెంచుతున్నాయి, ఈశాన్య సమాజంలో అసమానతలను రెచ్చగొట్టటానికి ప్రయత్నిస్తున్నా యని" ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. ఎమ్ఎన్ఎఫ్, బీజేపీ ఒకే నాణానికి రెండు వైపులా ఉన్న బొమ్మలని, ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పి కాంగ్రెస్‌ను గెలిపించాలని రాహుల్పిలుపు నిచ్చారు.

మిజోరంలో 92శాతం అసెంబ్లీ సీట్లు ఎస్టీలకు రిజర్వ్ అయి ఉన్నాయి. నవంబరు 7వ తేదీన ఒకే దఫాలో మిజోరం ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 78.4 శాతం ఓట్లు పోలయ్యాయి. సెర్చిప్ జిల్లాలో అత్యధికంగా 84.78 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకుంటే, మామిట్ జిల్లాలో 84.23 శాతం, హ్యాథియల్ జిల్లా 84.1 శాతం ఓట్లు పోల య్యాయి. అసెంబ్లీ నియోజకవర్గాల విషయానికొస్తే త్రూకుమ్ 27 అత్యధికంగా 87.32 శాతం ఓట్లు పోలయ్యాయి. అలాగే ఎక్కువ మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఎన్నికల అధికారుల అధికారిక వెబ్ సైట్ లెక్కల ప్రకారం 81.25శాతం మంది మహిళా ఓటర్లు, 80.04 శాతం మంది పురుషులు తమ ఓటు

> **ఎమ్ఎన్ఎఫ్ పార్టీ బీజేపీకి చెందిన నార్త్ ఈస్ట్ డెమోక్రటిక్ ఎలయెన్స్‌లో భాగస్వామ్యంగా ఉండేది. ఒకవైపు జడ్పీఎమ్‌కు ప్రజాదరణ పెరుగుతూండటం, మరో వైపు మణిపూర్‌లో పరిణామాల నేపథ్యంలో బీజేపీకి వ్యతిరేకత పెరుగుతోందన్న ప్రచారం నేపథ్యంలో, బీజేపీకి దూరంగా జరిగారు ముఖ్య మంత్రి జొరంతంగ.**



జొరంతంగ

హక్కును వినియోగించుకున్నారు. ఓటువేసిన వాళ్లలో 70 శాతం మంది 35 ఏళ్ల వాళ్లయితే, ఇక్కడ పోటీ చేసిన ప్రధాన పార్టీల నేతలంతా 70 ఏళ్ల పై బడిన వారు కావటం విశేషం.

నాలుగు ఎగ్జిట్ పోల్స్‌లో రెండు జడ్పీఎమ్ కు మెజార్టీ వస్తుందని చెబితే, మరో రెండు ఎమ్ఎన్ఎఫ్ విజయం సాధిస్తాయని చెప్పారు. ఇండియాటుడే.. ఏక్సిస్, జన్ కీ బాత్-న్యూస్ 18లు జడ్పీఎమ్ గెలుస్తుందని పేర్కొంటే.. ఏబీపీ-సీఓటర్, పీ-మార్గ్ లు ఎమ్ఎన్ఎఫ్ కు గెలుస్తుందని చెప్పాయి. ఈ నాలుగు కూడా కాంగ్రెస్ మూడోస్థానం వస్తుందని పేర్కొన్నాయి. మొత్తం 174 మంది అభ్యర్థులు రంగంలోకి దిగారు.

ఫలితాలు చూసినప్పుడు జడ్పీఎమ్ 27 స్థానాలు, ఎమ్ఎన్ఎఫ్ 10, బీజేపీ2, కాంగ్రెస్1 స్థానం దక్కించుకున్నాయి. అయిజ్వాల్ ఈస్ట్1 నియోజక వర్గంలో పోటీ చేసిన ముఖ్యమంత్రి జొరంతంగ, జడ్పీఎమ్ అభ్యర్థి లాల్తాసంగ చేతిలో 2,101 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన జొరంతంగను ఓడించి లాల్తాసంగ జెయింట్ కిల్లర్ గా నిలిచారు. తన గెలుపుపైన ఆయన మీడియాతో మాట్లాడారు. "అధిష్టానం నన్ను అభ్యర్థిగా ప్రకటించగానే, వ్యక్తిగతంగా సర్వే చేసుకున్నాను. ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా జొరంతంగ విఫలమయ్యారని, నేను గెలవటం పెద్ద కష్టం కాదనే విషయం అర్థమైంది" అని వివరించారు. కాంగ్రెస్ , ఎంఎన్ఎఫ్ కొత్త తరానికి చేసిందేమీ లేదని, అధికారం కోసం అవి పాకులాడుతున్నాయని విమర్శించారు. బీజేపీ మద్దతు ఇస్తే వారిని ప్రభుత్వంలోకి తీసుకుంటారా అన్న ప్రశ్నకు ప్రస్తుతానికి అలాంటి పరిస్థితి లేదని వ్యాఖ్యా నించారు. డిప్యూటీ సీఎం తాన్లూయియా కూడా జడ్పీఎమ్ అభ్యర్థి చేతిలో 909 ఓట్లతో పరాజయం పాలయ్యారు.

సెర్చిప్ నుంచి జడ్పీఎమ్ అధ్యక్షుడు లాల్ తంస్సంగ2,982 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆయనకు 8,314 ఓట్లు రాగా, ఎంఎన్ఎఫ్ అభ్యర్థి జె. మాల్సాంజుయలాకు 5,332 ఓట్లు లభించాయి.

ఓటమిని అంగీకరిస్తున్నా

"యాంటీఇంకెంబెన్సీ ప్రభావం.. నా పనితీరు ప్రజలను మెప్పించలేకపోవటం వల్ల ఓడిపోయా" అన్నారు జొరంతంగ. ప్రజల తీర్పు తనకు శిరోధార్యం అని ఆయన వ్యాఖ్యానించారు.

**ఈ ఫలితాన్ని ఊహించలేదు**


మిజోరంలో మునుపెన్నడూ లేని విధంగా బీజేపీ రెండు సీట్లను సాధించింది. ఇక్కడ ఫలితాలు ఇలా ఉంటాయని తాము ఊహించలేదని, హంగ్ వస్తుందని భావించామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు వన్లాల్ మౌఖా పేర్కొన్నారు. ప్రజా తీర్పును శిరసావహిస్తామని అన్నారు. గతంలో ఒక్క చోట మాత్రమే విజయం సాధించాం. ఇప్పుడు రెండు సీట్లు దక్కించుకున్నామని అన్నారు. మిజోరం లోక్ సభకు ఒక ఎంపీని మాత్రమే పంపుతుంది. మిజోరం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు జాతీయ స్థాయిలో అంత ప్రభావం చూపవనే చెప్పాలి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# గెలిచిన వారి ఘనత..

**'నీళ్లు-నిధులు- నియామకాలు'- తెలంగాణ ఏర్పాటుకు ఊతమిచ్చిన నినాదమిది. తెలంగాణ రాష్ట్ర సమితి (తరువాత భారత రాష్ట్ర సమితి/ బీఆర్ఎస్) ఇచ్చిన నినాదం. అలాంటి బీఆర్ఎస్‌ను 2023లో జనం ఓడించారు. నినాదం సరే! వాస్తవంగా జరిగిందేమిటి అన్న ప్రశ్న మూడో అసెంబ్లీ ఎన్నికల వేళ పదునెక్కింది. నీళ్లకు బదులు కన్నీళ్లు మిగిలాయన్న సమాధానం వచ్చింది. నిధులు దుబారాలో ఆవిరి అయిపోయాయని ప్రజలు భావించారు. చంద్రబాబు కాలంలో మిగులు రాష్ట్రంగా ఉన్న ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలు అప్పుల కుప్పగా మారిపోయాయన్న సత్యం బయటపడింది. ఇక నియామకాలు జరుగలేదు. కేసీఆర్ కుటుంబ సభ్యులు నలుగురికీ మాత్రం మంచి ఉద్యోగాలు లభించాయి. నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలు రోడ్డున పడ్డారు. గ్రూపు-1 పేపర్ లీక్ కావడంతో 33 లక్షల కుటుంబాలు కేసీఆర్‌ను అనుమానించి, వ్యతిరేకంగా పోరాటం సాగించారు. తత్ఫలితంగా డిసెంబరు 3,2023న ఆయన ప్రభుత్వం పేకమేడలా కూలిపోయింది. ఇదొక నిశ్శబ్ద విప్లవం. చరిత్రాత్మక ఘట్టం.**

కల్వకుంట్ల చంద్రశేఖరరావు తెలుగుదేశం పార్టీ సభ్యుడు. అక్కడ ఆశించిన పదవి దక్కకపోవడంతో తెలంగాణ రాష్ట్ర సమితి అనే ఒక ఉద్యమ సంస్థను స్థాపించారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మొదలు పెట్టారు. 1969లో కూడా మర్రి చెన్నారెడ్డి ఇలాగే




**ప్రొ. ముదిగొండ శివప్రసాద్**

విశ్రాంత ఆచార్యుడు

ఉద్యమం నడిపారు. అప్పుడు ఇందిరాగాంధీ ఉక్కుపాదంతో అణచివేసింది. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో కేసీఆర్ మళ్లీ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మొదలుపెట్టారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రమే అన్ని కష్టాలకూ కారణమని నమ్మబలికారు. 2014లో ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించిన తర్వాత ప్రత్యేక రాష్ట్రం ప్రకటించిన సోనియా గాంధీని మోసం చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఇవ్వగానే టీఆర్ఎస్‌ను కాంగ్రెసులో విలీనం చేస్తానని నమ్మ బలికారు. పదేండ్ల క్రితం కేసీఆర్ అంటే తెలంగాణ జాతిపిత అన్న ప్రజలే  నేడు ఇంతగా ఎందుకు తిరగబడ్డారు? ఆయన ప్రభ ఒక్కసారిగా ఎందుకు మసకబారింది? సమాధానం  వెతకవలసిన ప్రశ్నలే మరి!

ఇవి మాత్రమే కేసీఆర్ పతనానికి కారణాలని చెప్పడం ఇక్కడ ఉద్దేశం కాదు. తెలంగాణలో నలభై లక్షల మంది క్రైస్తవులున్నారు. వీరంతా సోనియా గాంధీకి ఓటు వేశారు. హైదరాబాదు, ఖమ్మం, నల్గొండ ప్రాంతాలలోని అర్బన్ నక్సలైట్లు కేసీఆర్‌కు వ్యతిరేకంగా పోరాడారు. ఒక్క హైదరాబాద్ మినహాయిస్తే మిగిలిన ప్రాంతాలలోని ముస్లిములు కేసీఆర్‌కు ఓటు వేయలేదు. ఎంతో ప్రతిష్టాత్మకంగా బీజేపీ ఇచ్చిన 'బీసీ ముఖ్యమంత్రి' నినాదాన్ని ప్రజలు పట్టించుకోలేదు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు హామీ కూడా అంతే అనుకోవాలి. హైదరాబాదులోని లక్షలాది సోకాల్డ్ మేధావులు మూడు రోజులు వరుస సెలవులు వచ్చాయని ఓటు వేయకుండా స్వస్థలాలకు ఉడాయించారు.

ఇక చాలు దొర అనే నినాదాన్ని కేసీఆర్ వ్యతిరేకశక్తులు ప్రజలలోకి తీసుకొనిపోవడంలో సఫలమైనాయి. కేసీఆర్‌ను మించిన వాక్చాతుర్యం కలిగిన కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి ప్రజలలోకి దూసుకొనిపోయారు. తిట్ల దండకంలో  కేసీఆర్‌కు దీటుగా కనిపించారాయన. వారు తమలపాకుతో అలా అంటే తాము తలుపుచెక్కతో పెడీపెడీమనిపిస్తామని రుజువు చేశారు. కేసీఆర్ పిచ్చికుక్కవు అని తిడితే, అదే తిట్టును తిరుగు టపాలో కేసీఆర్‌కు పంపేవారాయన. కొన్ని నెలల క్రితం వరకు బీఆర్ఎస్‌కు పోటీ అనుకున్న బీజేపీ ఎన్నికలలో దారుణంగా ఓడిపోయిందంటున్నారు. కానీ గణాంకాలు ఈ వాదనకు ఒప్పవు. ఇంతకు ముందు గోషామహల్లో రాజాసింగ్ అనే ఒకే ఒక్క నాయకుడు గెలిచారు. ఇప్పుడు ఎనిమిది మంది. ఎన్ని సీట్లకు



ఎదిగినా అది విజయం కిందికే వస్తుంది.

తెలంగాణ మొదటి నుండి కాంగ్రెస్ కంచుకోట. రెడ్డి సామాజిక వర్గానిదే ఆధిపత్యం. ప్రత్యేక ఉద్యమ ఆవేశంతో రాజ్యాధికారాన్ని కేసీఆర్ చేజిక్కించుకున్నారు. దీనిని స్థానిక భూస్వాములు సహించలేరన్నది చిదంబర రహస్యం.

ఇవన్నీ ఒక ఎత్తయితే విశ్వాసాలకు సంబంధించిన ప్రశ్నలు ఇంకొన్ని వేసుకుతీరాలి. బంగారం లాంటి పాత సచివాలయాన్ని పనిగట్టుకుని ఎందుకు కూలగొట్టినట్లు? వాస్తు బాగాలేదని ఎవడో చాదస్తుడు చెప్పాడట! కాళేశ్వరం ప్రాజెక్టు మీద ఎన్ని కోట్లు పోశారు. ప్రయోజనం ఎంత? అక్కడ ఏం జరిగింది? యాదాద్రిలో జియ్యర్‌స్వామిని ఎందుకు తరిమివేసినట్లు? ఢిల్లీ ముఖ్యమంత్రిగా వేషం వేసిన అర్బన్ టెర్రరిస్టు అరవింద కేజ్రీవాల్‌తో చేతులు కలిపి ఒక తెలంగాణ మహిళ కల్లు వ్యాపారం చేయటం ఏమిటి? ఎనభయ్ వేల పుస్తకాలు చదివిన మేధావి తెలుగుకు అక్షరభిక్ష పెట్టిన శ్రీకృష్ణదేవరాయల భువన విజయాన్ని ఆదరించకపోవడం దుర్మార్గం కాదా? నమ్మకస్థులుగా పనిచేసిన ఈటల రాజేందర్, కోదండరాం వంటి ఎందరో ప్రజా నాయకులను దురహంకారంతో దూరం చేసుకోవడం వెనుక ఉన్న హేతువు ఏది? ఏకకుటుంబ పాలనేనా? ప్రత్యేక రాష్ట్ర సాధనకు బలిదానాలు చేసిన ఉస్మానియా విద్యార్థులే ఇవాళ కేసీఆర్ పతనానికి సంబురాలు ఎందుకు చేసుకున్నట్టు? దళితుణ్ణి ముఖ్యమంత్రిని చేస్తానంటూ నమ్మబలికిన కేసీఆర్ నిజంగా అలాగే

# ఓడినవారి నడత



చేసి ఉంటే త్యాగధనుడు అని ప్రజలు కీర్తించేవారు. అది ఎందుకు జరగలేదు? ఎందుకూ అంటే, రాజకీయాల్లో అబద్ధాలు చెప్పకూడదు అని ఏమైనా నిబంధన ఉందా? మేమేమైనా సత్యహరిశ్చంద్రులమా? కర్ణాటక తర్వాత తెలంగాణ కాంగ్రెసు వశం కావడంతో మొత్తం దక్షిణభారతంలో ఆ పార్టీ పునరుజ్జీవనం ఆలస్యం లేకుండా మొదలయిందనే భ్రమను కల్పించడానికి కొందరు స్వయం ప్రకటిత రాజకీయ విశ్లేషకులు ప్రయత్నిస్తున్నారు. కానీ నిజం ఏమిటి? ఇది తెలంగాణ ప్రజా విజయం! రాహుల్ గాంధీకి ఈ విజయంలో ఎట్టి భాగస్వామ్యమూ లేదు. ఇదే నిజమైతే రాజస్తాన్‌లో అధికార కాంగ్రెసు ఎందుకు ఓడిపోయింది? అందరు నియంతలకు పట్టిన గతియే కేసీఆర్‌కూ పట్టింది. అలాగే చూడాలి. అయ్యో అని సానుభూతి చూపేందుకు కూడా ఒక్కడూ లేదు. ప్రాణాలకు తెగించి రేవంత్‌రెడ్డి పోరాడారు. ఇలాంటి పటిమ తెలుగు రాష్ట్రాలలోని రాజకీయ పార్టీలలో ఎందరికి ఉంది? ఆత్మవిమర్శ చేసుకోండి!

కేసీఆర్ పథకాలన్నీ ప్రహసనాలను మరిపించాయంటే అతిశయోక్తి ఏమీ కాదు. దళితబంధు, రైతుబంధు పథకాలు బూమరాంగ్ అయినాయి. నీ పార్టీ సభ్యులకూ, ధనిక రైతులకూ పది లక్షలు ఇస్తే మా సంగతి ఏమిటి? అని అందని లక్షలాది రైతులు, దళితులు తిరగబడ్డారు. ఎన్నడూ సచివాలయానికి రాని ముఖ్యమంత్రి శుభ్రంగా ఉన్న సచివాలయాన్ని ఎందుకు కూల్చినట్లు? అని ప్రశ్నించారు. కాంగ్రెసు పార్టీ అభ్యర్థులను టోకున కొనుగోలు చేయటంలో నైతికత ఎంత? బీఆర్ఎస్ సహా ఏ ప్రాంతీయ పార్టీ నిర్వాకం గమనించినా ఒక ప్రాంతీయ పార్టీ కంటే, రెండు జాతీయ పార్టీల విధానం మంచిదేనని అనిపిస్తుంది. ఐతే సోనియా గెలుపు ఎక్కడైనా సరే మత మార్పిడి శక్తులకు ఊతమిస్తుంది. భారాసను ఎంఐఎం అంటకాగితే, కాంగ్రెస్‌ను క్రైస్తవ ముఠా శాసిస్తుంది. తెలంగాణలో ప్రస్తుతం 1.2 శాతం క్రైస్తవులున్నారు. ఈ నిష్పత్తి పెరిగే అవకాశం బాగా ఉంది. ఇప్పుడు ప్రజల బతుకు పెనం మీద నుండి పొయ్యిలోకి పోయినట్లుంది. ‘మార్పు’ అవసరమే కాని పూర్ణిమ తర్వాత వచ్చే అమావాస్యను స్వాగతించ లేము.

తెలంగాణ ఎన్నికల ప్రభావం జాతీయ రాజకీయాలపైన ఎంతవరకు పడుతుంది? ఉచితాలు అనుచితాలు అనే సిద్ధాంతకర్తల మాట ఎలా ఉన్నా గ్యాస్ సిలెండర్ రూ. 500కే అన్న హామీ మహిళలను ఆకర్షించడం సహజం. ఎన్నికలను బహిష్కరించండి అని పిలుపునిచ్చిన ఇలాకాలో భారీ ఓటింగ్ జరగడం దేనికి సంకేతం? తెలంగాణలో ఒకప్పటి కమ్యూనిష్టు కంచుకోటలైన నల్గొండ, ఖమ్మం జిల్లాలలో ఆ పార్టీ ఎందుకు అడ్రసు లేకుండా పోయింది? ఎందుకు కాంగ్రెసు ‘తోక’ పార్టీగా మిగిలింది?

ఒక పార్టీ విజయం దురదృష్టవశాత్తు ఆ పార్టీ గత కీర్తిని మార్చలేదు. నేషనల్ హెరాల్డ్ కుంభకోణంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ బెయిల్ మీద ఉన్నారు. భారత మాజీ ప్రధాని, తెలంగాణ ముద్దుబిడ్డ పీవీ నరసింహారావు చనిపోతే అంత్యక్రియలు ఢిల్లీలో జరుగకుండా సోనియా ఎంత అవమానించిందో తెలంగాణ ప్రజలు మరిచి పోయారనుకోవడం భ్రమే. కాసు బ్రహ్మానందరెడ్డిని గద్దె దింపడం కోసం చెన్నారెడ్డి చేసిన ఉద్యమం, చెన్నారెడ్డిని గద్దె దింపడం కోసం వైఎస్ఆర్ హైదరాబాదులో మత కల్లోలాలు సృష్టించినట్టు ఉన్న ఆరోపణలు గుర్తుకు రాకుండా ఉంటాయా? అందువల్ల కేసీఆర్ పాలన పోయి కాంగ్రెసు పాలన వచ్చినంత మాత్రాన తెలంగాణ ప్రజల కష్టాలు తీరతాయని భ్రమించకూడదు. కాంగ్రెసుకు ఓటు వేసినందుకు ఇవాళ కన్నడ ప్రజలు ఎంత బాధ పడుతున్నారో మనం చూస్తున్నాం. అయినా కాంగ్రెస్‌ను ప్రజలు ఎందుకు ఎంచుకున్నారు? కేసీఆర్ మీద ఉన్న ఆగ్రహానికి అది నిదర్శనం.

సమాధానాల కోసం వేచి ఉన్న ఇంకొన్ని ప్రశ్నలు:

రాజశ్యామల యాగం కేసీఆర్‌ను ఎందుకు రక్షింపలేకపోయింది?

కర్ణాటకకు చెందిన డి.కె. శివకుమార్, మల్లికార్జున ఖర్గే తెలంగాణ ప్రజల భవితను నిర్ణయించాలా?

మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి అభివృద్ధి పనులు కేసీఆర్‌ను ఎందుకు గెలిపించలేదు?

మునుగోడు ఎన్నికలలో గులాబీ రంగులో కనిపించని ప్రజా వ్యతిరేకత, నియంతృత్వం ఈ ఎన్నికలలో కమ్యూనిస్టులకు ఎందుకు కనిపించాయి? సీపీఎం, సీపీఐ ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఎందుకు ప్రవర్తించాయి?

విష్ణువును, గణేశుణ్ణి పూజించకూడదు అని విద్యార్థుల చేత ప్రమాణం చేయించిన ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ కోసం మాయావతి ఎందుకు ప్రచారం చేసింది? ఐనా ప్రవీణ్ ఎందుకు ఓడినట్టు?

కామారెడ్డిలో ఒక సామాన్య బీజేపీ కార్యకర్త పదవిలో ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ని, కొత్త ముఖ్యమంత్రి అభ్యర్థి రేవంత్ రెడ్డిని కూడా జమిలిగా ఎలా ఓడించగలిగాడు?

మోదీ వ్యతిరేకతే కేంద్రబిందువుగా ఏర్పడిన ‘ఇండియా’ భవిష్యత్తు ఏమిటి?

రెండు పర్యాయాలకే ప్రజా వ్యతిరేకత ఎదుర్కొన్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, ఐదుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా మళ్లీ నెగ్గిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్‌ను ఎలా బేరీజు వేయాలి?

సంక్షేమ పథకాల పేరుతో ప్రజాకర్షక పథకాలు అన్ని వేళలా పనిచేయవు. వాటిని ప్రజలు ప్రలోభాల కిందకు కూడా జమకట్టగలరు. ప్రజలు పథకాలను చూసే ఓటేస్తారనుకుంటే గ్యాస్ సిలెండర్ రూ. 400కే ఇస్తామని వాగ్దానం చేసిన కేసీఆర్, అశోక్ గెహ్లాత్ ప్రభుత్వాలు ఎందుకు ఘోరంగా ఓడిపోయాయి?

**ఫలశ్రుతి:**

రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ సాధించిన ఘన విజయం లోక్‌సభ ఎన్నికల భవిష్యత్తుకు దిక్సూచిగా కనిపిస్తున్నది. రాహుల్ నాయకత్వం యథాప్రకారం ప్రశ్నార్థకమైంది.

ఇది రేవంత్ రెడ్డి వ్యక్తిగత విజయం!

సినీ నటుడు ప్రచారం చేస్తే జనం వినోదంగా చూడడానికి వస్తారు తప్ప ఓట్లు వేయరు. దీనికి రుజువు తెలంగాణలో జనసేన ప్రభావం చూపలేక పోవడమే. మరీ డిపాజిట్ కూడా దక్కలేదు.

స్వయం ప్రకటిత మేధావులు ఓటు విలువను గుర్తించరు. ఇది నిత్యసత్యం. రోజూ అవినీతిని విమర్శిస్తూ మాట్లాడే గుంపులు, పోలింగు నాడు ఇల్లు కదలలేదు. ఇది మన ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక వికృత కోణం. ★

# నేపాల్‌లో

**ప్రపంచవ్యాప్తంగా కూడా ప్రజలు వామపక్ష భావజాలానికి, వారి నిర్వచనాలకు దూరం జరుగుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వారంతా కూడా ముందుగా తమ దేశాన్ని, అస్తిత్వాన్ని, జీవన విధానాన్ని కాపాడుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్న సంకేతాలు ఐరోపా నుంచి నేపాల్ వరకూ కనిపిస్తున్నాయి. దాదాపు దశాబ్దన్నర కాలం కిందట రాచరికం నుంచి ప్రజాస్వామ్యంగా పరివర్తన చెంది, హిందూరాష్ట్రంగా ఉండటానికి ఇష్టపడక సెక్యులరిజాన్ని ఆలింగనం చేసుకున్న నేపాల్‌లో ఇప్పుడు ప్రజలు తిరిగి వెనక్కి వెళ్లిపోదాం అని డిమాండ్ చేస్తున్నారు. ఇంతటి స్వల్పకాలంలోనే ప్రజలు రాచరికానికి, హిందూ రాష్ట్రానికీ తిరిగి పోవాలని కోరుకోవడానికి కారణం రాజకీయ వర్గాల వైఖరే. ప్రజాహితాన్ని మించిన రాజకీయ అస్థిరతే.**

నవంబర్ నెల ఆఖరివారంలో దేశ రాజధాని నగరం ఖాట్మాండులోకి ఉవ్వెత్తున ఎగసిన ప్రజాగ్రహం ప్రభుత్వాన్ని, పాలనా యంత్రాంగాన్నీ కూడా తీవ్రమైన ఆశ్చర్యానికి లోను చేసింది. గత కొద్దికాలంగా, దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలలో జరుగుతున్న ప్రజా ప్రదర్శనలను, ప్రభుత్వం రాజీనామా చేయాలని, ప్రస్తుత ప్రజాస్వామం స్థానంలో రాజ్యాంగపరమైన రాచరికాన్ని తిరిగి తీసుకురావాలంటూ వారు చేస్తున్న డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోలేదు.

అసలు ఈ ఉద్యమం ఇంతై, ఇంతింతై... అన్నట్టుగా పెరుగుతుందని కూడా ఊహించలేక పోయింది. 'దేశం, జాతీయత, మతం, సంస్కృతి పరిరక్షణకు పౌర ఉద్యమం' (రాష్ట్ర, రాష్ట్రీయత, ధర్మ, సంస్కృతి ఔర్ నాగరిక్ బచావో ఆందోళన్) మద్దతుదారులు నవంబర్ 23న ఖాట్మాండు శివార్లలో పోగయ్యి, మాజీ రాజు గ్యానేంద్రకు అనుకూలంగా నినాదాలు చేస్తూ నగరం మధ్యలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీనితో పోలీసులు వారిపై లాఠీచార్జీ చేశారు. ఖాట్మాండు సహా దేశంలో ఏ జిల్లాలోనూ నిరసన ప్రదర్శనలు, సభలు జరపడానికి వీలు లేదంటూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

వాస్తవానికి నేపాల్‌లో ఇటువంటి ఉద్యమాలు కొత్త కాదు. 2006లో వారాల తరబడి వీధుల్లో ప్రజలు ఉద్యమించడంతో రాజు గ్యానేంద్ర తన రాచరికాన్ని వదులుకొని ప్రజాస్వామిక యుగానికి తెరలేపారు. రెండేళ్ల తర్వాత, అంటే 2008లో రాచరికాన్ని అధికారికంగా రద్దు చేయడంతో దేశ చరిత్ర ఒక కీలక మలుపు తిరిగిందనే చెప్పాలి. దేశంలో 1996 నుంచి 2006 మధ్య 17వేల మందికిపైగా ప్రజలను హననం చేసిన మావోయిస్టు తిరుగుబాటును అంతం చేసేందుకు 2008లో కుదిరిన ఒప్పందం కింద ప్రత్యేకంగా ఎన్నికైన రాజ్యాంగ సభ 239 ఏళ్ల రాచరిక వ్యవస్థను రద్దు చేసి, ఫెడరల్ రిపబ్లిక్‌ను ఏర్పాటు చేసింది. ఇదే నేపాల్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చివేసింది. రాచరికం రద్దు అయినప్పటి నుంచీ, నేపాల్‌లో ఇప్పటివరకూ 10సార్లు ప్రభుత్వాలు మారాయి. ఆర్థికాభివృద్ధి లేక యువత మలేసియా, దక్షిణ కొరియా, మిడిల్ ఈస్ట్‌కు వలుస పోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటికి తోడుగా, 80శాతం హిందువులు ఉన్న నేపాల్‌ను, మతపరమైన తటస్తకు కట్టుబడి ఉంటామంటూ నాటి రాజ్యాంగ సభ దానిని సెక్యులర్ రాజ్యంగా ప్రకటించడంపట్ల ఇప్పుడు వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పుడు హిందువులంతా కూడా తమ దేశం హిందూ రాజ్యంగానే గుర్తింపు పొందాలని కోరుకుంటున్నారు.



రాజరికం తిరిగిరావాలని ప్రజా ప్రదర్శన

**పౌర ఉద్యమానికి కారణాలు**

అధికారం కోసం పార్టీలు పోటీపడుతుండడంతో దేశంలో పలు సమస్యలు తలెత్తుతున్న సంకేతాలు పొడచూపడం ప్రారంభించాయి. దాదాపు 240 ఏళ్ల రాచరికాన్ని రద్దు చేస్తూ మే, 28, 2008లో నేపాల్‌ను ఫెడరల్ డెమొక్రెటిక్ రిపబ్లిక్‌గా రాజ్యాంగ సభ ప్రకటించినప్పటి నుంచే నేపాల్‌కు అవస్థలు మొదలయ్యాయి. తర్వాత ప్రజాస్వామ్యం పేరుతో రాజకీయ పార్టీలు పాల్పడుతున్న అంతర్ పార్టీ పోరాటాలు, అవినీతి ప్రజలకు విసుగు పుట్టించాయి. ముఖ్యంగా, కొవిడ్ మహమ్మారి కాలంలో దానిని నియంత్రించేందుకు తగిన చర్యలు లేకపోవడం రాజకీయ వ్యవస్థ అసమర్థతను పట్టి చూపింది.

పెరుగుతున్న ద్రవ్యోల్బణం (7.7శాతం)తో పాటు విపరీతమైన నిరుద్యోగం (19శాతం), ఆర్థిక సంక్షోభం, సరైన పాలన లేకపోవడం ప్రజలలో రాజకీయ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆగ్రహాన్ని రేకెత్తించింది. రాజకీయ అస్థిరత, నిరుద్యోగం, ఆర్థిక పరిస్థితి, ఖాట్మాండు ఆవల సరైన భౌతిక మౌలిక సదుపాయాలు లేకపోవడం, అరకొర వైద్య, విద్యా సౌకర్యాలు, పనిచేయని సామాజిక భద్రత వంటి మౌలిక విషయాలే నేపాలీలకు ప్రస్తుత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థపట్ల నమ్మకం కోల్పోయేలా చేశాయని విశ్లేషకుల భావన.

**నైతికత లేని రాజకీయ పార్టీలు**

రాజకీయ నైతికతను పాటించకుండా దేశంలోని అగ్ర రాజకీయ నాయకులు కూడా అధికారం కోసం పరుగులు తీయడం, ఫలితంగా ఏర్పడుతున్న రాజకీయ అస్థిరతలు మెజారిటీ ప్రజలకు విసుగుతెప్పిస్తున్నాయి.

అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షాలు ఏవీ కూడా ఇచ్చిన హామీలు నిలుపుకోలేక పోవడం ప్రాథమికంగా ప్రజల్లో అసంతృప్తికి కారణమైంది. దీనితో ప్రజలు అన్ని రాజకీయ పార్టీలను అవినీతిమయమైనవిగా, నాయకులు నైతికత లేని అధికార దాహం కలిగిన వారిగా పరిగణించడం ప్రారంభమైంది. అందుకే ప్రస్తుత రాజకీయ వ్యవస్థను

సరిగా పని చేయనిదానిగా, దేశంలో రాజకీయ నాయకుల ప్రయోజనాలను నెరవేర్చేదానిగా ప్రజలు చూస్తున్నారు.

అగ్నికి ఆజ్యం పోసినట్టుగా దేశవ్యాప్తంగా మూడు లక్షలమంది ప్రజలు కష్టపడి సంపాదించు కున్నదంతా శక్తిమంతమైన, రాజకీయ నాయకుల అండదండలు కలిగిన సహకార సంఘాలు, మైక్రోఫైనాన్స్ కంపెనీలు దోచుకోవడం ప్రజలను తీవ్ర ఆగ్రహానికి లోను చేసింది.

**ఉద్యమ డిమాండ్లు**

ప్రజా డిమాండ్లు అత్యంత స్పష్టంగా సూటిగా ఉన్నాయి. అవి – రాజు గ్యానేంద్ర బీర్ బిక్రమ్ షా దేవ్, నేపాల్ క్రియాశీలక రాజుగా పగ్గాలు చేపట్టేందుకు మార్గాన్ని సుగమం చేస్తూ ఎన్నికైన మావోయిస్టు ప్రధానమంత్రి పుష్ప కమల్ దహాల్ (ప్రచండ) రాజీనామా.

రెండవది, సెక్యులరిజాన్ని త్యజించి నేపాల్‌ను తిరిగి హిందూ రాష్ట్రంగా ప్రకటించాలి. మెజారిటీ హిందూ ప్రజలు రాజును విష్ణుభగవానుడి రూపంగా

# ‘హిందూ’నినాదం

పరిగణిస్తారు. 2008లో రాజును అవమానకరంగా తొలగించారనే భావన కూడా వారిలో ఉన్నది.

ఈ క్రమంలోనే తిరిగి నేపాల్‌ను 2008కు ముందులా రాజ్యాంగబద్ధమైన రాచరికం (1990లో రాజు బీరేంద్ర ప్రకటించినట్టుగా) లాగా రాజుకు నిజమైన అధికారాలు ఉండగా, ప్రధానమంత్రి పదవి కోసం ఎన్నికలలో పోటీ చేసే పద్ధతిని పునరుద్ధరించా లన్న డిమాండ్ కూడా పుట్టింది.

తమ దేశాన్ని తిరిగి హిందూ రాష్ట్రంగా ప్రకటించాలన్న డిమాండ్ వెనుక మరొక కారణం కూడా ఉన్నది. నేపాల్‌ను సెక్యులర్ దేశంగా ప్రకటించడంతో క్రైస్తవ, ఇస్లాం మతవ్యాపకులకు తలుపులు తెరిచినట్టు అయింది. దేశంలో ఉన్న దారిద్ర్యాన్ని ఆసరాగా చేసుకుని, ఈ కొద్ది కాలంలోనే వారు ప్రజలకు ప్రలోభాలు ఆశచూపి అనేకమందిని క్రైస్తవంలోకి, ఇస్లాంలోకి మతాంతరీకరించారు. ఇది మెజారిటీ హిందువులను ఆగ్రహానికి గురిచేస్తోంది.

పైగా, కొత్తగా మతం పుచ్చుకున్నవారు హిందూ ప్రార్థనా స్థలాలపై దాడులు చేయడం, వాటిని ధ్వంసం చేయడం అన్నది దేశంలో నూతన సామాజిక ఉద్రిక్తలకు తెరలేపుతున్నది. అందుకే, ప్రజలు నేపాల్‌ను తిరిగి హిందూ రాష్ట్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌కు నలువైపుల నుంచీ మద్దతు కూడా లభిస్తున్నది.

వీటన్నింటికీ తోడుగా, యువత నిరుద్యోగిత, బలహీన ఆర్థిక వ్యవస్థ కారణంగా అగమ్యగోచరమైన భవిష్యత్తును ఎదుర్కొంటున్న నేపథ్యంలో వారు గతమే మేలు వచ్చు కాలము కంటెన్ అన్న భావనలోకి వస్తున్నారు.

ఈ డిమాండ్లన్నీ తిరోగమనవాదాన్ని అవలంబి స్తున్నట్టుగా, వారికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం గురించి తెలియనట్టుగా అనిపిస్తాయి. కానీ, వాస్తవం అది కాదు, ప్రజలకు తమ రాజ్యాంగపరమైన హక్కుల గురించి, ప్రజాస్వామ్యం వల్ల కలిగే లాభాల గురించి అవగాహన ఉంది. కానీ, రాచరిక రద్దు తర్వాత వరుసగా వచ్చిన ప్రభుత్వాలన్నీ వారి ఆకాంక్షలను నెరవేర్చకుండా వారిని నిరాశ పరచడంతో వారికి మరొక


ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు

ప్రత్యామ్నాయం కనిపించడం లేదు.

అవినీతి, రాజకీయ అస్థిరతలతో కూడిన ప్రజాస్వామ్యం వారికి చేటు చేసిందే తప్ప ఏ రకంగానూ మేలు చేయలేకపోయిందన్న భావన ప్రజలలో నానాటికీ పెరిగిపోతున్నది.

రాచరిక అనుకూల ఉద్యమానికి ప్రసేన్ అనే వ్యాపారవేత్త నేతృత్వం వహిస్తున్నాడు. గతంలో సిపిఎన్(యుఎంఎల్)తో అధిపతి ఖడ్గ ప్రసాద్ శర్మ ఓలితో ఆయనకు సత్సంబంధాలు ఉండేవి. కొద్దికాలం కింద అవి చెడడంతో ప్రసేన్ ప్రస్తుత పాలనా వ్యవస్థపైనే కాదు, ఓలిపై కూడా విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఓలి తీవ్రమైన అవినీతికి పాల్పడ్డాడని, ఆ సంపదనంతా కంబోడియాలో రియల్ ఎస్టేట్, ఇతర వెంచర్లలో పెట్టుబడిగా పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలను ఓలి తీవ్రంగా ఖండించినప్పటికీ, ప్రజలు వాటిని విశ్వసించారు, ఆగ్రహానికి లోనయ్యారు. ఈ ఆగ్రహం కేవలం ఓలికి పరిమితం కాకుండా ప్రస్తుతం ప్రచండ నేతృత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకతగా మారింది.

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైన ప్రభుత్వం పట్ల ప్రజాగ్రహం ఏ స్థాయిలో ఉందో గమనించిన ప్రసేన్ తన స్వంత వనరులను ఉపయోగించి , దేశంలో భిన్న ప్రాంతాలలో చిన్న చిన్న ఉద్యమాలను ప్రారంభించారు. గత నెల 23న ఖాట్మాండులో నిర్వహించిన భారీ ర్యాలీకి వీటిని రిహార్సల్స్‌గా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం అన్ని సమాజాల్లో నడుస్తున్న సరళిలాగే ప్రసేన్ కూడా సోషల్ మీడియాను ఉపయోగించుకొని, ప్రజా మద్దతును ముఖ్యంగా, నిరుద్యోగ యువతను, నిరుపేదలను ఆకర్షించారు. ఆయన ఫేస్ బుక్ పేజీని, టిక్‌టాక్ వీడియోలను అనుసరించే ప్రజల సంఖ్య దేశంలోని ఏ రాజకీయనాయకుడికీ, సెలబ్రిటీకి లేనంతగా భారీగా ఉంది. రాజకీయ నాయకులను, ప్రస్తుత పాలనా వ్యవస్థను విమర్శిస్తూ ఆయన పోస్ట్ చేసే ప్రకటనలు, ఉపన్యాసాలకు పెద్ద ఎత్తున స్పందన వస్తున్నది. మిలియన్ల కొద్దీ వ్యూలను ఆ వీడియోలు మూటగట్టుకుంటున్నాయి.

రాచరికం తిరిగి రావాలని, నేపాల్‌ను తిరిగి హిందూ రాష్ట్రంగా మార్చాలని డిమాండ్ చేసే మరొక రాజకీయ పార్టీ రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ (ఆర్‌పీపీ), ఈ ఉద్యమానికి ప్రత్యక్షంగా, అధికారికంగా మద్దతు ఇవ్వకపోయినా, అనేకమంది ఆర్‌పిపి నాయకులు పరోక్షంగా ఈ ఉద్యమానికి సహాయం చేస్తున్నారు.

ఈ ఉద్యమం ఇంత తీవ్రరూపం దాలుస్తుందని ప్రచండ ప్రభుత్వం కూడా ఊహించలేదు. అందుకే, మొదట్లోనే దీనిని అణచివేసే ప్రయత్నం చేయలేదు. తనపై ఆరోపణలు వచ్చినప్పటికీ, ప్రధాని సరైన రీతిలో స్పందించకపోవడంతో ప్రధాని దహాల్ (ప్రచండ), నేపాలీ కాంగ్రెస్ (అధికారంలో ఉన్న కూటమిలో అతిపెద్ద పార్టీ) కూడా నిశ్శబ్దంగా ప్రసేన్‌కు తోడ్పడుతున్నారంటూ ఓలీ విరుచుకు

పడుతున్నారు.

కానీ ఈ ఉద్యమం ఉధృతమై ప్రభుత్వం రాజీనామా చేయాలని, ప్రస్తుత పార్లమెంటరీ వ్యవస్థ స్థానంలో రాజ్యాంగపరమైన రాచరికాన్ని తేవాలన్న డిమాండ్లు ఊపందుకోవడంతో ప్రభుత్వంలో కూడా కొంత చలనం వచ్చినప్పటికీ, అప్పటికే ఉద్యమం ఏ స్థాయిలో విస్తరించిందో, ప్రజలలోకి ఎంత లోతుగా చొచ్చుకు పోయిందో ప్రధాని కానీ, ఇతర నాయకులు కానీ ఊహించలేకపోయారు. గత నెల ప్రదర్శనల కోసం వేలాదిమంది ప్రజలు దేశంలోని పలు ప్రాంతాల నుంచి ఖాట్మాండుకు వస్తున్నారని నిఘావర్గాల నివేదికలు అందిన తర్వాత వారు ప్రసేన్ ప్రణాళికను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. ఇందులో భాగంగానే టిక్ టాక్‌ను ప్రభుత్వం నిషేధించింది. కానీ, ప్రతి నిషేధంలాగానే ఇది కూడా విఫలమైంది. ప్రజలు ప్రైవేట్ నెట్‌వర్కుల ద్వారా ఈ సోషల్ మీడియాను ఉపయోగించుకుంటున్నారు.

గత నెల ప్రదర్శనలకు ప్రజలు ఖాట్మాండు రాకుండా నిలువరించడం కోసం ప్రభుత్వం చేసిన ప్రయత్నం విఫలమైంది, పెద్ద ప్రభావాన్ని చూపలేకపోయింది. ఇందుకు కారణం రాజధానికి వస్తున్న ప్రజల సంఖ్య చెక్‌పోస్టులలో ఉన్న పోలీసులను మించి ఉండటమే. పైగా అన్ని వైపుల నుంచీ చుట్టుముట్టినట్టుగా ప్రజలు వచ్చారు. దీనిని ప్రభుత్వం ఊహించలేదు.

అంతేకాదు, ప్రసేన్ ఉద్యమ మద్దతుదారులు అదే రోజున అతడికి ప్రతిగా వీధుల్లోకి సిపిఎన్ (యుఎంఎల్) కేడర్‌ను మించి ఉండటమన్నది దేశ రాజకీయ నాయకులకు ఒక షాక్ ఇచ్చిందనడం అతిశయోక్తి కాదేమో!

కేడర్ ఆధారిత పార్టీ అయిన సీపీఎన్ (యుఎంఎల్)కు దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు ఉండటమే కాదు, నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించడంలో ముందుండేవారు. ఎటువంటి వ్యవస్థలేకుండా స్వచ్ఛందంగా పెరుగుతున్న ఉద్యమంలోని ప్రజలు ఒక వ్యవస్థీకృత పార్టీ కేడర్ల సంఖ్యను మించిపోవడం సిపిఎన్ (యుఎంఎల్) పార్టీ నాయకత్వాన్నే కాదు, ఇతర పార్టీల నాయకత్వానికి కూడా ఇబ్బందిని, ఆందోళనను కలిగించింది. వీటన్నింటికీ మించి, హింసాత్మక చర్యలకు పాల్పడడంలో సాటిలేనివారనే పేరున్న సీపీఎన్ (యుఎంఎల్) కేడర్లపై ప్రసేన్ ఉద్యమానికి చెందిన కార్యకర్తలు దాడి చేయడం వారిలో రగులుతున్న ఆగ్రహాన్ని వెల్లడిస్తోంది. ఇది నేపాల్‌లోని రాజకీయ పార్టీలు, ముఖ్యంగా పాలనా కూటమిలో సభ్య పార్టీలలో భయాన్ని రేకెత్తించింది.


పోలీసులతో ఆందోళనకారుల ఘర్షణ

ఎందుకంటే, గతంలో కూడా వీధి ప్రదర్శనలు భారీగా ఊపందుకొని, నాటి ప్రభుత్వాలను కూల్చివేసిన చరిత్ర ఉంది. దీనితో ప్రచండ, ఆయన పార్టీ సహచరులతో పాటు నేపాలీ కాంగ్రెస్ నాయకులందరూ కూడా ఈ పరిణామానికి అయోమయానికే కాదు ఆందోళనకు కూడా గురయ్యారు. తనదైన ఉద్వేగాన్ని, సజీవతను కలిగిన ప్రసేన్ ఉద్యమాన్ని అణచివేయడం ఎలాగో వారికి అర్థం కావడం లేదు. హింసాత్మకంగా వారిని అణచివేస్తే, ప్రజాగ్రహాన్ని మరింతగా చవి చూడాల్సి వస్తుందని వారికి తెలుసు. కానీ, ఉద్యమం కొనసాగేందుకు అనుమతించి, నేపాల్ అస్థిరం అయితే, అది తమ భవిష్యత్తుకే దెబ్బ అనే విషయం కూడా తెలుసు.

ఈ పరిస్థితుల్లో, ప్రదర్శన మరురోజే ప్రసేన్‌ను అనధికారిక గృహనిర్బంధంలో ప్రభుత్వం ఉంచింది. కానీ ఈ చర్య అతడి అనుచరుల ప్రదర్శనలు చేయడాన్ని నిలువరించలేకపోయింది. ఎటువంటి సంస్థాగత వ్యవస్థాలేని ఉద్యమాన్ని ఏమీ చేయకుండా వదిలివేస్తే అదే అదృశ్యమవుతుందని రాజకీయ వ్యవస్థలో ఒక వర్గం భావిస్తోంది. ముఖ్యంగా, పరిమిత ఆర్థిక వనరుల కారణంగా ఉద్యమం తానంతట తానుగా ఆవిరైపోతుందన్నది వారి భావన. కానీ, దేశంలోని నిఘా, భద్రతా వర్గాలు మాత్రం అలా ఏమీ చేయకుండా వదిలివేస్తే ఉద్యమం మరింత బలపడి దేశంలో అరాచకాన్ని సృష్టిస్తుందని భావిస్తున్నారు. పైగా ప్రసేన్ ఉద్యమానికి బయట నుంచి నిధులు వస్తున్నాయని నిఘావర్గాల భావన. కానీ, దీనికి ఆధారాలు ఏమీ నికరంగా కనిపించక పోవడంతో వారు ప్రస్తుతానికి ఎటువంటి ఆరోపణలు చేయడంలేదు.

ఇది ఇలా ఉండగా, రాజు గ్యానేంద్ర హాజరయ్యే ప్రతి కార్యక్రమానికీ ప్రజల మద్దతు పెరుగుతున్నది. ఇటీవలే ఆయన ఆధునిక నేపాల్ వ్యవస్థాపకుడు రాజు పృధ్వీ నారాయణ్ షా విగ్రహాన్ని ప్రారంభించేందుకు నేపాల్‌లోని వాయువ్య జిల్లా ఝాపాకు వెళ్లినప్పుడు వేలాదిమంది ప్రజలు ఆయనకు మద్దతుగా వీధులలోకి వచ్చారు. దాదాపు ఎనిమిదివేలకు పైగా ద్విచక్రవాహనాలు, మరొక వెయ్యి వాహనాలు, రాజు గ్యానేంద్రను కార్యక్రమ స్థలివరకూ అనుసరించడం కూడా దేశంలో సంచలన వార్తే అయింది. అలాగే, రాజు ఎక్కడికి వెడితే అక్కడ ప్రజలు ఆయనకు మద్దతుగా నినాదాలు చేస్తున్నారు. ఈ వైఖరి అంతా కూడా నేపాలీ ప్రజల ఆకాంక్షలను భగ్నం చేసిన రాజకీయ నాయకులకు చేటు తెస్తుందన్నది మెజారిటీ భావన.

ఏది ఏమైనాప్పటికీ, అంతర్గతంగా నేపాల్‌లో పరిస్థితులు అదుపు తప్పుతున్నాయి. మావోయిస్టులు, నాటి ప్రభుత్వానికీ మధ్య జరిగిన శాంతి ఒప్పందం అన్నది అధికారాన్ని చేపట్టేందుకు ఒక మార్గంగా ఉన్నదే తప్ప ప్రజలకు న్యాయం చేసేట్టుగా లేదన్నది నేపాలీల భావన. శాంతి అనేది ఒక పరిస్థితికి ముగింపు కావలసి ఉన్నప్పటికీ, అక్కడ అది అక్కడ చోటు చేసుకోలేదనే విషయం గత నెలలో జరిగిన పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ★



# డాక్టర్‌జీ స్మృతి మందిరానికి భూమిపూజ

**నిజామాబాద్ :** ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ కేశవ బలిరామ్‌హెడ్గెవార్ స్మృతి మందిర నిర్మాణానికి శ్రీభువనేశ్వరి పీఠాధిపతులు (విజయవాడ) పూజ్య స్వామి కమలానంద భారతి డిసెంబర్ 2న భూమి పూజ చేశారు. పరమ పూజనీయ హెడ్గెవార్ పూర్వీకులు నివసించిన ఇందూరు జిల్లా కందకుర్తి గ్రామంలో ఈ మందిరం నిర్మించనున్నారు. 1925లో స్థాపించిన ఆర్ఎస్ఎస్‌ను స్థాపించి 2025 నాటికి 100సంవత్సరాలు పూర్తవుతున్న శుభ సందర్భంగా కందకుర్తిలో సేవాకార్యక్రమాల నిర్వహణకోసం పాఠశాల, విద్యార్థుల ఆవాసం, యువతకు శిక్షణ కేంద్రం మొదలుగు సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగానే ఇప్పుడున్న చిన్న స్మృతి మందిరం స్థానంలోనే అధునాతన హంగులతో నూతనంగా స్మృతి మందిరాన్ని నిర్మించనున్నట్లు కేశవ సేవా సమితి కార్యదర్శి అంకు మహేష్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీ భువనేశ్వరి పీఠాధిపతులు పూజ్య స్వామి కమలానంద భారతి మాట్లాడుతూ కందకుర్తి తమకెంతో పవిత్ర స్థలమని, ఈ ప్రాంతానికి ఎంతో ప్రాచీన చరిత్ర ఉన్నదని, భక్తికి పుట్టినిల్లని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కందకుర్తి ఒక పెద్ద ఆధ్యాత్మిక కేంద్రంగానే కాకుండా ఒక సామాజిక వికాస కేంద్రంగా కూడా విలసిల్లుతుందని కందకుర్తిలో సాక్షాత్తు స్కందుడే స్వయంగా కొలువై ఉన్నాడని పేర్కొన్నారు. గోదావరి, మంజీర, హరిద్రా నదుల త్రివేణి సంగమ క్షేత్రంగా కందకుర్తి అత్యంత పవిత్రమైన స్థానమని, శతాబ్ద కాలం నాటి రామాలయం, గోదావరి ఒడ్డున స్వయంభువుగా వెలసిన అమృతేశ్వరుడు, అంతేకాకుండా అయోధ్య నుంచి వచ్చిన సాధు పుంగవులు శ్రీ సీతారాం త్యాగి మహారాజ్ నిర్మించిన శని దేవాలయం వంటి ఎన్నో ఆధ్యాత్మిక పవిత్ర క్షేత్రాలకు కందకుర్తి చిరునామాగా నిలుస్తుందన్నారు. ఈ గ్రామాన్ని సర్వతోముఖాభివృద్ధి చేయటం కోసం ముందుకు వచ్చిన కేశవ సేవాసమితి బృందాన్ని, సేవాభారతి సంస్థను అభినందిస్తున్నట్లు స్వామీజీ తెలిపారు. ఈ గ్రామానికి మంచి చేయాలనే ఆలోచనతో నిర్వహిస్తున్న సేవా ప్రాజెక్టులన్నీ విజయవంతంగా పూర్తవుతాయని ఆశిస్తున్నట్లు స్వామీజీ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మల్లారం లింగేశ్వరగుట్ట ఆశ్రమాధిపతి శ్రీ పిట్ల కృష్ణ మహారాజ్, కేశవ సేవాసమితి అధ్యక్షులు చామకూర సుధాకర్ రెడ్డి, ఆర్ఎస్ఎస్. తెలంగాణ ప్రాంత సంఘచాలక్ బూర్ల దక్షిణామూర్తి, ప్రాంత సహకార్యవాహ మల్లికార్జున్, వనవాసీ కల్యాణ పరిషత్ అఖిల భారతీయ మార్గదర్శక్ పొన్నపల్లి సోమ యాజులు, ప్రాంత సేవాభారతి కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సేవా భారతి ప్రముఖ్ వాసు, ఇందూరు విభాగ్ ప్రచారక్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు. ★



# సంఘమిత్ర దత్తత గూడేలలో దుస్తుల పంపిణి



**నంద్యాల:** శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నలమల్ల అడవుల్లో ఉన్న చెంచులను చలి నుండి, దోమల నుండి కాపాడేందుకు అవసరమైన దుస్తులను నంద్యాల జిల్లా, సంఘమిత్ర– నిరంతర సేవా ప్రవంతి డిసెంబర్ 2న పంపిణీ చేశారు. సంవత్సరంలో మూడు నాలుగు సార్లు ఇలా దుస్తులు పంపిణి చేయటం సంఘమిత్ర సేవా కార్యక్రమాలలో ఒకటి.ఇందులో భాగంగా నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని జానాల గూడెం, బలపాల తిప్ప, పాత మాదుగుల, ఎర్ర మఠం తదితర చెంచుగుడేలలో దుప్పట్లు, చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షులు కె.నాగ సుబ్బారెడ్డి, కార్యదర్శి చిలుకూరి శ్రీనివాస్, కమిటీ సభ్యులు వి. రమణయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ★

సమాజానికి హితం కలిగించేదే సాహిత్యమని ఆలంకారికులు అభిప్రాయం ప్రకారం, గోదాదేవి ఆలపించిన తిరుప్పావై పాశురాలలో సమాజశ్రేయస్సు కనిపిస్తుంది. శ్రీరంగనాథుని పెళ్లాడాలన్న మనోవాంఛతో పాటు సాహిత్యం ద్వారా సమాజ హితాన్ని కోరిన సౌజన్యమూర్తిగా ఆమె సాక్షాత్కరిస్తారు. కేవలం వ్యక్తిగత ప్రయోజనాలే కాకుండా సమష్టి లబ్ధి చేకూరాలన్న భావన ఆమె పాశురాలలో వ్యక్తమవుతుంది. 'ఏడాదికి మూడు పంటలు పండాలి. చాలినంత వర్షం కురవాలి. గోవులు సమృద్ధిగా పాలు ఇవ్వాలి. ఏ సందర్భంలోనూ 'లేదు' అనే మాట వినిపించకూడదు' అని ఒక పాశురంలో ఆకాంక్షించడం గోదా లోక కల్యాణాభిలాషకు ఉదాహరణ.

# భక్త కల్పవల్లి ఆండాళ్ తల్లి



సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించిన నాటి నుంచి నెలరోజుల కాలాన్ని ధనుర్మాసం అంటారు. ఆహ్లాదం, ఆనందం కలిగించేవి తానేనని శ్రీకృష్ణపరమాత్ముడు చెప్పుకున్న సందర్భంలో **'మాసానాం మార్గశీర్షోహం ఋతూనాం కుసుమాకరః'** (భగవద్గీత :10-35) అన్నారు. మార్గశీర్షం ధనుర్మాసం కావడం వల్ల భగవత్సంబంధిత పూజాపునస్కారాలు నిర్వహించడం విదితమే. మార్గశీర్షం... 'మార్గం' అంటే దారి. శిరము అంటే తల. మానవ శరీరానికి తల దిశానిర్దేశం చేసినట్లే మార్గశీర్ష మాసం ఆధ్యాత్మికత వైపునకు దారి చూపుతుందని చెబుతారు. శ్రీమన్నారాయణుడి స్వరూపంగా భావించే ఈ మాసంలో ఆయనను ఆరాధించడం వల్ల వెయ్యేళ్లపాటు చేసే శుభకర్మల ఫలితం లభిస్తుందని బ్రహ్మాండ, స్కంద, ఆదిత్య పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ మాసం విశిష్టతను బ్రహ్మ మొదట నారదుడికి వివరించినట్లు పురాణ కథనం. బ్రహ్మాండ, ఆదిత్య పురాణాలలోనూ, నారాయణ సంహితలో దీనికి సంబంధించిన అంశాలు కనిపిస్తాయి. ఈ మాసంలో విష్ణువును మధుసూదనుడిగా అర్చిస్తారు.

లోక శ్రేయస్సుతో పాటు స్వకల్యాణాన్ని అపేక్షించిన గోదాదేవి తమ ఆరాధ్య దైవం శ్రీకృష్ణుడిని ప్రసన్నం చేసుకునేందుకు ధనుర్మాసం వ్రతం పాటించి, రోజుకొకటి కీర్తన చొప్పున (తమిళంలో పాశురాలు) మాసం పాటు ముప్పయ్ పాశురాలు ఆలపించడం మరో ప్రత్యేకత. దీనినే శ్రీ వ్రతం, ధనుర్మాస వ్రతం, సిరినోము అనీ అంటారు. 'తిరుప్పావై' అనే ఈ తమిళ పదానికి 'తిరు' అంటే శ్రీ, శ్రీప్రదం, లక్ష్మి, సంపద, శ్రేష్ఠం, ఐశ్వర్యం, మోక్షం అనే అర్థాలు ఉన్నాయి. 'పావై' అంటే పాట(లు)లేక వ్రతమని అర్థం.

ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకుంటూ స్వకార్యాన్నే కాక లోకహితాన్నీ కాంక్షించాలన్న భావన గోదాదేవి రచనల్లోనూ, ఆమె జీవన శైలిలోనూ వెల్లడవుతుంది. వివిధ జాతుల పూలను సేకరించి అందమైన మాలకట్టినట్లే వివిధ వర్గాలకు చెందిన భిన్న ప్రవృత్తులు గల యువతులను సమీకరించి శ్రీవ్రతానికి శ్రీకారం చుట్టింది. పెళ్లికాని పడుచులు తమకు నచ్చిన,మెచ్చిన వారిని భర్తను ప్రసాదించ వలసిందిగా శ్రీకృష్ణుడిని వేడుకుంటూ పాటల పాడుకునే సంప్రదాయం కూడా అప్పటి నుంచి మరింత ప్రాచుర్యంలోకి వచ్చి ఉండవచ్చని ఆధ్యాత్మిక వాదులు చెబుతారు.

భారతీయ భక్తి సాహిత్యంలో ఆళ్వార్ దివ్య ప్రబంధాలు అత్యంత ప్రముఖ స్థానాన్ని అలంకరించగా, శ్రీకృష్ణుడిని స్తుతిస్తూ గోదాదేవి గానం చేసిన పాశురాలు 'తిరుప్పావై' దివ్య ప్రబంధంగా శిఖరాయమానంగా వెలుగొందుతోంది. గోదాదేవి నోట సర్వ సులభరీతిలో వెలువడిన తిరుప్పావై ఉపనిషత్తుల సారమని పూర్వాచార్యులు అభివర్ణించారు. 'మంచిచెడులను వివేచన చేసుకోవాలి. భగవత్ సేవకైనా, లౌకిక వ్యవహారాలలోనైనా సత్వరం స్పందించాలి. క్షణం వృథా చేసినా సాధన తగ్గిపోతుంది. సకల జంతుజాలం పరమాత్మ అవతార విశేషమే. వాటిపట్ల దయ, కరుణ కలిగి ఉండాలి. భగవదర్చన, నివేదన సహా అన్ని ఉపచారాలలో నిశ్చలభక్తి తప్ప, ఆడంబరాలు అవసరంలేదు. చిత్తశుద్ధితో చేసే స్వల్ప ఆరాధనైనా అఖండంగా స్వీకరిస్తాడు.

మధురభక్తికి గోదాదేవిని ప్రతీకగా చెబుతారు ఆధ్యాత్మికవాదులు. లోకంలో స్త్రీ పురుషుల మధ్య ప్రేమ, లౌకికం కాగా, భగవంతుడికి భక్తుడికి మధ్య గల ప్రేమ అలౌకికం. అదే మధురభక్తి. ఆ మార్గంలో భగవంతుడిని సేవించి తరించిన వనిత, దివ్యాంశ సంజాత గోదాదేవి.

భూదేవి అంశగా పూదోటలో విష్ణుచిత్తుడి

## డిసెంబర్ 17 ధనుర్మాసం ప్రారంభం..

(పెరియాళ్వార్)కి లభించిన గోదాదేవి భగవంతుడినే పరిణయమాడాలన్న సంకల్పంతో పాటు సమాజ హితం కోరి దీక్ష బూనింది. ఆ క్రమంలోనే ధనుర్మాసంలో వేకువనే మేల్కొని స్నేహితురాళ్లతో కలసి హరి పూజ చేస్తూ, ఆ అనుభవాలను రోజుకు ఒక కీర్తన (పాశురం)గా రాసి శ్రీకృష్ణ అంశ శ్రీరంగ నాథుడికి అర్పించింది.

**'కర్కటే పూర్వ ఫల్గున్యాం తులసీకాననోద్భవామ్**
**పాండ్యే విశ్వంభరాం గోదాం వందే శ్రీరంగనాయకీమ్'**

తమిళనాడులో శ్రీవిల్లిపుత్తూరులో ముకుందాచార్యులు, పద్మావతి దంపతుల పుత్రుడు భట్టనాథుడు (విష్ణుచిత్తుడు) తన జీవితాన్ని భగవత్ సేవకు అంకితం చేశారు. వటపత్రసాయికి నిత్యం తులసి, పూమాలలను సమర్పిస్తూ, తాను రాసిన కీర్తనలు (తిరుపల్లాణ్డు) గానం చేసేవారు. .

రంగనాథ పెరుమాళ్ పుష్ప కైంకర్యం కోసం ఆయన పెంచుతున్న పూలు, తులసివనంలో కర్కాటక మాసం, పుబ్బ నక్షత్రంలో చిన్నారి లభించింది. పూలమాల అని అర్థం వచ్చేలా చిన్నారికి 'కోదె' అని పేరుపెట్టారు. ఆ పదమే 'గోదా' అని సంస్కృతీకమైంది. భూమిని 'గో' అంటారు. ఆమె భూదేవి అంశ కనుక, 'గోదా' అనే పేరు కలిగిందని వ్యవహారంలో ఉంది. జానకీసతిలా భూజాత అయిన ఆమెను పాలక తండ్రి విష్ణుచిత్తులు 'ఆండాళ్' (కాపాడునది) అని సంబోధించారు. తనను తరింపచేసేందుకు ఆమె తన కుమార్తెగా లభించిందని ఆయన భావన.

విష్ణుచిత్తుడు కుమార్తెకు శ్రీకృష్ణ వైభవాన్ని వినిపిస్తుంటే మైమరచి ఆలకించేది. శ్రీకృష్ణుడి బాల్యంలోని గోపికలలో తాను ఒకరిగా, ఉద్యాన వనంలోని తండ్రి కుటీరాన్నే యదునందనుడి రాజ్యంగా భావించుకునేది. ద్వాపరంలో యాదవ కన్యలు జరిపిన ఉత్సవాలను మానసికంగా తనకు అన్వయించుకుంటూ, ఆ అనుభూతికి అక్షరరూపం ఇచ్చింది. మంచి అలవాట్లతో జీవించాలని, తోటి వారికి సాయపడాలని, భగవంతుడిని ఆరాధించాలని ఈ పాశురాలు ప్రబోధిస్తాయి. వీటిలో పరమాత్ముని తీరు, ఆయనను చేరేందుకు అనుసరించవలసిన మార్గాలు, పల్లెల అందాలు, ఉదయం కాలపు వర్ణనలు ఉంటాయి. అలా కృష్ణునిపైగల భక్తి ప్రేమగా మారి ఆయనను పతిగా ఊహించుకుంటూ, ఆయన కరుణ కోసం పూజలు ఆచరించింది.




డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్


**ఆముక్తమాల్యద**

స్వామి సేవకోసం పెరియాళ్వార్ తయారు చేసిన పూమాలలను గోదాదేవి ముందుగా ధరించి బావిలోని నీటిలో (బావి శ్రీవిల్లిపుత్తూరులో నేటికీ ఉంది) ప్రతిబింబాన్ని చూసి మురిసిపోయేదట. ఆది తెలియని పెరియాళ్వార్ ఆమె 'ధరించి విడిచిన మాలలనే స్వామివారికి సమర్పించేవారు. ఒకరోజు దండలో కనిపించిన శిరోజం కూతురిదిగా గ్రహించి, స్వామి పట్ల తన అపచారానికి కలత చెంది ఆ రోజు ఆలయానికి మాలలు పంపలేదు. అదే రోజు రాత్రి విష్ణుచిత్తుడికి స్వప్న సాక్షాత్కారం చేసిన శ్రీరంగ నాథుడు 'గోదా ధరించిన మాలలే నాకు ఇష్టం. ఆమెను పరిణయమాడతాను. నా వద్దకు చేర్చు' అని సూచించి, పాండ్యరాజుకు కలలో కనిపించి, 'ఆండాళ్ కోసం పల్లకీ పంపవలసిందిగా ఆదేశించాడు. స్వామి కబురుతో ఆనందోత్సాహాలతో ఆలయం చేరుకున్న ఆండాళ్ ఆయనను పరిణయ మాడి ఆయనలో ఐక్యమైంది. 'రంగనాయికి'గా ఆరాధనీయ అయ్యింది. ఆమెకు శూడికొడుత్త నాచ్చియార్, ఆముక్తమాల్యద అనే పేర్లు బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి. స్వామి కోసం తయారైన పూలమాలలు ఆమె ధరించిన తర్వాతే స్వామికి చేరేవి కాబట్టి ఆమెకు 'శూడి కొడుత్త నాచ్చియార్' (సంస్కృతీకరణ రూపం 'ఆముక్తమాల్యద) అని వ్యవహారంలోకి వచ్చింది. పదకవితా పితామహుడు అన్నమాచార్యులు 'చూడరమ్మ సతులాల సోబాన ఁబాడరమ్మ/కూడున్నది పతి ఁజూడికుడుత నాచారి' అని కీర్తించారు.

విశిష్టాద్వైత సిద్ధాంత ప్రవర్తకులు రామానుజాచార్యుల శిష్యులు అనంతాచార్యులు ఆమెను మొదటిసారిగా 'ఆముక్తమాల్యద' అని వ్యవహరించినట్లు ఆయన కావ్యం 'ప్రసన్నామృతం' పేర్కొంటోంది. అనంతర కాలంలో శ్రీకృష్ణ దేవరాయలు ఆ పేరునే యథాతథంగా స్వీకరించి కావ్యరచన చేశారు.

**ఆళ్వారుగా...**

ఆధ్యాత్మిక సాగరంలో తరించిన వారిని శ్రీవైష్ణవ సంప్రదాయంలో 'ఆళ్వారులు' అంటారు. అలాంటి పన్నెండు మందిలో విష్ణుచిత్తుడు ప్రథములు (పెరియాళ్వార్). ప్రణవ, ప్రణయ తత్త్వాలకు పసిడి సేతువుగా నిలిచిన ఆండాళ్ ఆళ్వారులలో ఏకైక మహిళ. రామానుజాచార్యులు ప్రతి విష్ణ్వాలయంలో గోదాదేవి సన్నిధిని ఏర్పరచి ఆమెకు, ఆమె పాశురాలకు ప్రత్యేక స్థానం కల్పించారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ ధనుర్మాసంలో సుప్రభాతానికి బదులు తిరుప్పావైనే గానం చేస్తారు (అన్ని విష్ణ్వాలయాలలో వేకువ జామున దీనిని పాటిస్తారు). తిరుమలేశుడు తమ బ్రహ్మోత్సవాలకు శ్రీవిల్లిపుత్తూరు నుంచి ప్రత్యేకంగా వచ్చే పూలమాలలు ధరిస్తాడు..

**తిరుప్పావై వ్రత విధివిధానాలు**

తిరుప్పావై వ్రతానికి కొన్ని విధివిధానాలు నిర్దేశితమయ్యాయి. వేకువజామునే నిద్రలేచి స్నానాదులు ముగించుకుని పాశురాలను, స్వామి కీర్తనలను ఆలపించాలి. దేవదేవేరులకు ఇష్టమైన పుష్పాలు సమర్పించాలి. పొంగలిని నివేదించాలి. ఈ మాసంలో విష్ణువును మధుసూదనుడిగా అర్చించి, మొదటి పక్షం రోజులు చక్కెర పొంగలి లేదా పులగం నివేదిస్తారు.



స్వామి సేవకోసం పెరియాళ్వార్ తయారు చేసిన పూమాలలను గోదాదేవి ముందుగా ధరించి బావిలోని నీటిలో (బావి శ్రీవిల్లిపుత్తూరులో నేటికీ ఉంది) ప్రతిబింబాన్ని చూసి మురిసిపోయేదట. ఆది తెలియని పెరియాళ్వార్ ఆమె 'ధరించి విడిచిన మాలలనే స్వామివారికి సమర్పించేవారు.

తరువాతి పక్షం పాటు దధ్యోజనం సమర్పిస్తారు. ప్రధానంగా పులగం, పాయసం, దధ్యోజనం సమర్పిస్తారు. ఆరోగ్యపరంగా చూస్తే, చలికాలంలో కడుపులో జఠరాగ్నితో పాటు ఆకలి పెరుగుతుంది. సాత్వికాహార స్వీకరణతోనే జఠరాగ్ని చల్లబడుతుంది. పాలు, పెరుగు, పెసరపప్పులో చలువ చేసే గుణం ఉన్నందున వాటిని ప్రసాదంగా వినియోగిస్తారని చెబుతారు.

దీక్ష, పట్టుదల, నియమం, అనుష్ఠానం, ఉపవాసం, పారాయణం, పూజాది ధార్మిక కార్య కలాపమే వ్రతమని పెద్దలు నిర్వచించారు. శ్రద్ధ, ఏకాగ్రత, చిత్తశుద్ధితో లోకహితం కోరి చేసే వ్రతం చక్కని ఫలితాన్నిస్తుందనేందుకు గోదామాత అనుభవం చాటిచెబుతోంది.

**'స్వోచ్ఛిష్టమాలికాబంధ గంధబంధుర జిష్ణవే**
**విష్ణుచిత్తతనూజాయై గోదాయై నిత్యమంగళమ్'** ★



# ‘అలివేణి’ ఆణిముత్యమా!!

‘నిండుచంద్రులు మీరు –వెన్నెలను నేను
దివ్యభానులు మీరు – పద్మినిని నేను
మీపదాబ్జ సన్నిధియె స్వామీ! మదీయ
జీవనమ్ము సమస్త సంభావనమ్ము’

ఈ అంతరంగ తరంగం అలివేణమ్మది. పూర్తిపేరు బారు అలివేలమ్మ. ఆమె శిలా విగ్రహం రాజమండ్రిలో ఉంది. అక్కడి స్వాతంత్ర్య సమరయోధుల పార్కులో కనిపిస్తుంది.

భర్త రాజారావు సైతం అలనాటి పోరాట యోధుడు. స్వాతంత్ర్య సాధనమహోద్యమంలో ఆ దంపతులు ముందువరసన ఉన్నారు. కారాగారవాసం అనుభవించింది ఆ జంట. శిక్షా కాలంలో ఆమెకు మనసు వికలమైనా, తనకు తానుగా తేరుకునేవారు. దాంపత్య అనుబంధమే జ్ఞాపకంగా ఉంటుండేవారామె.

ఆయన పదసన్నిధినే ఆమె కోరుకున్నా, తన జీవనమంతా ఆయనదేనని ఎంతగా తలపోసినా శిక్షాకాలం తప్పనిసరి కదా!

పరప్రభుత్వ దమనకాండ, అణచివేత ఎంత ఎక్కువైతే, అంతే ఎక్కువగా అలివేలమ్మ పట్టుదల ఉండేది. ఒకటే లక్ష్యం దాస్యం నుంచి విముక్తి. అందుకోసం ఎంత యాతననైనా భరించడం.

76 ఏళ్లు జీవించారు. జీవితకాలంలో తొలినుంచీ పోరు స్ఫూర్తినే కనబరిచారు. మరింత ప్రత్యేకత ఇంకొకటుంది. తాను ఎంత క్రియాశీలురాలో బహుభాషల్లో అంతే కోవిదురాలు.

---

అవి స్వాతంత్ర్య ఉద్యమ రోజులు. దినదినగండ వాతావరణం.

భారతీయుల భావోద్వేగం తీవ్రరూపం ధరించింది.

ఆంగ్ల దొరల ఆధిపత్యాన్ని అసలే భరించ లేకపోతున్నారు.

ఏదో ఒకటి తేల్చుకోవాలన్న దృఢ నిశ్చయం అందరిదీ. పాలకులు నానారకాల తంత్రాలూ ప్రయోగించారు.

సామ, దాన, భేద, దండోపాయాలు అంటారు కదా అవన్నీ!

కొన్నాళ్లకి దండోపాయాన్నే ఎంచుకున్నారు వాళ్లు.

అది అలహాబాద్ నగరం. సందర్భం విదేశీ వస్త్ర బహిష్కరణ.

అప్పుడు అలివేణి బాలిక. సాహసంలో మటుకు కాళిక!

బాలగంగాధర్ తిలక్ ఉద్యమానికి నేతృత్వం వహించారు. విదేశీ వస్త్రాలన్నింటినీ నడిరోడ్డున కుప్పపోగా పోసి నిప్పంటించారు! మరికొన్నాళ్లకే ఉద్యమరా ఊపందుకుంది. పుణె నుంచి తదుపరి కాలంలో దేశమంతటా వ్యాపించింది. లక్షలాది జనవాహిని కలసికట్టుగా ముందుకు సాగింది. ప్రాణాలకు తెగించి మరీ పోరుశంఖం ఊదింది.

**ఆ అన్నింటికీ ప్రత్యక్ష వీక్షకురాలు అలివేణి**

భారత్‌కు బ్రిటిష్ నుంచి వచ్చిన వస్తువు లెన్నింటినో బహిష్కరించారు ప్రజలు. పంచదారను కాదన్నారు. బెల్లం వాడటం ఆరంభించారు. అన్నీ స్వదేశీ సంబంధమైనవే. ఆంగ్లేయుల వ్యాపారానికి గండి.

ఇదంతా చూసిన అలివేణి ‘నేనుసైతం’ అంటూ వేసిన ముందడుగు మరెందరికో దీప్తిమంతమైంది.

**మూర్తి దాల్చిన పౌరుషమో, అఖండ**
**మైన ఆత్మవిశ్వాస మహానదమ్మొ !**
**సాహసోత్సాహ సత్య లీతేజస్సో నీవు**
**విశ్వసౌభ్రాత్రి ! భారత వీరపుత్రి!**

అనేలా ఆ యువతి పోరుపతాక ఎగురవేసిన తరుణమది. అందుకు ముందుగా అలహాబాద్ వెళ్లారు. అక్కడ ఏర్పాటైన ఉద్యమ ప్రక్రియకు అంతా తానై నిలిచారు. తెలిసింది కదా… ఒకప్పటి ప్రయాగ్ రాజ్. అటు తర్వాత అలహాబాద్. నాటి ఉత్తర ప్రదేశ్‌లో కీలకం.

అక్కడికి వెళ్లిన ఉద్యమకారిణిది దక్షిణాదిన రాజమండ్రి సమీప కాకినాడ. రాజమండ్రి, కాకినాడ…దేనికి అదే సాటి. గోదావరి ఒడ్డును నగరం రాజమహేంద్రవరం. అదే ప్రాంతంలోని కాకినాడ కూడా సామాజిక, సాంస్కృతిక పురోగమన నిలయం.

(రాజమండ్రిలోని ఆంధ్రకేసరి యువజన సమితి వారే ఆ నగరాన విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అలివేలమ్మ జీవిత విశేషాలన్నింటనీ శిలమీద పొందికగా చెక్కించారు. ఆమె తల్లిదండ్రులు వెంకుబాయమ్మ, కృష్ణారావులను ప్రస్తావించి గౌరవాదరాలు ప్రకటించారు. ఇదే ఫలకం మీద అలివేలమ్మ భర్త రాజారావు స్వాతంత్ర్య సమరవీరులు అంటూ శ్లాఘించారు.)

‘ఒక్కమాటలో ‘ధృవతార’ ఆమె.

**దరులు దొరకని నీదు వాగరుల ముంచి**

వేలకొలదిగ ప్రజల జోకట్టగలవు
సత్యసందేశ మ్మొసగి జనతనెల్ల
కోడికూతవలెన్ మేలుకొలుపగలవు!'

అనిపిస్తుంది ఆ నేత వ్యవహార పటిమను తలచినప్పుడు!

**అదీ ఆమె సందేశ ప్రాభవ వైభవం.**

ఆ ధీరకు సంతానంలోని గోవిందరావు కూడా ఉద్యమ మార్గాన నడిచినవారే. అంటే, ఆ కుటుంబ సభ్యులు అందరూ పోరాట శూరులే!

అలహాబాద్ నుంచి రాజమండ్రికి చేరుకున్న అలివేలమ్మ అక్కడా శంఖం పూరించారు. ప్రత్యేకించి మహిళల ఉద్యమ భాగస్వామ్యం మరింత పెరిగేలా శ్రమించారు. అందుకు తాను ఎంచుకున్న విధానాలు ఐదు.

**1. పరిచయాలు పెంచుకోవడం.**

**2. స్వతంత్ర భావాలు రేకెత్తించడం.**

**3. క్రియాశీలత అవసరాన్ని చాటి చెప్పడం.**

**4. ఉద్యమ అనివార్యతను ప్రస్ఫుటం చేయడం.**

**5. బాధ్యతల విభజన ద్వారా, కవితల నాయకత్వ పటిమను విస్తరించడం.**

ఈ ఐదు సూత్రాలతోనూ ముందడుగు వేసిన అలివేలమ్మ మరొక కీలకాంశాన్ని అధిక ప్రాధాన్యంగా గుర్తించారు. అది వనితల అక్షరాస్యత.

అంటే కేవలం చదవడం, రాయడం కాదు.

చుట్టుపక్కల స్థితిగతులను గమనించడం.

గమనించిన వాటిని సామాజికంగా విశ్లేషించడం.

విశ్లేషించిన విషయాలను క్రియాత్వానికి ఆపాదించడం. దీనివల్ల ఏం జరుగుతుందని ఆమె భావించారో తెలుసా?

**ధీర గంభీర పౌరుషోత్తేజ పటిమ**
**మిత నిజజాతి రక్షా ప్రమాణ దీక్ష**

అదే కోణంలో తనదైన పంథాలో ముమ్ముందుకు పయనించారు. వనితాలోకాన్ని తీర్చిదిద్దడం భవిష్యత్తులోనూ అద్భుత ఫలితాలకు మూలమవుతుందని నిరూపించగలిగారు.

వాస్తవానికి అక్షరాస్యత అనేది నాలుగు అంశాల మిళితం.

**1. క్రియాత్మకం**

**2. సాంస్కృతిక సంబంధం**

**3. వ్యక్తిగత ఉన్నతి సాధనం**

**4. విమర్శనాత్మక రీతికి ఆలంబనం.**

విద్యాబుద్ధులు, సంస్కృతీ, నాగరికతలు, స్వయం–సమాజ వికాస ప్రకాశాలు. వీటి మేళవింపు కార్యక్రమాలు అనేక ఫలితాలనిచ్చాయి.

అక్షరాస్యత అనేది సామర్థ్యానికి సూచిక. రోజువారి జీవితంలో ఎవరైనా సరే ఎంత చిన్న ప్రకటనైనా సరే చక్కగా గ్రహించగలిగితే అదే సమర్థత. అంతటి గమనింపును స్త్రీలోకంలో పెంచడానికి ఎంత చేయాలో అంత చేశారు అలివేలమ్మ. అవగాహన స్థాయిని పెంచడం పైన చూపు కేంద్రీకరించారు. పర్యవసానంగా, నారీచేతన సుసాధ్యమైంది. ఉద్యమ స్థాయి తీవ్రతతో, పాలకవర్గం సంచరించింది. ఆమె నిర్వహణ సామర్థ్యం ఎంత గొప్పదో పాలకులకు తెలిసివచ్చింది.

1947 ఆగష్టు 15 మనకు స్వతంత్రత.

అదే సందర్భంలో ఒక అంశాన్ని పదే పదే గుర్తుచేసుకున్నారామె. సేవాగ్రామ ఆశ్రమం. పేరుకు తగిన నిర్మాణరీతి.

ఆశ్రమం అంటే పర్ణశాల అనుకుంటాం. తపస్సు జరిగే ప్రాంతమని భావిస్తాం. వేదాభ్యాస స్థలమనీ తలపోస్తాం. సేవాశ్రమం మాత్రం సాటివారికి దోహదపడే ప్రాంతీయ స్థలం. తన భావాలకు రూపుదిద్దుకుంది అక్కడే" అని ప్రకటించారు – ఆ పడతి.

సేవాభావానికి ప్రతిరూపం ఆంధ్రకేసరి యువజన సమితి. విద్యను అభివృద్ధి చేయడం, సంస్కృతి విస్తరించే కృషిని ముమ్మరం చేయడం ముఖ్య లక్ష్యాలు.

**అభివృద్ధి, వికాసం, వ్యాప్తి**

ఆ యువజన సమితి నిర్వహణలోనే పలువురు మహిళా దేశభక్తుల విగ్రహాలు రాజమండ్రిలో ఏర్పాటయ్యాయి.

పదుల సంఖ్యలో ఉన్న ప్రతిమలు. అన్నింటినీ పార్కులో స్థాపించి, దేశభక్తి భావాన్ని నిలబెట్టకుండా సంస్థ. శిలాఫలకాలు – వాటిమీద వివరాలు.

సమితి నిర్వాహక ముఖ్యునిగా యాదగిరి శ్రీరామ నరసింహారావు (వై.ఎస్.ఎస్.) ను ప్రస్తావించి తీరాలి. వై.ఎస్.ఎస్.

స్వాతంత్ర్య సమర వీరనారీ మణుల పార్కు ప్రాంతంలోనే ఇండిపెండెన్స్ సెంటర్!



**జంధ్యాల శరత్‌బాబు**
**సీనియర్ జర్నలిస్ట్**

నాటి ధీరుల చిత్రపటాలు, వారు ఆనాడు వినియోగించిన వస్తువుల ప్రదర్శనలు! వాటిని చూస్తుంటే....

**–స్వాతంత్ర్య సమర ప్రచార ప్రశస్తమౌ**
**మహదానంద మహోమహస్సు!**
**జాతీయ భావనా సార సంపన్నమౌ**
**బహు నికేతనోజ్జ్వల యశస్సు!**
**విజయ విశ్రుత వీర విక్రమ స్ఫురణమౌ**
**నవ్య ధర్మదీక్షా తపస్సు!**
**తరుణ భారత భావ చైతన్యశక్తి**
**భరతనారీ ప్రభాత వైభవ బలమ్ము'**

ఈ అన్నీ మనముందు నిలుస్తాయి. ఉత్తేజితం చేసి, జాతీయతా స్ఫూర్తిని మరింత ప్రస్ఫుటంగా నిలబెడతాయి.

బారు అలివేలమ్మ కుటుంబ నేపథ్యం, వైవాహిక జీవితం, స్వాతంత్ర్యోద్యమ భాగస్వామ్యం, సేవార్గాన ఆమె ప్రతిష్ఠించిన విలువల నిలయం – అన్నీ తెలుగువారి మదిని ఆహ్లాదభరితం చేసేవే. తెలుగు, సంస్కృతీ, ఇతర భారతీయ భాషల్లో గొప్ప అభిప్రాయ వ్యక్తీకరణ చేసిన ధీశక్తి ఆమెది.

స్వేచ్ఛ, స్వతంత్రత, సమానత్వం. ఈ మూడింటికీ పతాకగా నిలిచిన ఆమె స్మృతి సూచన కార్యక్రమాలు తెలుగునాట జరుగుతున్నాయి. ★



**తెలంగాణ ఎన్నికల ఫలితాలు పాలకుల అహంకారం, అధికార దుర్వినియోగం, అవినీతి, అభివృద్ధినిరోధంవంటి అంశాలపై ప్రజల వ్యతిరేకతను ప్రతిబింబించాయి. బీఆర్ఎస్ నాయకులు, అనుచరుల అధికారమదానికి ఈ ఎన్నికల ద్వారా సరైన బుద్ధి చెప్పారు. ఈ ఎన్నికల్లో గెలవడానికి బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు వేయని ఎత్తులేదు. కాని అవి ఫలించలేదు. ఆయన, ప్రతి ఎన్నికల్లో ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి తెలంగాణ ప్రజల్లో సెంటిమెంటు పురిగొల్పి గెలిచే ప్రయత్నం చేయడం తెలిసిందే. ఈ ఎన్నికల్లో కూడా అదే జరిగింది. అయితే ఇందులో బీఆర్ఎస్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వైసీపీ ప్రభుత్వానికి ప్రధాన పాత్ర ఉంది. ఆ**




తెలంగాణ అసెంబ్లీ పోలింగ్ నవంబరు 30న జరుగుతుండగా, ముందురోజు (29) అర్ధరాత్రి కృష్ణా జలాల పేరుతో నాగార్జునసాగర్ కేంద్రంగా ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా హైడ్రామాకు తెరదీశాయి. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు, నర్సరావుపేటల నుంచి వందలాది మంది పోలీసులు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నాగార్జునసాగర్ చేరుకున్నారు. సాగర్ ప్రాజెక్టు తెలంగాణ ప్రభుత్వ అధీనంలోని రిజర్వు పోలీసు బందోబస్తులో ఉంది. ఏపీ పోలీసులు సాగర్‌ప్రాజెక్టు 13వ గేటు వరకు దూసుకెళ్లి తమ అధీనంలోకి తీసుకున్నారు. ముళ్లకంచెను ఏర్పాటు చేశారు. వాహనాలు తనిఖీ చేసి ఆంధ్ర ప్రాంతం వారికి మాత్రమే అనుమతిచ్చారు. ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఆంధ్ర ఇరిగేషన్ శాఖ అధికారులు కుడి కాలువకు నీటిని విడుదల చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కృష్ణా నదికి వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు నీటిని విడుదల చేసే క్రస్ట్ గేట్ల మెయింటెనెన్స్‌తో పాటు కుడి కాలువ గేట్ల మెయింటెనెన్స్ కూడా తెలంగాణ వైపు భూభాగంలో ఉన్న ఇరిగేషన్ శాఖ అధికారుల అధీనంలోనే ఉంటాయి.

తాజాగా ఆ వ్యవస్థను రాష్ట్ర అధికారులు మార్చివేసినట్లు చెబుతున్నారు. రాష్ట్ర హద్దుల్లోనే కుడి కాలువకు నీటి విడుదల చేసేందుకు అనువుగా సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, ఉదయం నీటిని విడుదల చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా, ప్రకాశం జిల్లాలోని చెరువులకు గ్రామాలకు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు చెప్పారు. మొదటగా 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అనంతరం 3,000 క్యూసెక్కుల వరకు పెంచనున్నట్లు అధికారులు తెలిపారు. సుమారు అయిదు టీఎంసిల నీటిని తీసుకోనున్నట్లు తెలిపారు. దీనిపై వైసీపీ సర్కారు ‘సాగర్ నుంచి నీళ్లు కావాలని కృష్ణానదీ నిర్వహణ బోర్డు (కేఆర్ఎంబీ) ను అడిగితే ఇవ్వలేదని అందువల్ల ఈరకంగా నీటిని తీసుకుంటున్న’ట్లు పేర్కొంది.

## బోర్డుపై నెపం

నీటిని విడుదల చేయాలని కోరకుండానే ఏపీ ప్రభుత్వం అకస్మాత్తుగా పోలీసు బలగాల మోహరింపుతో డ్యామ్‌పై హడావిడి చేయడంపై కృష్ణానదీ నిర్వహణ బోర్డుకే (ఆర్ఎంబీ) విస్మయం వ్యక్తం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పుపడుతూ కేఆర్ఎంబీ లేఖరాసింది. దీని ప్రకారం... ఈ ఏడాది అక్టోబరు 6న జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో... మూడు విడతలుగా చెరో 15 టీఎంసీలను తాగునీటి అవసరాలకు మాత్రమే విడుదల చేస్తామన్న ప్రతిపాదనకు తెలంగాణ, ఏపీ అంగీకరించాయి. ఇరు రాష్ట్రాల అధికారులు సంతకాలు కూడా చేశారు. తమకు ఎప్పుడెప్పుడు నీరుకావాలో ఏపీ అధికారులే షెడ్యూలు ఇచ్చారు. దీనిప్రకారం... అక్టోబరు 10 నుంచి 20వరకు 5 టీఎంసీలు విడుదల చేశారు. ఆ తర్వాత... జనవరి 8 నుంచి 18 వరకు 5 టీఎంసీలు, ఏప్రిల్ 8నుంచి 18 మధ్య మరో 5 టీఎంసీలు విడుదల చేయాలని ఏపీ కోరింది. మధ్యలో నీటి విడుదల కోసం ఎలాంటి ఇండెంట్ పెట్టలేదని కేఆర్ఎంబీ స్పష్టంచేసింది. “మీరు ఇచ్చిన షెడ్యూలు ప్రకారం అక్టోబరులో 5 టీఎంసీలు విడుదల చేశాం. నవంబరులో నీళ్లు కావాలని మీ నుంచి ఎలాంటి ఇండెంట్ రాలేదు. అయినప్పటికీ... వెయ్యి మంది పోలీసులతో వచ్చి, జలాశయాన్ని ఆక్ర మించి, బలవంతంగా గేట్లు తెరిచి, కుడికాల్వకు నీరు విడుదల చేశారని తెలంగాణ నుంచి ఫిర్యాదు అందింది. సాగర్ నుంచి వెంటనే నీటి విడుదల నిలిపివేయండి” అని కేఆర్ ఎంబీ రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాసింది. విభజన చట్టం ప్రకారం పదేళ్లపాటు శ్రీశైలం ప్రాజెక్టు ఏపీ, సాగర్‌ను తెలంగాణ నిర్వహించాలని నిర్ణయం జరిగినట్లు గుర్తు చేసింది. వెరసి... జగన్ సర్కారుది దుందుడుకు చర్యగా తేల్చి చెప్పింది.

## పోలీసులపై కేసులు

రెండు రాష్ట్రాల పాలకపక్ష పెద్దలు ఆడిన డ్రామాలకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఇరకాటంలో పడ్డారు. ఏపీ పోలీసులపై తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేయడం వైసీపీ ప్రభుత్వానికి సిగ్గుచేటుగా మారింది. తెలంగాణ ఎన్నికలు జరిగే రోజునే రెండు ప్రభుత్వాలు నాగార్జున సాగర్ డ్యామ్ దగ్గర జలవివాద సమస్యను ఉన్న పళంగా తెరపైకి తీసుకొచ్చాయి. రెండు రాష్ట్రాల ముఖ్య మంత్రులు ఎన్నికల ప్రయోజనాల కోసం ప్రయత్నించి, పెద్ద ఎత్తున పోలీసు బలగాలను అక్కడి రప్పించి హడావిడిచేశారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. పైకి రాష్ట్రాల హక్కుల కోసం పోరాడుతున్నట్లు సృష్టించారు. ఈ వివాదంలో ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు బాగానే ఉండగా ఏపీ పోలీసులు మాత్రం కేసుల్లో ఇరుక్కున్నారం టున్నారు. వారిపై ఏపీ పోలీసులపై నాగార్జున సాగర్ విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఏ-1గా ఏపీ పోలీస్ ఫోర్స్‌ను పేర్కొంది. తెలంగాణ భూభాగంలోకి దౌర్జన్యంగా చొచ్చుకొచ్చారని, సాగర్ కుడి కాల్వ గేటు నుంచి ఏపీకి నీటిని వదిలారని, ప్రధాన డ్యామ్‌లోని 13 నుంచి 26 గేట్ల వరకు ఆస్తుల

టి.ఎన్.భూషణ్

రెండు పార్టీల సీఎంలు కలిసి తమ ఉభయులకు మేలు జరిగేలా ఈ ఎత్తు వేసినట్లు రెండు రాష్ట్రాల్లోని రాజకీయపార్టీలు విమర్శిస్తున్నాయి. నాగార్జున సాగర్ నీటిపై తమ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో యుద్ధం చేస్తున్నట్లు ప్రజలను నమ్మించి ఎన్నికల్లో ప్రయోజనం పొందాలని బీఆర్ఎస్ పార్టీ, అదే నీటికోసం తెలంగాణతో పోరాటం చేస్తున్నట్లు వైసీపీ నమ్మించే ప్రయత్నం చేశాయి. కాని ఇదంతా పెద్ద డ్రామాగా నమ్మినతెలంగాణ ప్రజలు, ఈ వ్యవహారాన్ని అసలు పట్టించుకోలేదు. బీఆర్ఎస్‌ను ఓడించారు. ఆదే వ్యవహారంలో ప్రయోజనం పొందాలనుకుంటున్న వైసీపీకి సానుభూతి రావడం మాట దేవడెరుగు ఇదంతా పెద్ద మాయగా ప్రజలు విమర్శిస్తున్నారు.



# 'జల'క్రీడ

ధ్వంసానికి పాల్పడ్డారంటూ ఫిర్యాదులో తెలిపింది. దీనిపై ఏపీ పోలీసులు కూడా విజయపురి సౌత్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాగార్జున సాగర్ జలాల విడుదలపై ఏపీ, తెలంగాణ మధ్య నెలకొన్న వివాదంపై కేంద్ర హోం శాఖ స్పందించింది. రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలతో కేంద్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా దృశ్య మాధ్యమ సమీక్ష నిర్వహించారు. సాగర్ జలాల విడుదల విషయంలో నవంబరు 28వ తేదీకి ముందు ఉన్న పరిస్థితిని కొనసాగిస్తూ, డ్యామ్ నిర్వహణను కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు అప్పగించడంతో పాటు సీఆర్‌పీఎఫ్ దళాల పర్యవేక్షణకు అప్పగించాలని కేంద్రం శాఖ కార్యదర్శి ప్రతిపాదించారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఈ ప్రతిపాదనకు అంగీకరించాయి.

**ఏపీపై తెలంగాణ ఫలితాల ప్రభావం**

తెలంగాణ ఎన్నికల ఫలితాలు వచ్చే జరిగే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లోను పునరావృతం అవడం ఖాయంగా కనిపిస్తోంది. 'బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల్లో మితిమీరిన ఆహంకారం, పెచ్చు మీరిన అవినీతి, కుటుంబ పాలన. ఆ పార్టీ ఓటమికి దారి తీశాయి. ఇవే అంశాలు వైసీపీ ప్రభుత్వ పాలనలోనూ మరింత కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం అవినీతికి కేంద్ర బిందువుగా మారింది. మద్యం, మైనింగ్, ఇసుక మాఫియాల ద్వారా రూ. వేలకోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుతున్నాయి. ఇసుక, మద్యం, గనులు, భూములు, కబ్జాలు, సెటిల్మెంట్లలో అక్రమ సంపాదనతో అధికార పార్టీలో కొందరు నేతలు వేలకోట్ల స్థాయికి ఎదిగారు. జగన్ ప్రభుత్వం అహంకారానికి నిలువెత్తు నిదర్శనంగా తయారైంది. తప్పు ఎత్తి చూపితే భరించలేరు. విపరీతమైన అణిచివేతను ప్రయోగిస్తున్నారు. ముఖ్యమంత్రి.. ఆయన చుట్టూ ఉన్న కొద్దిమంది మినహా మరెవరికీ పాలనలో ప్రమేయం లేదు. జగన్ కోటరీ మినహా మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా బొమ్మల్లా ఉండిపోతున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబం మాదిరిగా ఇక్కడ కూడా జగన్ కుటుంబసభ్యులు, ఆయన చుట్టూ ఉండే కొద్ది మందే సమస్తం నిర్దేశిస్తున్నారు. అందుకే ఇక్కడ ప్రభుత్వ వ్యతిరేకత ఇంకా బలంగా ఉందనేది అందరికీ తెలిసిన విషయమే. పేర్లు మార్పు మినహా తెలంగాణలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. కానీ ప్రజల్లో ఒకసారి వ్యతిరేకత వచ్చిన తర్వాత అవేవీ ఓటమి నుంచి కాపాడలేక పోయాయని తెలుస్తోంది. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదిన్న రేళ్లు అవుతోంది. తెలంగాణ సీఎం కేసీఆర్, ఆంధ్రా సీఎం జగన్ మధ్య సత్సంబంధాలు ఉన్నాయి. ఇద్దరూ తెలుగు రాష్ట్రాల సమస్యలపై కూర్చొని చర్చించిన దాఖలాలు లేవు. రాష్ట్ర విభజన హామీలపై కేంద్రం నిర్వహించిన సమావేశాలలోనూ రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పరిష్కారానికి చొరవ చూపలేదు. ఇంతకాలం మౌనంగా ఉండి, ఎన్నికల సమయంలో వ్యూహాత్మకంగా వివాదం సృష్టించారని రెండు రాష్ట్రాల ప్రజలు మండిపడుతున్నారు. తెలంగాణ ఎన్నికల రోజు రాజకీయ లబ్ది కోసం కేసీఆర్, జగన్ సెంటిమెంటు రగిలించేందుకు ప్రయత్నించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– సీనియర్ జర్నలిస్ట్



ఆ 41 మంది కార్మికులు ఉత్తర కాశీలోని ఆ సొరంగంలో 17 రోజులు ఉండిపోయారు. అంతా క్షేమంగా బయట పడాలని వారి కుటుంబ సభ్యులతో పాటు భారతీయులంతా ప్రార్థనలు చేశారు. మొక్కులు మొక్కారు. నిజంగానే వారంతా నిరపాయంగా బయటపడ్డారు. ఇది చంద్రయాన్, సూర్యయాన్ ప్రయోగాల కంటే తక్కువగా ప్రజలు భావించలేదు. హిమాలయాలలో చార్‌ధామ్ యాత్రికుల సౌకర్యం కోసం నిర్మిస్తున్న సిల్క్‌యారా సొరంగం కుప్పకూలడంతో కార్మికులు అందులో చిక్కుకుపోయారు. వారిని పట్టుదలతో ప్రభుత్వం రక్షించింది. ఇది భారతదేశానికి గర్వకారణంగా నిలిచింది. విదేశాలు కూడా ఈ ఆపరేషన్‌కు విస్తుపోతూ ప్రశంసలు కురిపించాయి.



# పుణ్యభూమి మీద ప్రాణ

ఏ ఒక్క ప్రాణాన్నీ ఈ ఘటనలో బలిపెట్ట కూడదన్న ప్రభుత్వ పట్టుదల, సైన్యం, ఎస్‌డిఆర్‌ఎఫ్ వంటి సంస్థల సిబ్బంది, ఆర్నాల్డ్ డిక్స్ వంటి సొరంగ నిపుణులు అంతిమంగా, బొరియలు తవ్వేవారు కలిసి చేసిన కృషి ఫలితమే ఈ విజయం. సొరంగం కుప్పకూలినప్పటి నుంచే ప్రభుత్వ పెద్దలు, అధికారులు అప్రమత్తమయ్యి, వారిని బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించడమే కాదు, అప్పటి వరకూ వారు మానసికంగా, భౌతికంగా కూడా ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన ఆహారాన్ని, మందులను పంపుతూ, తాము వారి కోసం ఎదురుచూస్తున్నామని, అక్కడే ఉన్నామనే సందేశాన్ని పదే పదే పంపుతూ వారి మానసిక స్థైర్యాన్ని నిలుపుకునేందుకు సూచనలు చేస్తూ వారు నిరాశలోకి జారిపోకుండా కాపాడుకుంటూ వచ్చారు. నవంబర్ 12వ తేదీన సొరంగ మార్గంలో ఒకవైపుగా మట్టి, శిథిలాలు పడటంతో 41మంది కార్మికులు అందులో చిక్కుకుపోయారు.

డబుల్ ఇంజన్ సర్కార్ ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నత నాయకత్వంలో ఎలా ఆలోచించి, సమన్వయంతో పని చేస్తుందో ఈ ఉదంతం రుజువు చేసింది. వాస్తవానికి గతంలో, అంటే కేదార్‌నాథ్ వద్ద జరిగిన క్లౌడ్ బరస్ట్ సమయంలో కూడా నాటి కాంగ్రెస్ సర్కారు సమర్థవంతంగా స్పందించక పోవడంతో అది భారీ జననష్టానికి దారి తీసిన విషయం అందరికీ గుర్తే. ఆ తర్వాత కూడా వారిని వారి మానాన వారు వదిలేశారు. మానవతప్పిదం వల్ల జరిగిన ఈ ఘటనను ప్రకృతి విపత్తుగా అభివర్ణిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యత తీసుకోవడం నుంచి తప్పించుకుంది. కానీ ప్రస్తుత ఘటనలో నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ అధిపతిగా మోదీ ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షించిన తీరును, ఒక్క ప్రాణం కూడా పోకుండా అందరినీ బయటకు తీసుకువచ్చే విధంగా ఆపరేషన్‌ను నడిపిన తీరును ఎవరూ వేలెత్తి చూపలేరు.

వివిధ ప్రభుత్వ సంస్థల మధ్య సహకార, సమన్వయాలు, కేంద్రం పాత్ర అన్నవే అంతర్జాతీయ మన్ననలు అందుకోవడానికి కారణమయ్యాయి. ఈ 16 నుంచి 17 రోజుల్లో చిన్న చిన్న సాంకేతిక లోటు పాట్లు, సవాళ్లతో కూడిన హిమాలయ భూభాగం, అనుకోని అత్యవసర పరిస్థితుల కారణంగాఈ ఆపరేషన్ అత్యంత క్లిష్టమైన, సవాళ్లతో కూడినది అయినప్పటికీ విజయవంతమైనది. ఈ విజయానికి ప్రమాదాలను అంచనా వేసి, ఆ లక్ష్యం పట్ల నిబద్ధత, దయ ఉం డాలి. ఇవన్నీ ప్రధాని మోదీ బృందంలో ఉండటం వల్లే ఇది సాధ్యమైంది.

జాతీయ రహదారులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌హెచ్‌ఐడిసిఎల్) కింద నవయుగ ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ (ఎన్‌ఇసిఎల్) సొరంగ నిర్మాణాన్ని చేపట్టింది. దేవభూమిగా పిలిచే ఉత్తరాఖండ్‌లో ప్రతి అంగుళం పవిత్రమైనదే. అయితే, ఎన్‌ఇసిఎల్ ఇంజినీర్ ఒకరు నిర్మాణానికి ముందు అక్కడ ఉన్న ఆలయాన్ని తొలిగించారని, అందుకే ఇలా జరిగిందని స్థానికులు విశ్వసించారు. ఆ మాటలను విన్న అంతర్జాతీయ నిపుణుడు ప్రొఫెసర్ ఆర్నాల్డ్ డిక్స్ అక్కడికక్కడ ఒక చిన్న ఆలయం వంటిదాన్ని ఏర్పాటు చేయడమే కాదు, పూజలు కూడా నిర్వహించి పనిలోకి దిగారు.

ఆపరేషన్ విజయవంతం అయిన తర్వాత ప్రొఫెసర్ ఆర్నాల్డ్ డిక్స్ తిరిగి ఆ ఆలయానికి వెళ్లి, పూజలు నిర్వహించి, కృతజ్ఞతలు చెప్పుకొని వచ్చారు. తర్వాత చెప్పిన మాటలను దేశంలోని హిందువులంతా వినడమే కాదు, అవగతం చేసుకుని, గర్వించాలి. ఇంజినీరు, సొరంగాల నిర్మాణ నిపుడు అయిన డిక్స్‌కు భారతదేశ మూలాల పట్ల ఉన్న పరిజ్ఞానం దేశంలో సగంమందికి పైగా లేదనడం అతిశయోక్తి కాదు. "నేను ఇక్కడకు వచ్చే ముందే *ఈ ప్రదేశం హిందూ ప్రజలకు అత్యంత పవిత్రమైనదని నాకు తెలుసు. అంతేకాదు, ఈ సొరంగాన్ని ఇక్కడ గల పవిత్ర ఆలయాలను యాత్రికులు సందర్శించేందుకు నిర్మిస్తున్నారని కూడా తెలుసు. ఈ మిషన్‌కు ఒక ఐతిహాసిక కోణం ఉంది... ఇది హిమాలయ పర్వతం..*" అంటూ ఆయన ఎఎన్‌ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొనడం ఆయనకు ఈ ప్రాంతం పట్ల గౌరవాన్నే కాదు, హిందువులకు భావాల పట్ల సున్నితత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

**'ఆపరేషన్ జిందగీ'**

ఘటన జరిగిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ జిందగీని చేపట్టి, వారిని బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలను ప్రారంభించింది. తొలుత 41 ఎంఎంల పైపును శిథిలాల ద్వారా పంపాలన్న వారు భావించినప్పటికీ, భద్రతా కారణాల వల్ల వారు బహుళ రక్షణ ప్రత్యామ్నా యలన్నింటినీ కలిపి ఈ ఆపరేషన్‌ను నడిపించారు. దాదాపు 8.5 మీటర్ల ఎత్తు 2 కిమీల పొడవున సొరంగంలో ఉన్న శ్రామికులకు విద్యుత్, నీటి సరఫరాలకు తక్షణ చర్యలు తీసుకున్నారు. ఓఎన్‌జిసి, సత్లజ్ జల్ విద్యుత్ నిగమ్ లిమిటెడ్



ం విలువ

(ఎస్‌జెవిఎన్‌ఎల్), రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌విఎన్‌ఎల్) , నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు కార్యాచరణ సామర్థ్యానికి అవసరమైనప్పుడు తమ సేవలను నిర్దిష్ట బాధ్యతలను అప్పగించారు. సున్నితమైన ఆ భూభాగంపై యంత్రాలు కూడా వెంట వెంటనే మొరాయించడం ప్రారంభించాయి. యంత్రాలు పని చేసే వేగమే తక్కువగా ఉండటంతో రక్షక దళాలకు దిక్కు తోచనట్టు అయింది. అయితే, థాయ్‌లాండ్‌లోని థామ్ లాంగ్‌లో 2018లో ఒక గుహలో చిక్కుకుపోయిన విద్యార్థులను కాపాడిన బృందాన్ని వారు సంప్రదించారు.

మొదటి యంత్రం విఫలం కావడంతో ఢిల్లీ నుంచి ఆగర్ అమర్చిన మరొక మెషీన్‌ను నవంబర్ 16న పంపగా, మరురోజే విచ్చుకుంటున్న శబ్దాలు వినిపించడంతో డ్రిల్లింగ్ పనిని నిలిపివేశారు. ఈ ఆపరేషన్ సందర్భంగా మూడు పైపులను డ్రిల్లింగ్ చేశారు. ఒకటి ఆక్సిజన్ పంపేందుకు, ఒకటి ఆహారాన్ని పంపేందుకు, మరొక 15 సెం.మీ. వెడల్పులో ఉన్న పైపును వేడి ఆహారాన్ని, ఎండోస్కోపిక్ కెమెరాను పంపేందుకు చేశారు. నవంబర్ 19న బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బిఆర్‌ఒ) సొరంగంపై ఉన్న చిన్న కొండ మీద 1.15 కిలోమీటర్ల రోడ్డును నిర్మించింది. శ్రామికులను కాపాడేందుకు నిలువుగా తొలచాలని ప్రణాళి కలు రూపొందిస్తుండడంతో బిఆర్‌ఒ తక్షణం స్పందించి, పని పూర్తి చేసింది.

సంపీడన వాయువుతో కూడిన 4 ఇంచీల గొట్టం ద్వారా ఒకవారం పాటు ఆహారాన్ని పంపారు. నవంబర్ 20వ తేదీన రక్షణ బృందం ఘన పదార్థాలను పంపేందుకు ఆరు ఇంచీల పెద్ద పైప్‌ను ఏర్పాటు చేసింది. అంతకుముందు పైపు ద్వారా జీడిపప్పు, బాదం తదితరాలను పంపుతుండేవారు. కొత్త పైపు ద్వారా వేడి చపాతీ, కూర, పళ్లు వంటివి పంపడం ప్రారంభించారు. తాడు కట్టిన ఒక ప్రత్యేక ట్రేలో ఈ ఆహారాన్ని పెట్టి పంపుతుండేవారు.

**చివర్లో ఆగర్ మెషీన్ ఎలా తోడ్పడింది?**

ఆగర్ బిట్ అని పిలిచే పదునైన బ్లేడు కలిగిన ఆగర్ మిషన్, లోపలికి వెళ్లే సమయంలో రంధ్రాన్ని సృష్టిస్తుంది. అది పాడయ్యే సమయానికి అది 55 మీటర్ల లోతు తొలచడాన్ని పూర్తి చేసింది. ఇదే రక్షణలో కీలకమైంది.

అమెరికాకు చెందిన ఆగర్ 600– 1200, హైపవర్ హారిజాంటల్ డ్రిల్లింగ్‌ను ఉపయోగించారు. దానిని యుఎస్ కంపెనీ అయిన అమెరికన్ ఆగర్స్ తయారు చేసింది. ఈ యంత్రాలు తొలిచేటప్పుడు బయటకు వచ్చే దుమ్ము ధూళిని ఆగరే వదిలించుకునేలా దానికి రూపకల్పన చేశారు. దీనితో తొలిచే సమయంలో వచ్చే దుమ్ము పైకి వచ్చేలా దీని డిజైన్ ఉంటుంది. ఒక మీటర్ తొలిచేందుకు ఈ యంత్రం ఒక గంట తీసుకోగా, పైపులను ఏర్పాటు చేసేందుకు నాలుగైదు గంటలు పట్టింది. సిల్క్‌యారాలో ఆరడుగుల పొడవైన 900 ఎంఎం, 800 ఎంఎం పైపులను ఆగర్ మెషీన్‌ను ఉపయోగించి జొప్పించగా, సొరంగాన్ని తయారు చేసేందుకు రెండు పైపులను అతికించారు.

తొలిచడం పూర్తి చేసిన తర్వాత శిథిలాలలో నుంచి సొరంగాన్ని సృష్టించేందుకై వెడల్పైన పైపులను తోసినట్టు అధికారులు తెలిపారు. ఇది పూర్తి అయిన తర్వాత ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం ఒకటి ఆక్సిజన్ కిట్లను ధరించి, చక్రాలు ఉన్న స్ట్రెచర్ల ద్వారా పాకుతూ తాడు, వర్కర్ల కోసం ఆక్సిజన్ కిట్లను తీసుకొని వెళ్లారు. తర్వాత వైద్యులను, పారామెడికల్ సిబ్బందినీ కూడా చక్రాల స్ట్రెచర్లపై లోపలికి పంపినప్పుడు వారు చిక్కుకుపోయిన కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. వారందరికీ, ఆ సొరంగంలాంటి పైపులో నుంచి ఎలా బయటకు రావాలనే దానిపై అందరు కార్మికులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. స్ట్రెచర్లకు రెండు వైపులా తాడు కట్టారు. ఒకరి తర్వాత ఒకరిగా వారిని బయటకు రప్పించాలని, చివరిగా ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది బయటకు రావాలనే ప్రణాళిక సిద్ధమైంది. ఈ మొత్తం ఆపరేషన్‌కు మూడు గంటలు పడుతుందని అంచనా వేశారు.


**చివర్లో బొరియలు తవ్వేవారు ఎలా తోడ్పడ్డారు?**

యంత్రాలు పదే పదే విఫలం అవుతుండడంతో అంతిమంగా సంప్రదా యంగా బొరియలు చేసేవారిని కూడా పిలిపించి ప్రయత్నం చేద్దామనుకున్న అధికారులు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బుందేల్‌ఖండ్ నుంచి బొరియలు తవ్వేవారిని పిలిపించారు. యంత్రాలకన్నా వారే మనుషుల పనే మెరుగైనదని వారు నిరూపించారు. ముగ్గురు బొరియలు తీసేవారు శిథిలాల కుప్ప దిశగా పాక్కుంటూ వెళ్ళేందుకు పైప్‌లోకి ప్రవేశించారు. ఒక వ్యక్తి తవ్వగా, రెండవ వ్యక్తి ఆ మట్టిని ట్రాలీలో పోయగా, మూడవ వ్యక్తి ఆ ట్రాలీని ఒక ఇరుసులో ఉంచుతారు, దానిని బయిటకు లాగుతారు. సగటున వారు గంటకు 0.9 మీటర్ల లోతు తవ్వగలిగారు. గంటకు ముగ్గురు చొప్పున ఈ బొరియలు తవ్వేవారిని మారుస్తూ వచ్చినట్టు అధికారులు తెలిపారు. మరు రోజు మధ్యాహ్నం 3 గంటల సమయానికి వారు 12 –13 మీటర్ల లోతుకు తవ్వగలిగారు. మొత్తం మీద యుపి, ఎంపీకి చెందిన 12 మందిని ఉపయోగించారు.

ఈ 17 రోజుల ఆపరేషన్‌లో సుమారు 652మంది ప్రభుత్వ సిబ్బంది పని చేశారు. వీరిలో 189మంది పోలీసు శాఖకు చెందినవారు కాగా, 106మంది ఆరోగ్య విభాగం, 77మంది ఇండో టిబెటన్ బార్డర్ పోలీసులు, 62మంది నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ నుంచి, 38మంది ఎస్‌డిఆర్‌ఎఫ్, 46మంది జల సంస్థాన్ ఉత్తరకాశీకి చెందిన వారు కాగా, 32మంది విద్యుత్ విభాగం, 38మంది బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్‌కు చెందిన వారు ఉన్నారు.

బాధితులు మొత్తాన్ని బయిటకు తీసుకువచ్చిన తర్వాత వారికి ఫస్ట్ ఎయిడ్ చేసేందుకు, వారి పరిస్థితిని బట్టి ఆసుపత్రులకు చేర్చేందుకు అంబులెన్స్‌ల నుంచి హెలికాప్టర్ల వరకూ ప్రభుత్వం సిద్ధంగా ఉంచింది. బయిటకు వచ్చిన ప్రతి ఒక్క బాధితుడినీ ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి, కేంద్ర హైవేల సహాయ మంత్రి జనరల్ వి.కె. సింగ్‌లు ఆలింగనం చేసుకొని, వారికి తామున్నామనే హామీ ఇచ్చారు. బయిటకు వచ్చిన వారికి తమకోసం ఇంతమంది పని చేస్తున్నారని, తాము వంటరివారం కాదనే భావన కలిగించడం ద్వారా వారు మానసిక సమస్యలలోకి జారుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

వాస్తవంగా చెప్పాలంటే విపత్తుల నిర్వహణ సామర్థ్యం అనేది అందరికీ ఉండదు. ఇటువంటి సమయాల్లో ఏది సరైనది అని కాక ఫలితాల ఆధారంగా నిర్ణయాలు జరగాలి. 41మంది జీవితాలు డోలాయమానంగా ఉన్న సమయంలో మోదీ ఫలితం కోసం పని చేశారు. మొదటి నుంచీ ప్రతి శ్రామికుని జీవితాన్ని కాపాడితీరాలన్న స్పష్టమైన లక్ష్యం ఆయనకు ఉంది. ఆయన సంకల్పం ఈ విషయంలో స్థిరంగా ఉంది. అనుకోని సంక్షోభం ఎదురైనప్పుడు ఆయన సరైన ఫలితాలనివ్వగల సరైన నిర్ణయాలు తీసుకున్నారని చెప్పడం అతిశయోక్తి కాదు. ★




**4**

# జాతి పునరుజ్జీవనానికి ఆదికావ్యం

**జా**తీయ పునరుజ్జీవనంలో ప్రముఖ పాత్ర వహించిన ఆదికావ్యం రామాయణం. వాల్మీకి విరచితమైన ఈ మహాకావ్యం భారతీయుల జీవనాన్ని అత్యధికంగా ప్రభావితం చేస్తూ 'రామ' నామం సర్వత్రా నినదించింది. 'రాముడు' భారత ప్రజల ఆరాధ్య దైవమయినాడు. ఎందరో మహానుభావులు తమ తమ ప్రతిభలను అనుసరించి ఈ మహా పురుషుని చరణాలకు భావోద్వేగపూరితమైన శ్రద్ధాంజలి ఘటించి తమ జన్మ తరించిందని భావించారు.

రాముని ఈశ్వరత్వం విషయంలో కానవచ్చిన దోషాలను దూరం చేయడానికి కూడా ఎందరో పండితులు స్వతంత్రమై, మనఃకల్పితమైన ఉపపత్తులను, నిరూపణలను చూపించారు.

రాముడు విష్ణువు అవతారమే అయితే సీతాదేవిని ఆదిశక్తి అయిన లక్ష్మీదేవి అవతారంగానే పరిగణించవలసి వస్తుంది. అట్టి స్థితిలో సీతను అసురరాజైన రావణుడు అపహరించడం, రామచంద్రుడు కింకర్తవ్య విమూఢుడై వ్యాకుల స్థితిలో అడవులలో తిరుగాడడం రాముని ఈశ్వరత్వానికి భంగం కలిగించినట్లు కనపడింది. అది అసంగతంగా కనపడింది, కనుక 'ఆధ్యాత్మ రామాయణ' కర్త మాయా సీతను సృష్టించాడు. రావణుడు సీతను అపహరించడం జరిగినప్పటి నుండి రాముడు శోకాతురుడు అయ్యేవరకు జరిగిన సంఘటనలన్నీ ఒక పూర్వ పథకం ప్రకారం జరిగినవేనని చెప్పడానికి యత్నించాడు.

ఆధ్యాత్మ రామాయణం మంత్రమయమైన గ్రంథంగా పరిగణన పొందుతూ, వాల్మీకి రామాయణానికి అతి సరసము, సంక్షిప్తము అయిన సంపుటిగా పేరొందింది. కాని సీతాదేవి వంటి పతివ్రత జీవితమంతా పతి వియోగ దుఃఖమనే అగ్నిలో దగ్ధం కావడాన్ని ఎలా సమర్థించాలో తెలియలేదు. చివరకు ఒక పురాణకారుడు హిందూ ధర్మంలోని కర్మసిద్ధాంతం ఆధారంగా ఒక సమర్థనను కనుగొన్నాడు.

అయితే సీతాదేవివంటి ఆదిశక్తికి పునర్జన్మ అసాధ్యమనే అనుమానం కలిగింది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని అతడు సీత తన బాల్యంలో బాల్యచాపల్యంతో ఒక చిలుక జంటను వేరుచేసిందనీ, అవి చనిపోయాయనీ, ఆ చిలుక శాపం వల్ల సీత వియోగ దుఃఖం అనుభవించవలసి వచ్చిందని వివరించాడు. ఈ విధంగా ప్రతి కవీ రామకథలోని దోషాలను తొలగించడానికి చేసిన ప్రయత్నాల వల్ల రామకథ వికృత రూపంలో ప్రచారితమయింది. అయినా వాల్మీకి రామాయణం గంభీరత తరుగకపోవడం గమనార్హం.

'వాల్మీకి రాముడు' భారత ప్రజల హృదయంలో ఎంతటి అక్షయమైన ప్రభావాన్ని కలిగి ఉన్నాడో ఇది స్పష్టం చేస్తోంది. కొందరు రావణునికి పదితలలు చాలవని భావించి అతనికి వంద తలలు, వేయి తలలు తమ కల్పన ద్వారా సృష్టించారు.


వస్తుతః రామాయణం వికృతి మహాభారత కాలంనుండే ఏర్పడింది. కాని మహర్షి వాల్మీకి దివ్య ప్రతిభ అనే సూర్యుడు ప్రకాశాన్ని ఇస్తున్నాడు. ఈ వికృతులు వచ్చాయి పోయాయి. వాల్మీకి 'రాముడు' ప్రజల హృదయాకాశంలో ప్రకాశిస్తూనే ఉన్నాడు.

వాల్మీకి రామాయణమనే ఈ ఐతిహాసిక కావ్యం భారతీయ సంస్కృతి సంపూర్ణ జీవనం యొక్క పరమోచ్ఛమైన ధ్యేయాన్ని దిగ్దర్శనం చేస్తోంది. ఈ విశ్వంలో భారతీయ సంస్కృతి గొప్పతనం ఈ గ్రంథం ద్వారా ప్రకటితమవుతోంది. కనుకనే భారతజాతి వతనోన్ముఖమైన ప్రతి సమయంలోనూ జాతి పునర్నిర్మాణానికి ఉపాసనా కేంద్రంగాను, సామాజిక భావనను జాగరితం చేయడానికి, సంఘటనకు కేంద్రస్థానంగాను, జీవన ధ్యేయం సుస్పష్టతను ప్రకటించేదిగాను భారతవర్షంలో జన్మించిన ద్రష్టలు రామాయణాన్నే ఉపయోగించారు.

**– బాలశాస్త్రి హరదాస్**

***'జాగృతి' 04.05.1964 సంచిక నుంచి***



# శరణాగతితో రక్షణ

**వే**దనతో అలమటిస్తూ ఒక భక్తుడు శ్రీ రమణ భగవాన్‌ను సమీపించి ' భగవాన్ అన్నిటినీ పోగొట్టుకున్నా నాకు మీరే దిక్కు' అని ఎంతో పరితపించాడు. 'పోయిందా? ఏమి భయములేదు. మీరైతే ఎవరిని నమ్ముకున్నారో వారికి శరణాగతి పొందండి. వారే మిమ్మల్ని రక్షిస్తారు' అని ఓదార్చారు. 'ఇక్కడి చేరిన అన్ని జీవులూ ముక్తిని పొందుతాయి. ఏమీ సందేహం లేదు' అని ఒక భక్తునితో అన్నారు. ఆ భక్తుడు ఆ ఒసగిన ఆత్మవిశ్వాసానికి ఎంతగానో ఆనందించి సంతృప్తి పొందాడు.

రమణ భగవాన్ మహిమతో శ్రీమతి రమణివెంకటరామన్ అనే భక్తురాలి అనుభవం ఆమె మాటల్లోనే... 'మేము పెళ్లి ఆట ఆడుతుంటే రమణులు పురోహితులై వివాహ క్రతు మంత్రాలు చదివేవారు. రమణ భగవాన్ పిల్లల్లో పిల్లవాడు. మా అక్కలిద్దరినీ మీకు ఎలాంటి భర్త కావాలి అని ప్రశ్నించారు. నా పెద్ద సోదరి నాకు ధనవంతుడైన భర్త కావాలి అని, రెండవ అక్క, పేదవాడైనా గుణవంతుడైన భర్త కావాలి తమ కోరికలు నివేదించుకున్నారు. వరమొసగినట్లు శ్రీ రమణ భగవాన్ వారి కోరికలను ఆమోదించారు.

భగవాన్ అనుగ్రహించినట్లే జరిగింది. నాకు మా వాళ్లు పెళ్లి సంబంధం నిశ్చయించి రమణ భగవాన్‌కు నివేదించగా, ఆ సంబంధం పట్ల వ్యతిరేకతను వ్యక్తీకరించారు. అయినా మా వాళ్లు నా పెళ్లి చేశారు.

# అష్టవసువుల శాపవిముక్తికి గంగ కరుణ

4




తమ ఆశ్రమంలోని ఆవును దొంగిలించ యత్నించిన అష్టవసువులను భూలోకంలో జన్మించవలసిందిగా వశిష్ఠుడు శాపం పెడతాడు. ఆ శాపం మేరకు భూలోకంలో జన్మించవలసిన ఎనిమిది మంది వసువులూ గంగాదేవిని తమ తల్లిగా ఎంచుకుంటారు. ఫలితంగా గంగామాత శాంతనునికి భార్యయై ఎనిమిది మంది వసువులకూ జన్మనిస్తుంది. అష్టమ వసువైన 'ద్యువు' గంగా శాంతనుల ఎనిమిదవ సంతానం. ఇతని పేరు దేవవ్రతుడు. తర్వాత ఇతడే భీష్ముడన్న పేరుతో ప్రసిద్ధికెక్కాడు.

ప్రతీపునికి ఇచ్చిన మాట మేరకు గంగాదేవి శాంతనునికి కన్పిస్తుంది. శాంతనుడు గంగను వివాహం చేసుకుంటాడు. ఆమె వివరాలు ఏమీ అడగకుండా ఆమె విధించే షరతులన్నింటికీ అంగీకరించి ఆమెను పెళ్లి చేసుకోవాలని ప్రతీపుడు శాంతనునికి అంతకముందే చెబుతాడు. శాంతనుడు తండ్రిమాట శిరసా వహిస్తాడు.

తాను చేసే పనులకు శాంతనుడు అభ్యంతరం చెప్పరాదని, అభ్యంతరం చెప్పన తక్షణం తాను శాంతనుని వదలిపెట్టి పోతాననీ గంగాదేవి నిబంధన విధిస్తుంది. శాంతనుడు అంగీకరిస్తాడు. గంగ శాంతనుని వల్ల కలిగిన ఏడుగురు కుమారులను పుట్టగానే నీటిలో పడేస్తుంది. శాంతనునికి ఇది దుర్భరంగా ఉం టుంది. అయినా నిబంధనకు కట్టుబడి మిన్నకుండిపోతాడు. కానీ ఎనిమిదవ బాలకుణ్ని కూడా గంగ నీటిపాలు చేయనుంకించడంతో శాంతనుడు నోరుమూసుకొని ఉండలేకపోతాడు. అభ్యంతరం చెబుతాడు. ఆ బాలుణ్ణి బతికించుకుంటాడు. ఫలితంగా గంగాదేవి శాంతనుని వదలివెళ్లిపోతుంది.

ముప్పైఆరు సంవత్సరాల పాటు ఆ ఎనిమిదవ కుమారుణ్ణి పెంచి సకల విద్యా సమర్థుణ్ణి చేసి గంగ అతన్ని శాంతనునికి అప్పగిస్తుంది. ఈ కుమారుని పేరు దేవవ్రతుడు. శాంతనుని కొడుకు కాబట్టి శాంతనవుడు, గంగ బిడ్డడు కావున గాంగేయుడు, ఆ తర్వాత భీష్మమైన (తీవ్రమైన) ప్రతిజ్ఞ చేసి భీష్ముడుగా మారాడు.

ఎనిమిది మంది వసువులు శాపం పొందిన తర్వాత వసిష్ఠున్ని ప్రార్థిస్తారు. భూలోక దుర్భర జీవనం నుండి తమకు వెంటనే విముక్తి కలిగే మార్గం తెలుసు కుంటారు. పుట్టగానే నీటిపాలై తిరిగి 'వసుత్వము' పొందాలి. కానీ ఎనిమిదవ వసువు మాత్రం ఎక్కువ కాలం భూలోకంలోనే ఉండాలని వసిష్ఠుడు నిర్దేశించాడు. ఏ మానవ వనిత కూడా ఏడుగురు బిడ్డలను పుట్టగానే నీటిపాలు చేయదు. అందువల్ల మానవ మోహాలకు లోనుగాని దేవతా స్త్రీని వారు తల్లిగా ఎంచుకున్నారు. .

మహాభారతము సంస్కృతి విజ్ఞాన కోశము. సమగ్ర దృష్టితో దీన్ని అర్థం చేసుకోవాలి. మిడిమిడి జ్ఞానంతో మహాభారతాన్ని, వేదవ్యాసుని తత్త్వాన్ని విమర్శించడం అర్థం లేనిది. మహాకవి కాళిదాసుని కాలంలో కాశీలో కొంతమంది పండితులు మహాభారతంలోని 'తప్పు'లను వెతకడానికి పూనుకున్నారట. ఇందుకోసం పండితులు సమావేశం కాగానే అక్కడికి ఒక చిలుక వచ్చి "నవ నవ" అని అరిచేదట. ఈ గోల అపశకునంగా భావించి పండితులు ఆనాటి సభను ముగించి వెళ్లిపోయేవారు. అనేక సమావేశాలు జరగడం, ప్రతిసారీ చిలుక వచ్చి 'నవ నవ'' అని పలకడం, పండితులు లేచి వెళ్లిపోవడం.. ఇలా అనేకసార్లు జరిగింది. ఒకసారి సభకు మహాకవి కాళిదాసు కూడ వెళ్ళాడు. చిలుక వచ్చి "నవ నవ" అని అరవగానే కాళిదాసు "పంచ, పంచ" అని బదులు పలికాడట. వెంటనే ఆ చిలుక మౌనంగా ఎగిరిపోయింది.

ఇదంతా అర్థం కాని పండితులకు కాళిదాసు వివరించాడు. ఆ చిలుక వేదవ్యాసుడు. "తప్పులు వెదకడానికి ముందు నవ వ్యాకరణాలు చదివినారా?" అని చిలుక రూపంలో వచ్చి వ్యాసుడు ప్రశ్నించేవాడు "నవ నవ" అని. కాళిదాసుని కాలం నాటికి నవ (తొమ్మిది) వ్యాకరణ శాస్త్రాలు లేనే లేవు. కేవలం ఐదు (పంచ) మిగిలి ఉన్నాయి. అందువల్ల కేవలం ఐదు వ్యాకరణాలు చదివినవారు తప్పులెంచితే తన గ్రంథానికి ఏమీ లోపం లేదని సంతృప్తిలో వేదవ్యాసుడు (చిలుక) వెళ్ళిపోయాడట. తొమ్మిది వ్యాకరణ శాస్త్రాలు చదివిన వారికి మహాభారతంలో తప్పులు లేనట్టు స్పష్టం కాగలదని వేద వ్యాసుని భావము.

– తెలకపల్లె విశ్వనాథశర్మ

*'జాగృతి' 07.01.2002 సంచిక నుంచి*

---



అక్కిరాజు రమాపతిరావు

నా వైవాహిక జీవితంలో సుఖం ఎంత మాత్రమూ లేదు. మా అక్క మంచి చిత్రకారిణి. కృష్ణ భగవానుడి చిత్రపటం రచించి శ్రీ రమణ భగవాన్‌కు చూపగా, మరి వేణుగానం ఎక్కడ అని భగవాన్ మా సోదరిని ప్రశ్నించారు. మా అక్కయ్య– వినపడటం లేదు అన్నది. ఇక విను మరి అన్నారు భగవాన్. ఆశ్చర్యాలలో కెల్లా ఆశ్చర్యం ఆ చిత్రపటం నుంచి మనోహరంగా వేణునాదం విన్పించింది. రెండవ అక్క మంచి సంగీత విద్వన్మణి, శ్రీ రమణ భగవాన్ దగ్గర అక్షరమణిమాల పాడి విన్పించేది రమణీయంగా, కమనీయంగా.


యువకుడొకడు శ్రీ రమణ భగవాన్‌ను అడిగి తెలుసుకోవాలని ప్రశ్నల పట్టిక తీసుకొ వచ్చాడు. తాను కోరిన ప్రశ్నకు సంబంధించిన జిజ్ఞాసను తెలిపే చీటిని భగవాన్ చేతుల్లో ఉంచాడా యువకుడు. మొదట ప్రశ్న ఏమంటే తల్లిదండ్రులకు శ్రాద్ధం ఆయన కొడుకులు పెట్టవలెనా? అని.

ఈ ప్రశ్నకు భగవాన్ నవ్వుతూ, మన మాతాపితలు కాబట్టే మనం వారికి శ్రాద్ధ కర్మ జరపాలి. ఊళ్లో వాళ్ల తల్లిదండ్రులకు మనం జరపం గదా? అన్నారు. ఆ హాలులోని వారంతా పకపక నవ్వారు భగవాన్ సమాధానానికి. ఇంతలో శ్రీ రమణ ఆశ్రమంలో గంట కొట్టారు. అతిథి అభ్యాగతులను మధ్యాహ్న భోజనానికి లేవవలసిందిగా అందరూ భోజనానికి లేచినా ఆ యువకుడు మాత్రం అక్కడి నుంచి సిగ్గుతో జారుకుని ఉంటాడు.

★

---

## వివేకానంద సూక్తిశతి



**Man stands on the Glory of his own soul the Infinite, the Eternal the Deathless, the Soul which no Instruments can pierce, which no air can dry, no fire can burn.**

**ఆత్మకున్నశక్తి నార్పలేదేగాలి**
**అగ్నిగూడ ఆత్మనంటలేదు**
**ఆత్మశక్తిముందు ఆయుధమ్ములు ఎంత?**
**వినుడి స్వామి సద్వివేక వాణి !!**



బండిరాజుల శంకర్



# ఇండియా కూటమి

ఆధునిక భారత రాజకీయాలలో ఏమాత్రం నిలకడ లేని నాయకుడు రాహుల్ గాంధీ. అందుకే కాబోలు. ఆయన సూచన మేరకు బాలసార జరిగిన 'ఇండియా' కూటమిలో కూడా మొదటి నుంచి అంతే అనిశ్చితి కనిపిస్తున్నది. ఇండియా ఏర్పడిన తరువాత కొన్ని ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ గెలిచినా, తమకు ప్రాధాన్యం లేదంటూ భాగస్వాములు అలగడం రివాజుగా మారింది. కర్ణాటక ఎన్నికల వేళ మిత్రపక్షాల నుంచి కాంగ్రెస్ అదే ఆరోపణను ఎదుర్కొన్నది. ఇప్పుడు తెలంగాణ ఎన్నికలలోను విజయం సాధించినా అదే నిష్ఠూరాలని భాగస్వాముల నుంచి ఎదుర్కొంటున్నది. చిత్రంగా తెలంగాణలో ఏర్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా అనిశ్చితి వెంటాడడం ఖాయం. మ్యాజిక్ నంబర్‌కు మించి తెలంగాణలో కాంగ్రెస్ సాధించిన స్థానాలు నాలుగంటే నాలుగు. చిత్రంగా తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల తరువాత ఇండియా కూటమి ఇంకాస్త అస్థిర పరిస్థితులలోకి వెళ్లిపోయింది. ఇక్కడ బీజేపీ గణనీయమైన విజయం సాధించింది. ఆ పరిణామాన్ని బట్టి విపక్షాల మధ్య బంధం ఇంకా గట్టిపడవలసి ఉందని అర్థమవుతుంది. కానీ వాటి మధ్య దూరం పెరుగుతోంది. టీఎంసీ నాయకురాలు మమతా బెనర్జీ, జనతాదళ్ (యు), ఆర్‌జేడీ బాహాటంగానే కాంగ్రెస్‌కు చీవాట్లు పెట్టాయి. డిసెంబర్ ఆరో తేదీన ఢిల్లీలో జరగబోయే ఇండియా కూటమి సమావేశానికి తాను హాజరు కాబోవడంలేదని ఈ వ్యాసం రాసే సమయానికి మమతా బెనర్జీ చెప్పేశారు. ఆమె ఆ మాట మీద ఉంటారో లేదో వేచి చూడాలి. ఎన్నికల సమయంలో తమకు మధ్యప్రదేశ్‌లో పోటీకి అవకాశం ఇవ్వనందుకు సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ మెటికలు విరిచిన మాట నిజం. అఖిలేశ్ గిఖిలేశ్ పక్కన పెట్టిండి అని సాక్షాత్తు మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకుడు కమలనాథ్ వ్యాఖ్యానించడం అఖిలేశ్ తీవ్రంగా పరిగణించక తప్పని పరిణామమే.

తాజాగా వెలువడిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల గురించి చర్చించడానికి డిసెంబర్ 4వ తేదీన ఢిల్లీలో సమావేశమైన కాంగ్రెస్, బీజేపీయేతర పక్షాల సమావేశం ఇండియా కూటమిలోని డొల్లతనాన్నే దేశం ముందు ప్రదర్శించింది. 2024 లోక్‌సభ ఎన్నికలలో ఇండియా కూటమి భాగస్వాముల మధ్య ఉండవలసిన సయోధ్య గురించి ఒక అంచనాకు వచ్చే ఉద్దేశంతో జరిపిన ఈ సమావేశంలో పెదవి విరుపులే ఎక్కువ వినిపించాయి. పైగా దీనికి సోనియా గాంధీ అధ్యక్షత వహించారు. భాగస్వాములందరి బాధ ఒక్కటే. కాంగ్రెస్ పార్టీది ఒంటెత్తు పోకడ. కానీ బీజేపీయేతర పక్షాల మధ్య మరింత సయోధ్య పెరగవలసిన అవసరం ఉందని ఈ సమావేశం అభిప్రాయ పడిందని దౌత్యభాషలో పార్టీల అధికార ప్రతినిధులు చెప్పడం విశేషం. ఎస్పీ, టీఎంసీ, వామపక్షాలు, ఎన్‌సీపీ వంటి పక్షాలన్నీ ఎన్నికల నుంచి పాఠాలు నేర్చుకోవాలని కోరారట. కానీ డిసెంబర్ ఆరున సమావేశం ఎలా జరుగుతుందో ఈ సమావేశంతోనే తేలింది. టీఎంసీ తాను హాజరు కావడం లేదని చెప్పేసింది. ఇంతకీ ఎన్నికల ఫలితాల గురించి సమావేశమైన ఈ పక్షాలు ఆ పని చేయకుండానే లేచి వచ్చేశాయి. శరద్ పవార్ చేసిన ప్రకటనే ఇందుకు రుజువు. మేం మళ్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమైనప్పుడు ఇంకా కూలంకషంగా చర్చిస్తామని ఆయన అన్నారు. ఇది చాలు ఇండియా కూటమి నడక ఎటు సాగుతున్నదో తెలియడానికి!

హిందీ భాషా ప్రాంతాలకు కీలకమైనవిగా చెప్పే మూడు రాష్ట్రాలలోను కూడా కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోవడం పట్ల మమతా బెనర్జీ తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ ఘోర పరాజయం అపశకునంగానే మమత పరిగణిస్తున్నారు. వెంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందంటే ఇదే. అక్కడ కాంగ్రెస్ ఓటమి అంటే అదేదో ఇండియా కూటమి ఓటమిగా చూస్తే ఏమాత్రం కుదరదని కూడా ఆమె తెగేసి చెప్పేశారు. ఎన్నికల వ్యూహాలు ఎప్పుడూ పటిష్టంగా ఉండాలే తప్ప, ఊకదంపుడు ఉపన్యాసాలతో ఓట్లు వచ్చిపడవు అని మమతా కాంగ్రెస్‌ను ఉద్దేశించి ప్రకటించారు. అయితే ఓట్లు ఎలా వచ్చి పడతాయో మమత దగ్గర తర్ఫీదు పొందితే మంచిదే. పశ్చిమ బెంగాల్ ఎన్నికలలో ఆమె ప్రదర్శించే విద్యలన్నీ కాంగ్రెస్ నేర్చుకుంటే ఫలితాలు రావచ్చు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రదర్శించినదంతా జమిందారీ పోకడ అని ఆమె పేరు పెట్టారు. ప్రతిపక్షాల ఓట్లు ఇలా చీలికలు పేలికలు అయితే ఎలా అన్నదే ఆమె ప్రశ్న. ఇక్కడ మరొక ప్రశ్న కూడా పాఠకులకు వస్తుంది. కాంగ్రెస్‌కు ఆ మాత్రం జ్ఞానం లేకపోయినా విపక్షాల ఓట్లు చీలిపోకుండా చూసే బాధ్యత మమత, అఖిలేశ్, తేజస్వీ యాదవ్ వంటి వారు ఎందుకు స్వీకరించరు? కాంగ్రెస్ జాతీయ పార్టీ. ఆ మూడింటి వలె ప్రాంతీయ పార్టీ కాదు. దానికి అన్ని రాష్ట్రాలలోను కార్యకర్తలు ఉన్నారు. కాబట్టి బీజేపీని ఓడించడమే వాటి అంతిమ ధ్యేయమైతే ఆయా ఎన్నికల పోరాటాలలో కాంగ్రెస్‌కే ఈ పార్టీలు ఎందుకు చేయూతనివ్వకూడదు? అసలు ఇదే కాంగ్రెస్ అంతరంగమై ఉండవచ్చు కూడా. అయినా ఆ మూడు ప్రాంతీయ పార్టీలు తమ రాష్ట్రాలలో ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు అక్షరాలా బిచ్చం వడేసినట్టు మూడేసి నాలుగేసి స్థానాలు కేటాయిస్తుంటాయి. కానీ ఈ పార్టీలకు ఏ మాత్రం ఉనికి లేనిచోట పోటీ చేస్తే మాత్రం తమను గుర్తుంచు కోవడం లేదని వాపోవడం ఏపాటి విజ్ఞత ఉన్నదో అర్థం కాదు. ఎన్నికల బరిలో కాంగ్రెస్ సమాజ్‌వాదీ వంటి పార్టీలకు ఎందుకు స్థానాలు కేటాయించడం లేదని ఉద్ధవ్ ఠాక్రే శివసేన కూడా ప్రశ్నించింది. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ నాయకుడు కమల్‌నాథ్ ఇండియా కూటమి నిబంధనలను ఏ మాత్రం గౌరవించడం లేదని ఉద్ధవ్ శివసేన పత్రిక సామ్నా ప్రశ్నించింది కూడా. ఈ విమర్శ రాహుల్, ప్రియాంకా వాద్రాలకు కూడా వర్తిస్తుందని మరొక చురక కూడా వేసింది. ఇలాంటి నేపథ్యంలో ఇండియా కూటమి సమావేశం విజయవంతం కావడం ఎంత వరకు సాధ్యమని ఈ శివసేన వర్గ అధికార ప్రతినిధి సంజయ్ రౌత్ ప్రశ్నించారు. మరొకపక్క ఆ పార్టీ ఎంపీ ప్రియాంక చతుర్వేది మూడు రాష్ట్రాలలో బీజేపీ ఘన విజయం తరువాత మోదీని అభినందించడం విశేషం. అసలు ప్రాంతీయ పార్టీల బలం మీద కాంగ్రెస్‌కీ, రాహుల్‌కీ నమ్మకం గౌరవం ఉన్నాయా అన్న విచికిత్సకు ఆ పార్టీలన్నీ లోనవుతున్న వాతావరణం స్పష్టంగా నెలకొని ఉన్నది.



# ఇక్కట్లు

ఒక వాస్తవం కూడా ఇక్కడ చెప్పుకోవాలి. తనకు కాస్త బలం ఉన్నచోట ఇండియా భాగస్వాములకు స్థానాలు కేటాయించడం కాంగ్రెస్‌కు కూడా ఇష్టం ఉండదన్నది అనుభవజ్ఞుల మాట.

కేరళం ముఖ్యమంత్రి, సీపీఎం నాయకుడు పినరయ్ విజయన్ కూడా ఈ ఎన్నికలలో కాంగ్రెస్ వ్యవహరించిన తీరు మీద ప్రతికూల వ్యాఖ్యలే చేశారు. కాంగ్రెస్ మరీ అత్యాశకు పోతున్నదని ఆయన అభిప్రాయపడుతున్నారు. ఈ ధోరణి వల్ల ఇండియా భాగస్వాముల మధ్య ఐక్యత సాధ్యం కావడం లేదని ఆయన అంటున్నారు. ఇక బీజేపీని ఓడించే ప్రయత్నం ఎందుకు విజయవంతం అవుతుందని కూడా అన్నారు. ఎంతైనా మార్క్సిస్టు కాబట్టి వీళ్లకి సహజంగానే జ్ఞానం ఉప్పొంగుతూ ఉంటుంది. ఆ మేరకే పినరయ్ మరొక సంగతి బయట పెట్టారు. మధ్యప్రదేశ్ ఎన్నికలలో సమాజ్‌వాదీని కలుపుకుని వెళ్లాలని దిగ్విజయ్ సింగ్ ప్రయత్నించినా, మరొక నాయకుడు కమల్‌నాథ్ ఆ ప్రయత్నానికి గండి కొట్టారని పినరయ్ చెప్పారు. పినరయ్‌కి నిజంగానే తెలంగాణ ఎన్నికల సరళి తెలిసినట్టు లేదు. ఇక్కడ సీపీఎంను సోదర సీపీఐ దూరం పెట్టింది. పాత చుట్టరికం మేరకు సీపీఐకి మాత్రం కాంగ్రెస్ ఒక్క స్థానం పడేసింది. సీపీఎం తెలంగాణలో 19 చోట్ల అభ్యర్థులను నిలిపి ఒక్కచోట కూడా ధరావతును తెచ్చుకోలేకపోయింది. కమ్యూనిస్టులు ఎన్ని మాటలైనా చెప్పవచ్చు. వాటిలోని నిజం ఫలితాల తరువాతనే తెలుస్తుంది. తెలంగాణలో అదే జరిగింది. మధ్యప్రదేశ్ ఎన్నికలలో తనతో కలసి పోటీ చేయనందుకు అసలే మంట మీద ఉన్న అఖిలేశ్ మరొక సత్యం కూడా బయట పెట్టాడు. అహంకార యుగం అంతమైందని పెద్ద ప్రకటనే చేశారాయన. మీరైనా, మేమైనా బీజేపీ వంటి పెద్ద రాజకీయ శక్తిని ఓడించాలంటే చాలా కసరత్తు అవసరమవుతుందని ఇంకా పెద్ద సంచలన వాస్తవం చెప్పారు అఖిలేశ్. సమాజ్‌వాదీ నేతకీ, సంజయ్ రౌత్ వంటి వారికి మోదీ మీద ఉన్న ఆగ్రహాన్ని అర్థం చేసుకోవచ్చు.

1989 ప్రాంతం నుంచి జాతీయ రాజకీయాలను శాసించిన ప్రాంతీయ పార్టీలు ఒక్కసారిగా 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభను కోల్పోయాయి. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర ఇందుకు ఉదాహరణ. కొన్ని చోట్ల, అంటే ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సీపీ, ఒడిశాలో బిజూ జనతాదళ్ ప్రాంతీయ పార్టీలే అయినా ఇండియా కూటమి సుదూరంగా ఉంటూ, అవసరమైనప్పుడల్లా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ఉపయోగ పడుతున్నాయి. అయినా ఇండియా వెంట దేశంలోని ప్రాంతీయ పార్టీలన్నీ నడుస్తున్నాయని ఎవరు చెబుతారు? కానీ కర్ణాటక, తెలంగాణ ఎన్నికల నుంచి గుణపాఠం నేర్చుకోవలసిన అవసరం కాంగ్రెస్ కంటే ప్రాంతీయ పార్టీలకే ఎక్కువ. ఆ రెండు రాష్ట్రాలలోను కాంగ్రెస్ పార్టీయే విజేత. ఒకచోట జాతీయ పార్టీ బీజేపీని ఓడించింది. మరొక చోట ప్రాంతీయ పార్టీని ఓడించింది.

ఇదంతా చూస్తుంటే ప్రాంతీయ పార్టీల పాత వైభవాన్ని 2024 లోక్‌సభ ఎన్నికలతో అయినా పునరుద్ధరించుకోవాలన్న ఆశ తాజా అసెంబ్లీ ఎన్నికలు వమ్ము చేశాయని, అందుకు కాంగ్రెస్ కారణమని ఆ పార్టీలు గట్టిగా నమ్ముతున్నట్టే ఉంది. తమ రాష్ట్రాలలో మాత్రం కాంగ్రెస్ వీరి దయాదాక్షిణ్యాలకు లోబడి అభ్యర్థులను నిలపాలి. ఇందులోని వాస్తవికత ఎంత? అంతో ఇంతో పునాది ఉన్న బీఎస్పీయే తెలంగాణ ఎన్నికలలో చతికిల పడింది. వందకు పైగా స్థానాలలో అభ్యర్థులను నిలిపినప్పటికీ ఒకటి రెండు చోట్ల మాత్రమే ధరావతు వచ్చింది. ఇక కాస్త పునాది కూడా లేని సమాజ్‌వాదీ, ఆర్‌జేడీ వంటి పార్టీలు ఇక్కడ పోటీ చేస్తే ఎన్ని ఓట్లు వస్తాయి? కాంగ్రెస్ మద్దతు ఇచ్చినా అవి ఎన్ని స్థానాలు కైవసం చేసుకుంటాయి? అంటే కాంగ్రెస్ గెలిపిస్తే తమ ఘనతగా అవి చెప్పుకుంటాయి. ఇంత భారం తానెందుకు మోయాలన్నదే కాంగ్రెస్ ప్రశ్నలా కనిపిస్తుంది. వారి వారి రాష్ట్రాలలో బిచ్చం పడేసినట్టు స్థానాలు పడేసే వారి భారం కాంగ్రెస్ మోయాలని చెప్పడం విచిత్రం. ఇదే కూటమి ధర్మం అంటే కూటమే నిలబడలేదు. నిజానికి ఇండియా కూటమి ఆ దిశగానే వెళుతోంది. జేడీ(యు) అధికార ప్రతినిధి సునీల్ కుమార్ పింటూ ఏమన్నారు? 2024 ఎన్నికలలో కాంగ్రెస్ బతికి బట్టకట్టాలంటే ప్రాంతీయ పార్టీలతో మరింత సయోధ్యగా ఉండాలట. ఆర్జేడీ అధికార ప్రతినిధి శక్తిసింగ్ యాదవ్ ప్రకటన మరీ విడ్డూరం. కాంగ్రెస్ నాయకత్వం ఈ ఎన్నికలలో ఇండియా కూటమి నాయకులను ప్రచారం కోసం కాంగ్రెస్ పిలిచిందా? లేదు. ఒకవేళ కాంగ్రెస్ ఆ పని చేసి ఉంటే కాంగ్రెస్ ఇంత దారుణంగా ఓడిపోయి ఉండేది కాదు అన్నారాయన. నిజంగా ఆయన ఆత్మ విశ్వాసానికి జోహార్లు. ఇదంతా చూస్తుంటే ఓడిపోయినప్పుడు ఆ ఘనత కాంగ్రెస్ సవినయంగా స్వీకరించాలని, గెలిస్తే ఆ ఫలితం మాత్రం ఇండియా కూటమికి దక్కాలని ప్రాంతీయ పార్టీలు గట్టిగా కోరుకుంటున్నట్టే ఉంది. అందుకు కాంగ్రెస్ ఎలా అంగీకరిస్తుంది? పార్టీ ఓడిపోతే స్థానిక కాంగ్రెస్ నేతలు బాధ్యత వహించడం, నెగ్గితే నెహ్రూ–గాంధీ కుటుంబానికి ఆ ఘనత చెందడం అక్కడి సంస్కృతి. ఈ సంస్కృతిని మేం కూడా అనుసరిస్తామని బీజేపీయేతర విపక్షాలు అంటే కాంగ్రెస్‌కు ఆమోదయోగ్యంగా ఉంటుందా?

**– జాగృతి డెస్క్**



కథ

# లడ్డూ పెడతా గోవిందా!

కె.ఎ. మునిసురేష్ పిళ్లై

"ఆ పదివేలల్లో నాకేం మిగల్తాది సార్.. అంతా ఎమ్మెల్యే గారికి చదివింపులే. ఆ పైన నా సంగతి తమరే గమనించుకోవాల.." అతను చాలా ప్రొఫెషనల్గా అన్నాడు.

ఒక్కొక్కడికీ పదివేలు అంటే గుండె కాస్త కలుక్కుమంది మాకు. కానీ దిగుల్లేదు. వీఐపీ బ్రేక్ దర్శనం అంటున్నాడు కదా! ఆ మాత్రం పెట్టొచ్చునేమో అని ఒక గుంజాటన. సాఫ్ట్వేర్లో ఒక పూట భోజనానికి మూడు వేలు కూడా ఖర్చు పెట్టగలిగేంత సంపాదిస్తున్నాం, రూపాయల్లో. ఇక డాలర్లలో సంపాదించడానికి యూఎస్ వీసా కోసం వెళ్లే ముందు ఓసారి పెద్దాయన ఆశీస్సులు తీసుకుందాం అని వొచ్చాం. అంత పెద్ద రిజల్ట్ ఆశిస్తున్నప్పుడు.. ఆ మాత్రం పెట్టుబడి పెద్ద ఇబ్బంది కాదు. కానీ అడగ్గానే ఇచ్చేస్తే మనకు బలిసింది అనుకుంటాడని, "అసలే ముగ్గురం ఉన్నాం. కాస్త ఇంకో మాట చెప్పు బాసూ.." అని ఒక మాట వదిలాను నేను.

"ఈ బేరాలన్నీ ఇందాకటి రోజుల్లో సార్. ఇప్పుడు టీటీడీనే ఒక రేటు లెటరు మీద సిఫారసు! అక్కడ పెట్టడానికి సిద్ధపడ్డ డబ్బుని, ఇక్కడ ఇవ్వడానికి మీకు నొప్పయితే ఎలాసార్.. అసలు శ్రీవాణి వొచ్చాక, ఎమ్మెల్యేగారు పది గట్టు దిగడం లేదు" వాడు పట్టు విడవలేదు. చివరికి ఒప్పుకున్నాం. వాడు చాలా జాగ్రత్త పరుడు. కాల్లో వివరాలేమీ చెప్పడు. నేరుగా వచ్చిన తర్వాతే ఇదంతా చెప్పాడు. ముప్ఫయివేల డబ్బు పుచ్చుకుని వెళ్లి ఓ గంటలో సిఫారసు ఉత్తరం పట్టుకొచ్చాడు. ఎమ్మెల్యేగారిది. ప్రభుత్వం వారి రాజముద్ర కూడా ఉంది.. కించిత్ గర్వంగా, బోలెడంత సిగ్గుగా! 'వీఐపీ బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయాలని' చాలా స్పష్టంగా రాసి ఉంది అందులో! దాన్ని మాకు ప్రత్యేకంగా చూపించాడు. కాకపోతే, మా ముగ్గురి పేర్లతో పాటు మరో ముగ్గురి పేర్లున్నాయి. "మీరంతా కలిసి ఒకటే బ్యాచ్ అని చెప్పాలి సార్" అన్నాడు. ఒక రెండు వేల నోటు ఇచ్చాను. అర్జంటుగా వీటిని ఖర్చు పెట్టేయాలి. మా కోరిక తీర్చడానికి బదులుగా, దేవదేవుడికి సమర్పించడానికి కూడా వాటినే కట్టలుగా పట్టుకొచ్చాం. వాటిని బ్యాంకుల్లో డిపాజిట్టు చేసి లెక్కల్లో చిక్కుకునే బదులు.. హుండీలో వేస్తే సరి! సెప్టెంబరులోగా మార్చుకోవడం ఆయనకు పెద్ద ప్రయాస కాదు!


"ఒక్కొక్కరికీ ఒక్కోటి ఇవ్వాలి సార్" అంటూ చిత్రంగా నవ్వాడు.

"మహాప్రభో.. ఇవి దాచినవి, అచ్చేసినవి కాదు" అంటూ ఇంకో రెండు అయిదొందల నోట్లు



అతడిచేతికందించి దణ్ణం పెట్టాను. "నా దాకా వచ్చాక అందరికీ బేరమాడాలని అనిపిస్తుంది సార్" అంటూ కాస్త అసంతృప్తిని వ్యక్తంచేసి, జేఈవో ఆఫీసుకు నన్ను రమ్మన్నాడు. అక్కడ ఒక ఇంటర్వ్యూ అయిన తర్వాత, నన్ను మరోచోటకు తీసుకువెళ్లి కాటేజీ ఇప్పించి.. టికెట్లు కొనడానికని మరో పదిహేనొందలు తీసుకుని.. "ఇక మీరు ఎంజాయ్ చేయండి సార్, రాత్రి తొమ్మిదిలోగా టికెట్లు తెచ్చి చేతిలో పెడతా" అని సెలవు పుచ్చుకున్నాడు.

నా ఐఐటీ బుర్ర యమవేగంగా లెక్కలు కట్టింది. రోజుకు ఆరువేలు.. నెలకు లక్షా ఎనభై, అథమపక్షం లక్షన్నర! అదే ఎమ్మెల్యే గారికైతే అథమపక్షం నెలకు పదిహేను లక్షలు. కాస్త నిజమైన, దబ్బుపుట్టని సిఫారసులు కూడా ఉండగలవని అనుకున్నప్పటికీ.. ఏడాది తిరిగేసరికి ఎంతలేదన్నా కోటిన్నర.





అయిదేళ్లకు కనీసం ఏడున్నర కోట్లు. 'పర్లేదు.. ఎన్నికల ఖర్చుకి సరిపడా దేవదేవుడే దయపెట్టే స్తున్నాడు' అనిపించింది నాకు! అందరినీ ఒకే గాటన కట్టేయలేం. దేవుడి పేరుమీద వంచనా, సంపాదనా వద్దనుకునేవాళ్లు కొందరుంటారు. కానీ.. ఇది సాక్షాత్తూ దేవుడు అనుగ్రహించిన అవకాశమే అని.. వెంకన్న అనుమతి, అనుగ్రహం లేకుండా ఎర్రని ఏగానీ కూడా చేయిమారదని.. ఆత్మవంచన చేసుకునే వాళ్లు, దండుకునే వాళ్లు కూడా ఉంటారు.

* * *

లెటరు మీద చూసి వీఐపీ బ్రేక్ దర్శనం అంటే.. వీఐపీలు మాత్రమే ఉంటారని అనుకోవడం ఒక భ్రమ. వీఐపీలు వేరేగా ఉంటారు. వారి భృత్యులు, ప్రాపకం పొందగలిగిన వారు, వారి దళారీల ద్వారా కొనగలిగినవారు మాత్రమే ఆ వేళకు దర్శనం క్యూలైన్లలో ఉంటారు. ఎమ్మెల్యేగారి సిఫారసు ఉత్తరం మీద మన ఛాతీని ఉప్పొంగించేలాగా 'వీఐపీ' అనే పదం చూసుకుని మురిసిపోయాం. కానీ టికెటు మీద 'బిగినింగ్ బ్రేక్' అని ఉంది. సర్వదర్శనం ఒత్తిడిని స్మరణకు తెచ్చేలాగా వేలాదిగా జనం తొడతొక్కిడిగానే ప్రవహిస్తుండే క్యూలైనులోకి ప్రవేశించిన తర్వాత.. ఆ తేడా తెలిసొస్తుంది. పక్కన పక్కన తిరునామాలు వేయించుకుని ఉన్న అరవ కన్నడాది భక్తులను అనుమానాస్పదంగా పరామర్శిం

వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీలో విశిష్ట బహుమతి పొందిన రచన

చిన తర్వాత వారందరూ వీఐపీ హోదాను కొన్నవారే నని తెలిసొచ్చింది. కాపోతే వారు వెచ్చించిన ధర తెలిసి గుండె కలుక్కుమంది. వారి సిఫారసు బోర్డు మెంబరుదట. టికెటు ఒక్కింటికి అయిదువేలే పడిందిట. 'ఆహా మాకు దొరికిన వాడు ఎంచక్కని ఊర్ధ్వపుండ్రాలతో ఎంత చక్కగా శఠగోపం పెట్టాడో కదా' అనిపించింది. వెల్ల వేశాక, వెలయాలికి సెలవు చేశాక.. వెనక్కు తీయడం తరమేనా? ఆ వరుసలోనే వీడు కూడా. సర్లే.. ఎంతైనా దేవదేవుడి కొరకే కద! సమాధానపడింది మనసు.

ముగ్గురం వచ్చాం, మిత్రులం! సుశాంత్, సుమంత్, నేను. సాఫ్ట్వేర్ ఇంజినీర్లుగా గతంలో ఒకే ఆఫీసులో చేసేవాళ్లం. నిజానికి ఆ ఇద్దరి కంటె నేను చాలా పెద్దవాడిని. కానీ, అమెరికా వెళ్లగల రెక్కలు తొడుక్కోవాలనే కోర్కె.. మాకు మైత్రీసూత్రం అయింది. మొత్తానికి ఇప్పుడు ఆ కోర్కెలు ఫలించే రోజులొచ్చాయి. ఒకసారి పెద్దాయన దగ్గరకెళ్లి మొక్కి, ముడుపు చెల్లించి, డీల్ కుదుర్చుకుని అభయ ముద్రాంకితులమైతే.. ఆ తర్వాత వీసా అనే ముద్రకు ఇబ్బంది ఉండదని ఒక ఆశ. కైంకర్యానికి కట్టలుగానే సొమ్ములు తెచ్చాం. మాలో ఇద్దరికి పెళ్లయింది గానీ కుటుంబాలతో రాలేదు. సకుటుంబంగా అమెరికాకు వెళ్లడమూ లేదు. ముందు అక్కడ డాలర్ల సేద్యం దిగుబడులు తీసిన తర్వాత గానీ.. తీసుకెళ్లే ఆలోచన లేదు. కర్ణాకర్ణిగా ఇక్కడి సిఫారసుల ధరవరల దోపిడీ తెలిసిన తర్వాత.. కుటుంబం సహా రావడానికి సాహసం చిక్కలేదు. వీసా పర్వం అయ్యాక మూడొందల టికెట్లతో దర్శించుకోవచ్చునని, ఇప్పుడు కార్యార్థులం గనుక.. మేం ముగ్గురం మాత్రమే వొచ్చాం. నా పక్కనున్న కన్నడోడికి దొరికిన ధరకే నాకు టికెట్ దొరికి ఉంటే శ్రీమతిని కూడా తీసుకొచ్చి ఉండేవాడిని. ఇంతకూ ఇప్పుడేం చేస్తోందో.. నా అందమైన శ్రీమతి? ఈ పాటికి నిద్ర లేచిందో లేదో?

క్యూలైను ఆగి ఆగి నెమ్మదిగా కదులుతోంది. సుమంత్ బుర్రలో కూడా ఇంతసేపు ఈ లెక్కలే తిరుగుతున్నట్టుంది. 'ఇలా రోజూ వేలకు వేలు దండి ఏం చేస్తాడు వీడు?' అన్నాడు కసిగా, గుసగుసగా! సుశాంత్ అందుకుని 'సినిమా ప్రొడ్యూసర్లకు అయిదార్రూపాయల వడ్డీకి ఫైనాన్స్ కూడా వీళ్లే చేస్తుంటారు తెలుసా?' అన్నాడు గంభీరంగా, అదే గుసగుసతో. 'ఆర్రూపాయలా.. మనం రెండు రూపాయల ధర్మవడ్డీకి ఇస్తోంటేనే, ఫ్రెండ్స్ చుక్కలు చూపిస్తున్నారు' అక్కసు కక్కేశాడు సుమంత్. ఈలోగా ఓ పొలికేకలా వినిపించింది.. ఆ సమయానికి లైనుతోపాటు ఆగి ఉన్న మాకు ముందువైపు నుంచి సుమారు పదీ ఇరవై అడుగుల దూరంలోంచి.


"అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా గో..వింద" పదుల సంఖ్యలో స్వరాలు వంత పాడాయి.. 'గో..వింద'! స్వరాన్ని అనుసరించి అటుకేసి చూపు సారించాను. నడివయసు దాటిన ప్రౌఢ, యాభై దాకా ఉండొచ్చు. తిరునామమే.. పుల్లతో కాదు, వేలితో వెడల్పుగా పెట్టుకుని ఉంది. దాని పాదం దగ్గర చందనపు బొట్టు. కళ్లకు చిక్కటి కాటుక, ముదురు కెంజాయ రంగు నేత చీర కట్టుకుంది. మెడలో పెద్దపెద్ద నవరత్నాలతో కూర్చిన దండ, దానికి వేళ్లాడుతున్న వెంకన్న! పొట్టిపొట్టి రింగులతో ఉన్న జుత్తును విరబోసుకుంది. భుజాల అంచుల దాకా విస్తరించిన నల్లటి ఆ కేశధామంలో కొలువుతీరిన ముగ్ధలాగా.. నిమ్మపండు వర్ణంలో ఉందామె మొహం. రంగులద్దిన పెదవులు బిగ్గరగా అరుస్తున్నాయి. మోర ఎత్తినప్పుడు కంఠనాళాలు భీతిగొలిపేంతగా ఉబ్బుతున్నాయి.

"ఆర్తత్రాణ పరాయణా.. అనాథ రక్షకా.. దీనబాంధవా.. ఆపద మొక్కుల వాడా.. ఏడుకొండల వాడా.. గోవిందా.. గో..వింద" మరింత బిగ్గరగా అరచింది. ఈసారి మరిన్ని స్వరాలు జతకలిసి 'గో..వింద' అన్నాయి. మా పెదవులు కూడా కదిలాయి. క్యూలైను పొడవునా గుసగుసలుగా, కోలాహలంగా, రణగొణగా ఉన్న సద్దు కాస్త శాంతించింది. ఆమె చుట్టూ ఉన్న జనంలో బడి ఈడు పిల్లలు ఓ పదిమంది దాకా ఉన్నారు. వారినుద్దేశించి.. ఒకడి భుజం తడుతూ "ఏయ్ పిల్లలూ సైలెంటుగా ఉన్నారే.. నాతో పాటు అనండి.. వేంకటరమణా గోవిందా గో..వింద". వాళ్లందరూ అరిచారు. "అబ్బే లాభం లేదు. పిల్లలై ఉండీ ఇంత నీరసంగానా. నేను భయపడేంత గట్టిగా అరవాలి.. స్వామి దర్శనం కాగానే మీకందరికీ తలా ఒక లడ్డూ పెట్టిస్తా.. అనండి.. శ్రీనివాసా గోవిందా గో..వింద". పిల్లలు తుళ్లుతూ, ఆమె తీసిన రాగాన్ని అవకరంగా అనుకరిస్తూ ఇంకాస్త బిగ్గరగా అరిచారు. ఆమె మళ్లీ వారిని రెట్టించలేదు. కానీ చేతులు రెండూ పైకెత్తి జోడించి.. కళ్లు మూసుకుని, పెద్దగా 'గోవిందా గో..వింద' అంది. ఆమె చేతుల భంగిమ, తరంగంలా అటు ఇటు కదులుతున్న తీరు చూసి, పాట అందుకుంటుం దనిపించింది గానీ, చేతులు ఆ ముద్రలోనే ఉంచి, నిశ్శబ్దం అయిపోయింది.

రెండు నిమిషాలు వేచి చూశాడేమో.. నా వెనుకనుంచి ఎవడో "గొంతులో తడారిపోయింది" అని కిసుక్కున నవ్వాడు. మాకు ముందుగా కొంతదూరంలో ఉన్న ఆమెకు ఆ మాటలు వినిపించే అవకాశం లేదు. మరికొన్ని నవ్వులు చిలికాయి.

ఇంకో రెండు మూడు నిమిషాలు గడిచేలోగా.. మళ్లీ గలగలలుగా, గుసగుసలుగా, ఇంకా జోరందు కోని వర్షానికి ఆగిఆగిపడుతున్న చినుకుల రొదలాగా మాటలు మొదలైపోతున్నాయి. ఎవరో వినిపించీ వినిపించనట్టుగా వేంకటేశ్వర సుప్రభాతమూ, స్తోత్రాలు చదువుకుంటున్నారు. ఒకావిడ పెట్టుకున్న చెవిజూకాలను 'ఎక్కడ కొన్నారక్కా' అని పక్కనే ఉన్న ఓ కాలేజీ అమ్మాయి అడుగుతోంది. ఇంకో కుర్రాడు.. ఒక పడుచు మహిళ వస్త్రధారణతో దాచలేక పోయిన దేహభాగాలన్నింటినీ తదేక దీక్షతో చూస్తున్నాడు. ఇంతలో ఆమెకు సమీపంలో ఓ చంటిబిడ్డ కేర్మని తారస్థాయిలో అందుకున్నాడు. అమ్మ సముదాయిస్తోంది.

"లడ్డూ పెడతా గోవిందా.." అని ఆమె పెద్ద పొలికేకతో మళ్లీ అందుకుంది. ఆ అదుటుకు పసివాడు ఏడుపు కూడా ఆపేశాడు. ఆ పసిబిడ్డ బుగ్గలు పుణుకుతూ "నీకు లడ్డూ పెడతా గోవిందా" అంది, వాడికే పెట్టేటట్టు. 'నీకు దద్దోజనం పెడతా గోవిందా', 'నీకు చక్కెర పొంగలి పెడతా గోవిందా' ఇక ఆమె అరుపులు రకరకాల విన్యాసాలు దిద్దుకుంటున్నాయి. స్వామివారి నిత్య కైంకర్యాలను తన కేకల్లో నివేదించేస్తోంది. క్యూలో ఉన్న భక్తుల్ని



మొత్తం ఆమె తన కబ్జాలోకి తీసుకుంది. తన కేకలకు వంతగా క్యూలో ఉన్న భక్తులు అరవకపోతే.. చేతిసైగలతో సూచిస్తోంది. మొత్తానికి క్యూలైను మొత్తం ఆర్తత్రాణ పరాయణుడిని నివేదించుకునే నినాదాలే అయిపోయాయి.

మహాద్వారం దాటాక కాస్త నెమ్మదించిందామె. రంగనాయక మండపం, ధ్వజస్తంభం, వెండివాకిలి దాటుతుండగా.. పూర్తిగా నిశ్శబ్దం అయిపోయింది. ఏదో తన్మయత్వంలో చేతులు జోడించుకుని పెదవులు మాత్రం కదుపుతూ అలౌకికంగా ఉంది. ఇంచుమించుగా మేమందరం కూడా! వీఐపీ బ్రేక్ దర్శనం గనుక బంగారువాకిలి, జయవిజయుల్ని దాటనిచ్చి వేంకటేశ్వరుణ్ని కాస్త దగ్గరినుంచి చూడనిస్తున్నారు. ఇంకా మేం స్వామిని సమీపించ లేదు.

‘కనకరత్న కవాట కాంతు లిరుగడగంటి, ఘనమైన దీపసంఘములు గంటి, అనుపమ మణీమయమ్మగు కిరీటము గంటి, కనకాంబరము గంటి..’ ఎంత సొగసుగా చెప్పాడు అన్నమయ్య. క్యూలోనే ఉన్నప్పటికీ బంగారు వాకిలి నుంచే కనిపిస్తున్నాడు వజ్రకిరీటధారిగా దివ్య సమ్మోహనాకారుడైన స్వామి. జోడించిన చేతులు విడువకుండా, ఆ లిప్తపాటులో ఆ భాగ్యం కోల్పోతామనే భయంతో, రెప్ప వాల్చకుండా స్వామి చెంతకు అడుగులు వేస్తున్నాం. ‘అరుదైన శంఖ చక్రాదులిరుగడ గంటి, సరిలేని యభయ హస్తము గంటి, తిరువేంకటాచలాధిపుని జూడగ గంటి, హరి గంటి గురు గంటి..’ గురువు కూడా ఆయనేనా.. పునీతం అయిపోతున్న భావన.

స్వామి దర్శనం పూర్తయింది. అయ్యకు అన్నం పెట్టిన వకుళమ్మను కూడా చూసుకుని, ఆ ప్రాంగణంలో వేదపారాయణ మండపాల వద్ద కూచున్నాం. స్వామిని చూస్తుండగా.. కమ్మిన మైకంలో అసలు సంగతి మర్చిపోయాను. వీసా అప్లికేషన్ ఆయనకు నివేదించడం.

“మనం వచ్చిందే అందుకు కదా.. అది మర్చిపోతే ఎలా.. నేను క్యూ మొత్తం అదొక్కమాటే చెప్పాను దేవుడికి” అన్నాడు సుశాంత్. “చెప్పకపోతే పెద్దాయనకు తెలీదా?” అన్నాను. వాడు బాధించాలని చూశాడు. నేను దబాయించి బయటపడ్డాను.

* * *

ఆ రాత్రి ఓ రెస్టారెంటులో ఉన్నాం. ఉదయం దర్శనం తర్వాత టిఫినూ, శిలాతోరణం దాకా వెళ్లివచ్చాక మధ్యాహ్నం భోజనమూ. తరిగొండ వెంగమాంబ ఏ భిక్ష పెడితే అదే తినితీరాలన్న నా పట్టుదల మీద అన్నదాన కాంప్లెక్సులో కానిచ్చాం. ఇప్పుడిలా రెస్టారెంటులో.

కబుర్లు చెప్పుకుంటూండగా.. పక్క టేబుల్ మీద ఆమె కనిపించింది. క్యూలైన్లో కుదురుగా నిల్చోకుండా దేవుడికి లడ్డూలు, చిత్రాన్నం, దద్దోజనం, చక్కెర

“లడ్డూ పెడతా గోవిందా..” అని ఆమె పెద్ద పొలికేకతో మళ్లీ అందుకుంది. ఆ అదుటుకు పసివాడు ఏడుపు కూడా ఆపేశాడు. ఆ పసిబిడ్డ బుగ్గలు పుణుకుతూ “నీకు లడ్డూ పెడతా గోవిందా” అంది, వాడికే పెట్టేటట్టు. ‘నీకు దద్దోజనం పెడతా గోవిందా’, ‘నీకు చక్కెర పొంగలి పెడతా గోవిందా’ ఇక ఆమె అరుపులు రకరకాల విన్యాసాలు దిద్దుకుంటున్నాయి. స్వామివారి నిత్య కైంకర్యాలను తన కేకల్లో నివేదించేస్తోంది. క్యూలో ఉన్న భక్తుల్ని మొత్తం ఆమె తన కబ్జాలోకి తీసుకుంది.



పొంగలీ ఆఫర్లు పెట్టిన ఆవిడ. మా వాళ్లిద్దరికీ సైగ చేసి చూపించాను. “నీకు లడ్డూ పెడతా గోవిందా..” ఆవిడ రాగాన్ని అనుకరిస్తూ సుశాంత్ ఓ పిల్లికూతలా కూశాడు, ఆవిడకు వినిపించే లాగానే. తలతిప్పి మా వైపు చూసింది. ఓ క్షణం మేం జంకిన మాట నిజం. అసలే ఆర్భాటం మనిషి, తగాదా పెట్టుకుంటుందేమో అని! లేచి, చిన్న చిరునవ్వుతూ వచ్చి మా టేబుల్ వద్ద ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చుంది. “ఉదయం వీఐపీ బ్రేక్‌లో మీరూ ఉన్నారా నాయనా” అంది! అవు నన్నాం తలఊపుతూ. “స్వామి దర్శనానికి వెళ్లడం చాలా సరదాగా గడిచింది కదా” అంది. నోటితోనే అవునన్నాం, సుశాంత్ పిల్లికూత వలన ఏర్పడ్డ బెరుకు పోయింది. క్యూలైను ముచ్చట్లూ, ఇదివరకు తాను దర్శనానికి వచ్చినప్పటి అనుభవాలూ చెప్పడం మొదలెట్టింది. వయసు చాలా తేడా ఉంది గానీ.. సరదాగా మాతో కలిసిపోయింది. బేరర్ రాగానే అందరం మాకు కావాల్సినవి ఆర్డర్ చేశాం. కాస్త గ్యాప్ వచ్చింది.

“ఉదయం మీరు భలే కామెడీ చేశారండీ” అనేశాడు సుమంత్.

మంచినీళ్లు తాగుతున్నదల్లా గ్లాసు టేబుల్ మీద పెట్టి ‘‘అలా అనిపించిందా..’’ అంది కళ్లు మూసుకుని. ఆ మాటకు చిన్నబుచ్చుకున్నదేమో అనిపించింది నాకు. కొన్ని క్షణాలకు కళ్లు తెరచి, అర్థంతరంగా అడిగింది –


“దేవుడు ఉన్నాడా నాయనా”

‘‘అదేంటండీ అంత మాటనేశారు. పైగా ఉదయం అంతలేసి పొలికేకలు పెట్టారు కూడా..” సుమంత్ అక్కసుగా అన్నాడు.

“అబ్బే అస్సల్లేదని కాదు. ఇక్కడే ఉంటాడా.. మీ యింట్లో ఉండడా అని..” ఆవిడ మమ్మల్ని తర్కంలోకి లాగుతున్నట్టు పజిలల్గా అడిగింది, వ్యక్తావ్యక్తంగా ఒక అసహజపు నవ్వు పులుముకుని.

“ఇంట్లో కూడా ఉంటాడు గానీ, కనిపించదు కదా. కనిపిస్తే తప్ప మన అప్పీళ్లు పెట్టుకోలేం కద” అన్నాడు సుమంత్. సుశాంత్ ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఒక నిమిషం పాజ్ తీసుకుని తను అన్నాడు.

“మేడం! దేవుడు సర్వాంతర్యామి. కానీ ఈ తిరుమల ఆ దేవదేవుడు కొలువుదీరిన స్వక్షేత్రం. ఆనంద నిలయాంతరంగుడై ఉన్నాడే ఆ స్వామి, ఆ మూలవిరాట్టే మన చర్మచక్షువులకు గోచరించే



జగద్రక్షకుడు'' ఈ నిమిషం పాటు ఈ మాటల్ని వాడి బుర్రలో వండుతున్నాడన్నమాట. అయినా వాడిలో ఇంత ఉన్నదని నేను అనుకోలేదు.

"కదా.." అన్నదామె గొంతు సవరించుకుంటూ. ఆ టోన్ గమనిస్తే.. వార్మప్ పూర్తిచేసి, ఇక జూలు విదిల్చి బ్యాటింగ్ చేయడానికి సిద్ధపడుతున్నట్టుగా ఉంది. "ఇక్కడే ఉన్నాడనే నమ్మకంతోనే కదా వచ్చాం. ఆ క్యూలైన్లో చూశావా.. ఇంకో అరగంటలో స్వామి దగ్గరకు వెళ్తామని, తరిస్తామని వాళ్లందరికీ తెలుసు. కానీ వాడి గురించిన చింతనలో ఎంతమంది ఉన్నారక్కడ? రియలెస్టేటు, షేరు మార్కెటు, వడ్డీ లెక్కలు, వ్యాపారంలో లాభాలు, పక్కింటోళ్ల ఆస్తులు ఇవే కదా వారు మాటాడుకుంటున్నది! ఏ ఆడది ఎంత సెక్సీగా ఉన్నది, ఎవడు ధరించిన వాచీ ఎంత కాస్ట్లీగా ఉన్నది, ఎవరు ధరించిన నగలు ఎంత మోడర్నా ఉన్నాయి ఇవే కదా వారు చూస్తున్నది!" ఆమె ఆపింది. క్యూలైన్లో మా మధ్య నడిచిన, మా చెవిన పడిన మాటలూ, గమనించిన వ్యవహారాలూ అన్నీ గుర్తుకొస్తున్నాయి.

"నేనలా చెవికోసిన మేకలాగా అరుస్తున్న ప్పుడు...?" అప్పుడు ఏం జరిగిందో చెప్పమన్నట్టుగా ప్రశ్నను సంధించింది, తను ఆర్డరు చేసిన లస్సీ అందుకుంటూ.

అవున్నిజమే. ఆమె పొలికేకలకు జనం సైలెంట్ అయిపోతున్నారు. కొందరు వంత పాడుతూ గోవిందారావాలు చేస్తున్నారు. మొత్తానికి అందరి దృష్టిని– ఆమె తన వైపుకు, తన దైవనామస్మరణవైపు బలవంతంగా తిప్పేసుకుంటోంది. వశీకరణ మంత్రం వేస్తున్నట్టుగా..!

"అవున్నాయనా! ఇక్కడ దేవుడున్నాడని మనం నమ్ముతాం. నానా పాట్లు పడి, నానా పైరవీలు చేసుకుని, బోలెడన్ని డబ్బులు తగలేసి వస్తాం. తిరుమలంటేనే దేవుడి పాదాల సన్నిధి. ఇక్కడ అడుగుపెట్టిన క్షణం నుంచీ, దేవుడి ఆలోచనలో ఉండలేమా? పోనీ అంతటి ఏకమనస్కులం మనం కాదనుకో, కనీసం యింకో అరగంటలో దేవుడిని చూడబోతున్నాం అనే సమయంలోనైనా నీచమైన ఐహికమైన ఆలోచనలకు దూరంగా ఉండలేమా? బుద్ధిని కుదురుగా ఉంచలేమా? దేవుడు అక్కడ ఆ పెద్ద రాతిబొమ్మలో ఉంటాడో లేదో తర్వాత.. ఉంటాడని మనం నమ్మి చూడబోతున్నాం కదా.. మనసునీ, బుద్ధినీ, ఆలోచననీ, చైతన్యాన్నీ సశరీరంగా ఆయన మీద లగ్నం చేయలేమా? అందరికీ అలా కుదరడం లేదు నాయినా! అందుకే, నేను క్యూలో ఉన్న ప్రతిసారీ నా పొలికేకల్తో గావుకేకల్తో మీరు చెప్పే కామెడీతో అందరి ఆలోచనల్నీ హైజాక్ చేసే పనిలో పడతా.. అంతకు మించి పరమార్థం ఏమీ లేదు" చిరునవ్వు నవ్వుతూ ఆపింది.

ఏం చెప్పగలం ఆమెతో. అంత అసహ్యంగా ప్రవర్తించిన తర్వాత. అంతలా సుతిమెత్తగా, చిరునవ్వుతో మా తలంటిన తర్వాత! మేం ఆర్డర్ చేసినవి ఇంకా రాలేదు. ఆమె గ్లాసులోని లస్సీ అయిపోయింది. హోటలు కుర్రాడిచేతిలో డబ్బులు పెట్టేసి, లేచి నిల్చుంది. మేం షాక్లో ఉన్నాం. సిగ్గుతో, అవమానంతో కూడిన షాక్ అది! నేను ముందుగా తేరుకుని,

"అమ్మా మీరు.." వెళ్లబోతున్న ఆమె గురించి తెలుసుకోవాలన్నట్టుగా అర్థోక్తిలో ఆపాను. ఆగి, నా వైపు చూసింది. "దిగువ తిరపతి పక్కనే ఒక్కదాన్నీ ఉంటాను నాయినా.. ఉద్యోగధర్మం! మా ఆయన ఇంకోచోట ఉంటాడు. ఆయన మహా బిజీ. అస్సలు ఖాళీ దొరకదు. నేనే అప్పుడప్పుడూ వెళ్లి కలిసి వస్తుంటాను."

"ఏం అనుకోకపోతే మీ మొబైల్ నెంబరు.."

"వాడకం అలవాటు కాలేదు నాయినా! జాబు రాస్తివంటే తప్పకుండా అందుతుంది. మనసుపెట్టి తలిస్తివా, యింకా తప్పకుండా తెలస్తంది. గెమనంలో పెట్టుకో.. ఊరు– తిరుచానూరు. పేరు పద్మావతి!"

మొబైల్ నోట్ ప్యాడ్ లో గబగబా అడ్రసు టైపు చేసుకుంటూ, ఏదో స్ఫురించి నేను తలెత్తేలోగా, ఆమె అదృశ్యమైపోయింది.

'హరి గంటి.. గురు గంటి..' ఆయన మాట ఏదైనా, నా అనుభవం వేరు– 'సిరి గంటి.. గురు గంటి..'!!

వచ్చేవారం కథ... అయమేవ విద్యుతే

– చాగంటి ప్రసాద్

# ఓనమ్‌ను హమాస్‌కు అంకితం చేశారు



సబర్మతీ ప్రాంగణంలో సంప్రదాయ బద్ధంగా..

దేశంలోని కొన్ని విశ్వవిద్యాలయాలలో ఉన్న వామపక్ష విద్యార్థి సంఘాలు ముస్లిం ఉగ్రవాదులకు సంఘీభావం చెబుతూ ఉంటాయి. పార్లమెంట్ మీద దాడి కేసుతో అఫ్జల్ గురుకు మరణశిక్ష విధించినా అవి సహించలేవు. అందులో మొదటిది జవాహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యు). హమాస్‌ను సమర్థిస్తూ తాజాగా జేఎన్‌యు విద్యార్థులు కొందరు తమ దేశ వ్యతిరేక విధానాన్నే ప్రదర్శించారు. ప్రపంచంతో పాటు భారత్ హమాస్ హింసాకాండను ఖండించాయి. అక్కడ ఆపితే వాళ్లు జేఎన్‌యు విద్యార్థులు ఎందుకవుతారు? ఈ సంవత్సరం అక్కడ జరిపిన ఓనమ్ పండుగను హమాస్ ఉగ్రవాదులకు ఆ విద్యార్థులు అంకితం చేశారు. కేరళ వారి ఈ ఉగాది పండుగను ఇటీవలనే అక్కడి వామపక్ష విద్యార్థి సంఘాలు హమాస్ ఉగ్రవాదులకు సంఘీభావంగా నిర్వహించాయి. ఓనమ్ సందర్భంగా పూజించే దేవుడు మహబలిని పాలస్తీనా పతాకంతో అలంకరించి అపవిత్రం చేశారు. ఇంతలోనే కొందరు వామపక్ష విద్యార్థులు అది మహబలి ప్రతిమ కాదని బొంకడం ఆరంభించి నష్ట నివారణ చర్యలు చేపట్టారు. అయితే ఆ బొమ్మ ఎవరిదో మాత్రం వెల్లడించలేదు. మహబలి అంటే విష్ణువు అవతారం. ఇంతకీ ఇదంతా త్వరలో జరిగే ప్రవేశాల ద్వారా వచ్చే ఒక వర్గం విద్యార్థులను ఆకర్షించడానికేనని తేలింది.

నిజానికి ఓనమ్ పండుగను ఈ రీతిలో జరపాలని వామపక్ష సంఘాలు నిర్ణయించాయని తెలిసి చాలామంది విద్యార్థులు నిరసన తెలియచేశారు. ఇచ్చిన అనుమతిని కూడా విశ్వవిద్యాలయ అధికారులు రద్దు చేశారు. వెంటనే పాత విమర్శలు వచ్చాయి. ఇదంతా సంఘ్ అజెండా అంటూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఎదురుదాడికి దిగాయి. పనిలో పనిగా దక్షిణ భారతదేశం మీద వివక్ష అని కూడా జోడించాయి. ఆఖరికి అనధికారికంగా ఈ ఉత్సవం జరిపారు. అయితే అంతా మూర్ఖులే ఉండరు. వామపక్షాలకు లొంగిపోరు. ఏటా ఈ ఉత్సవానికి 700 మంది కేరళ ప్రాంత విద్యార్థులు హాజరైతే, ఈ ఏడాది మాత్రం 150 మంది వెళ్లారు. మిగిలినవారు సబర్మతి విద్యార్థి వసతిగృహం ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా ఓనమ్ నిర్వహించారు.

జేఎన్‌యూ






మేధో క్రీడ చదరంగంలో భారత క్రీడాకారుల అరుదైన రికార్డుల పరంపర అప్రతిహతంగా కొనసాగుతోంది. నవతరం క్రీడాకారులు ప్రజ్ఞానంద్, వైశాలీల జోడీ ఓ అరుదైన ఘనతను సొంతం చేసుకొన్నారు. గ్రాండ్ మాస్టర్ హోదా సాధించిన సోదర సోదరీమణిగా నిలిచారు...

# భారత చదరంగంలో నవతరంగం!

భారత ఇతిహాస క్రీడ చదరంగాన్ని నేటి ఆధునిక తరం క్రీడాకారులు సైతం కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. తమ అసాధారణ ప్రతిభతో భారత ఖ్యాతిని పలు విధాలుగా విశ్వవ్యాప్తం చేస్తున్నారు.

భారత తొలి గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ పరంపరను ఆ తర్వాతి తరాల క్రీడాకారులు సైతం విజయవంతంగా కొనసాగించగలుగుతున్నారు.

**84వ గ్రాండ్ మాస్టర్‌గా వైశాలి...**

ఆధునిక చదరంగ చరిత్రలో భారత తొలి గ్రాండ్ మాస్టర్‌గా నిలిచిన ఘనత విశ్వవిజేత విశ్వనాథన్ ఆనంద్‌ది కాగా..ఆ తరువాత మరో ముగ్గురు మహిళలు సహా మొత్తం 81 మంది గ్రాండ్ మాస్టర్లుగా నిలువగలిగారు. ప్రపంచంలోనే ఎక్కువ గ్రాండ్ మాస్టర్లు కలిగిన దేశంగా భారత్‌ను నిలిపారు.

అంతర్జాతీయంగా జరిగే పలు రకాల చదరంగ పోటీలలో పాల్గొంటూ సాధించిన విజయాలకు ప్రపంచ చెస్ సమాఖ్య రేటింగ్ పాయింట్లు ఇస్తుంది. తొలిదశలో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా సాధించిన క్రీడాకారులు 2500 ఎలో రేటింగ్ పాయింట్లు సాధించగలిగితే గ్రాండ్ మాస్టర్ హోదా దక్కుతుంది. చదరంగ క్రీడాకారులకు గ్రాండ్ మాస్టర్ హోదా సాధించడం అంటే ఓ తపస్సు చేయడం లాంటిదే.

**ఆనంద్ నుంచి వైశాలి వరకూ...**

భారత చదరంగ చరిత్రను చూస్తే..విశ్వనాథన్ ఆనంద్‌తో మొదలైన గ్రాండ్ మాస్టర్ల పరంపర వైశాలి వరకూ కొనసాగుతూ వచ్చింది. మొత్తం 84 మంది గ్రాండ్ మాస్టర్లలో ముగ్గురు మాత్రమే మహిళలు కావడం విశేషం. మిగిలిన 81మంది పురుష గ్రాండ్ మాస్టర్లే కావడం భారత చదరంగ ప్రత్యేకతగా నిలిచిపోతుంది.

స్పెయిన్ వేదికగా జరిగిన 2023 ఇలోబ్రెగాట్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో పాల్గొని వరుసగా రెండు విజయాలు సాధించడం ద్వారా గ్రాండ్ మాస్టర్ హోదా పొందటానికి అవసరమైన పాయింట్లను వైశాలి సాధించడం ద్వారా ఓ అరుదైన ఘనతను దక్కించుకొంది.

భారత మహిళా చెస్ లో గ్రాండ్ మాస్టర్ హొదా సాధించిన మూడో మహిళగా వైశాలి రికార్డుల్లో చేరింది. వైశాలి కంటే ముందే ఇదే ఘనతను సాధించినవారిలో తెలుగుతేజాలు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి, గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక మాత్రమే ఉన్నారు. తాజాగా ఈ ఇద్దరి సరసన వచ్చి వైశాలి సైతం చేరింది.

**గ్రాండ్ మాస్టర్ టైటిల్ కోసం పోరాటం....**

తమిళనాడులోని ఓ తెలుగు మూలాలున్న కుటుంబం నుంచి భారత చదరంగ క్రీడలోకి దూసుకొచ్చిన ప్రజ్ఞానంద్ రమేశ్ 12 సంవత్సరాల వయసుకే గ్రాండ్ మాస్టర్ టైటిల్ సాధించడం ద్వారా చరిత్ర సృష్టిస్తే ..అతని అక్క వైశాలీ రమేశ్ మాత్రం అంచెలంచెలుగా ఎదుగుతూ 21 సంవత్సరాల వయసులో గానీ గ్రాండ్ మాస్టర్ హొదా సాధించ లేకపోయింది.

15 ఏళ్ల వయసులో మహిళా ఇంటర్నేషనల్ మాస్టర్, 17 సంవత్సరాల వయసులో మహిళా గ్రాండ్ మాస్టర్, 20 సంవత్సరాల వయసులో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా సంపాదించిన వైశాలీ.. గ్రాండ్ మాస్టర్ హోదా కోసం అంతులేని పోరాటమే చేయాల్సి వచ్చింది. ఓవైపు తన తమ్ముడు ప్రజ్ఞానంద్ కేవలం 12 సంవత్సరాల వయసులోనే గ్రాండ్ మాస్టర్ టైటిల్ సాధిస్తే.. వైశాలీ మాత్రం తమ్ముడితో సమానంగా రాణించలేక తీవ్రఒత్తిడిని ఎదుర్కొంటూ గత 12 సంవత్సరాలుగా పోరాడుతూ వచ్చింది. 2019లో తొలి గ్రాండ్ మాస్టర్ నార్మ్ సాధించిన వైశాలీ మిగిలిన రెండు నార్మ్ల కోసం 2023 వరకూ వేచిచూడాల్సి వచ్చింది. చివరకు 21 సంవత్సరాల వయసులో గ్రాండ్ మాస్టర్ టైటిల్‌ను చేజిక్కించుకో గలిగింది.

**విశ్వ చదరంగ చరిత్రలోనే అరుదైన రికార్డు!**

వైశాలీ గ్రాండ్ మాస్టర్ హోదా దక్కించుకోడం ద్వారా మరో అరుదైన ఘనతను సొంతం చేసుకోగలిగింది. ప్రపంచ చదరంగ చరిత్రలోనే గ్రాండ్ మాస్టర్ హోదా సాధించిన తొలి అక్కా-తమ్ముడిగా వైశాలి, ప్రజ్ఞానంద్ చరిత్ర సృష్టించారు.

**తొలి అక్కా-తమ్ముడి జోడీ...**

ప్రపంచ చదరంగ చరిత్రలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు పురుషుల, మహిళల విభాగాలలో గ్రాండ్ మాస్టర్లుగా నిలవడం ఇదే మొదటిసారి. గతంలో 2500 పాయింట్ల ఎలో రేటింగ్ సాధించిన భారత దిగ్గజ గ్రాండ్ మాస్టర్లలో విశ్వనాథన్ ఆనంద్, కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, దివ్యేందు బారువా,ప్రజ్ఞానంద్ మాత్రమే ఉన్నారు.చైనాలోని హాంగ్జు వేదికగా ముగిసిన 2022 ఆసియాక్రీడల పురుషుల, మహిళల విభాగాలలో ప్రజ్ఞానంద్, అతని సోదరి వైశాలీ రజతపతకాలు సాధించారు. అంతేకాదు..కాండిడేట్స్ చెస్ టైటిల్ రౌండ్ కు పురుషుల, మహిళల విభాగాలలో గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద్, గ్రాండ్ మాస్టర్ వైశాలి ఇప్పటికే అర్హత సంపాదించగలిగారు.

2024 ఏప్రియల్ లో జరిగే ప్రపంచ కాండిడేట్స్ చెస్ టోర్నీ పురుషుల, మహిళల విభాగాలలో తమ్ముడు ప్రజ్ఞానంద్, అక్క వైశాలీ రాణించడం ద్వారా విశ్వవిజేతలుగా నిలువగలిగితే...అది సరికొత్త చరిత్రే అవుతుంది. ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# పర్యావరణ కాలుష్యంపై

## హితోక్తి

కొన్ని దశాబ్దాలుగా మన దేశంతోపాటు ప్రపంచం కూడా మునుపెన్నడూ ఎరుగని విపత్తులను ఎదుర్కొంది. ఎక్కడో ఒకచోట హిమానీనదాలు కరిగిపోతున్నాయి.. మరో చోట నదులు ఎండిపోతున్నాయి.. ప్రపంచమంతటా వాతావరణం అనూహ్యంగా మారిపోతోంది. ఢిల్లీలో కాలుష్యం తీవ్ర ప్రమాద స్థాయికి చేరడంతో పాఠశాలలు మూతపడ్డాయి. ఇలాంటి పరిస్థితుల నడుమ కాలుష్య నివారణ లేదా పర్యావరణ సమస్య పరిష్కార బాధ్యత విధాన రూపకర్తలకు మాత్రమే పరిమితం కాదు. అందుకే, దేశంలో పర్యావరణ పరిరక్షణకు భారత్ బహుముఖంగా కృషి చేస్తోంది. అంతేకాకుండా భవిష్యత్తు కోసం హరిత ప్రగతి వంటి అంశాలపై ప్రపంచానికి అవగాహన పెంచుతోంది. ఈ దిశగా మన కార్యాచరణ, రాబట్టిన ఫలితాల గురించి జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా ఇప్పుడు తెలుసుకుందాం...

వాతావరణ మార్పు కారకాలలో భారత్ పాత్ర నామమాత్రమే అయినా, ఈ సమస్య పరిష్కారం దిశగా మన దేశం అవిరళ కృషి చేస్తోంది. ప్రపంచంలోని పెద్ద, ఆధునిక దేశాలు భూమి సహనీయతను మించి వనరులను తోడేయడమే కాకుండా, గరిష్ఠ పరిమాణంలో కర్బన ఉద్గారాలను వాతావరణంలోకి విడుదల చేస్తున్నాయి. ప్రపంచ తలసరి సగటు కర్బన పాదముద్ర ఏటా 4 టన్నులు కాగా, మన దేశంలో మాత్రం 0.5 టన్నులే. అయినప్పటికీ, అంతర్జాతీయ సమాజ సహకారంతో భారత్ దీర్ఘకాలిక దృక్కోణం ప్రాతిపదికగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తోంది. ఆ మేరకు పర్యావరణ పరిరక్షణతోపాటు విపత్తు ప్రతిరోధక మౌలిక సదుపాయాల కోసం ఓ కూటమిని, సౌరశక్తి సద్వినియోగం కోసం అంతర్జాతీయ సౌర కూటమిని ఏర్పరచింది. భారత్ నాయకత్వాన వాతావరణ మార్పు సహా, పర్యావరణ సంక్షోభాలు-సవాళ్ల పరిష్కారం దిశగా 'తక్షణ కార్యాచరణ'కు జి- 20 కూటమి నిర్ణయించింది. తదనుగుణంగా 2015నాటి పారిస్ ఒప్పందాన్ని గౌరవిస్తూ నిర్దేశిత లక్ష్యాలను స్వీకరించి సుస్థిర, సమ్మిళిత, సమతుల వృద్ధి మార్గాన్ని అనుసరిద్దామని పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా పర్యావరణం కోసం జీవనశైలి- 'మిషన్ లైఫ్' కార్యక్రమాన్ని కూడా అమలుచేస్తోంది.

పర్యావరణానికి హాని కలిగించే వ్యర్థాల నిర్వహణ - నిర్మూలన గణనీయ తగ్గింపుపై ఒప్పందం పూర్తయింది. దేశంలో 2070నాటికి నికరశూన్య ఉద్గార స్థాయి సాధన లక్ష్యంవైపు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ముందుకెళ్తోంది. 'పిఎం జాతీయ గతి శక్తి' బృహత్ ప్రణాళిక రవాణారంగం, వ్యవస్థలను బలోపేతం చేస్తూ కాలుష్యం తగ్గుదలకు తోడ్పడుతుంది. అలాగే 100కు పైగా జలమార్గాల్లో బహుళ - రవాణా సాధన అనుసంధానం అమలుతో కాలుష్యం తగ్గింపు సాధ్యమవుతుంది.



**భారత్ : ప్రపంచానికి స్ఫూర్తి ప్రదాత**

వాతావరణ మార్పు సవాళ్ల పరిష్కారం దిశగా 'మిషన్ లైఫ్'... ప్రపంచానికి దిశానిర్దేశం చేసే 'పంచామృతం' వంటి కార్యక్రమాలతో... భారత్ సదా అన్ని దేశాలకూ స్ఫూర్తిప్రదాతగా నిలుస్తోంది. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన దేశం అనేక రికార్డులను తిరగరాసింది. ఈ మేరకు మన దేశంలో పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం 2014లో 20 గిగావాట్లు కాగా, 2022 నాటికి దీన్ని 100 గిగావాట్ల స్థాయికి పెంచాలని ప్రధాని నిర్ణయించారు. అయితే, ఆ గడువుకు ముందే ఈ లక్ష్యాన్ని చేరడంతోపాటు కొత్త, భారీ... భవిష్యత్ లక్ష్యాల నిర్దేశం ద్వారా భారత్ ప్రపంచానికి కొత్త మార్గాలు చూపింది. కాగా, 2015లో అంతర్జాతీయ సౌరకూటమి (ఐఎస్ఎ)ని భారత్ ఏర్పాటు చేసింది.

**హరిత ఉదజని కార్యక్రమం**

– హరిత ఉదజని కార్యక్రమం కింద 2030 నాటికి ఏటా 5 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పాదక సామర్థ్యం సాధించగలమని భారత్ అంచనా వేసింది. తద్వారా శిలాజ ఇంధన దిగుమతులను గణనీయంగా తగ్గించుకోవడం సహా, వాటిపై ఆధారపడే పరిస్థితి తప్పుతుంది. దీనివల్ల 2030 నాటికి రూ.1 లక్ష కోట్లు ఆదా అవుతాయి.

– హరిత ఉదజని లక్షిత ఉత్పత్తి, వినియోగంతో ఏటా దాదాపు 50 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించే వీలుంటుంది.

– ఈ మిషన్ ప్రారంభ వ్యయం రూ. 19,744 కోట్లుగా అంచనా వేశారు.

– ప్రస్తుతం మన దేశంలో 'గ్రే-హైడ్రోజన్' వార్షిక వినియోగం 5 'ఎంటి'లుగా ఉంటుందని అంచనా. ఇది ప్రధానంగా పెట్రోలియం శుద్ధితోపాటు అమ్మోనియా ఉత్పత్తికి ఉపయోగిస్తారు.

**కాలుష్యం తగ్గింపు చర్యలు**

దేశంలోని 131 లక్షిత నగరాల్లో గాలి నాణ్యత పెంపుపై జాతీయ వ్యూహంలో భాగంగా జాతీయ పరిశుభ్ర ప్రాణవాయువు కార్యక్రమాన్ని 2019లో ప్రారంభించారు.


వాయు కాలుష్య నివారణ దిశగా కేంద్ర ప్రభుత్వం 2020 ఏప్రిల్ నెలలో ఇంధనాలు-వాహనాల కోసం బిఎస్-4 నుంచి బిఎస్-6 నిబంధనలవైపు పరివర్తనను ముందుకు జరిపింది.

సిఎన్‌జి, ఎల్ఎన్‌జి, ఇథనాల్ మిశ్రమ పెట్రోలుకు ప్రత్యామ్నాయంగా ఇ20 ఇంధనాన్ని మోటారు వాహన ఇంధనంగా ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం ఆర్ఎఫ్ఎస్ఐడి పాయింట్‌ని సృష్టించింది.

విద్యుత్ వాహనాల వాడకాన్ని త్వరగా చేపట్టేలా వాటికి అనుమతి నిబంధనల సడలింపు సహా, మెట్రో రైళ్ల పొడిగింపు, రోప్‌వేలు-కేబుల్ కార్లను ప్రవేశ పెట్టేందుకు 'ఫేమ్' పథకం అమలు.

పొలాల్లో దుబ్బుల దహనంవల్ల ఏర్పడే కాలుష్య నివారణ లక్ష్యంగా పంజాబ్, హరియాణా, ఉత్తర్ ప్రదేశ్, ఢిల్లీ పరిధిలో సబ్సిడీతో పంట అవశేషాల

# అవగాహన పెంచుతున్న భారత్




నిర్వహణ యంత్రాల కొనుగోలు పథకాన్ని 2018–19లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.

వాయు కాలుష్య స్థాయిలో ఆకస్మిక పెరుగుదల సమస్య పరిష్కారం కోసం 2017లో 'స్థాయిలవారీ ప్రతిస్పందన కార్యాచరణ ప్రణాళిక' (జిఆర్‌ఎపి) ప్రారంభం.

వివిధ వనరుల నుంచి వెలువడే తుక్కును శాస్త్రీయంగా నిర్మూలించడం కోసం లోహపు తుక్కు కేంద్రాల ఏర్పాటుతోపాటు దీన్ని ప్రోత్సహించే దిశగా 'ఇనుప తుక్కు పునరుత్పత్తి విధానం– 2019' కింద ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

జాతీయ నది గంగ, దాని ఉపనదుల పునరుజ్జీవనం కోసం 2014 జూన్‌లో ప్రారంభించిన నమామి గంగే కార్యక్రమం 2026 మార్చి 31దాకా పొడిగించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, పర్యావరణం మెరుగు లక్ష్యంగా పరిశుభ్ర భారతం, అత్యాధునిక నగరాలు, పిఎం ఉజ్వల యోజన, హరిత ఉదజని కార్యక్రమం, గోబర్– ధన్ వంటి పథకాలు అమలు అవుతున్నాయి. ఇథనాల్ మిశ్రమం ద్వారా 318 లక్షల టన్నులమేర కర్బన ఉద్గారాల తగ్గింపు

ఇథనాల్ మిశ్రమ ప్రణాళికకు అనుగుణంగా 2023 ఫిబ్రవరిలో బెంగళూరు నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో 11 రాష్ట్రాల్లోని 84 చమురు విక్రయ కంపెనీల కేంద్రాల్లో 'ఇ20' ఇంధన విక్రయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. పెట్రోలులో 20 శాతం ఇథనాల్ మిశ్రమం వల్ల దీన్ని 'ఇ20'గా వ్యవహరిస్తారు. ఈ ప్రక్రియను 2025 నాటికి దేశమంతటా అమలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కాగా, 2013–14 నుంచి దేశంలో ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యం 6 రెట్లు పెరిగింది. ఈ మేరకు 2014లో పెట్రోలులో ఇథనాల్ మిశ్రమం 1.5 శాతం కాగా, 10 శాతానికి పెంచే లక్ష్యాన్ని భారత్ 5 నెలలు ముందుగానే సాధించింది. ఇథనాల్ మిశ్రమంతో వాతావరణంలోకి కర్బన ఉద్గారాల విడుదల 318 లక్షల టన్నుల మేర తగ్గింది. అంతేగాక 54,000 కోట్ల విదేశీ మారకం ఆదా అయింది.

ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా ఉద్యమాల ద్వారా సంస్కరణలు

**జాతీయ నది గంగలో కాలుష్యం తగ్గింపు**

జాతీయ నది గంగలో 2014 నుంచి 2022 దాకా జల నాణ్యత పారామితులపై సేకరించిన సమాచారం మేరకు నీటిలో కరిగిన ఆక్సిజన్ విలువ 32 పాయింట్ల మేర పెరిగింది. జీవరసాయన ప్రాణవాయువు పరిమాణం 41 పాయింట్లు, 'ఫీకల్ కోలిఫాం' సగటు విలువ 27 పాయింట్ల మేరకు మెరుగు పడ్డాయి.

**నగరాల్లో వాయు కాలుష్యం**

> "జాతీయ హరిత ఉదజని కార్యక్రమం ద్వారా భారతదేశం పర్యావరణ హిత ఇంధన వనరు దిశగా ముందంజ వేసింది. నికరశూన్య ఉద్గార స్థాయి లక్ష్యాన్ని సాధించడంలో ఇది భారత్ సహా, అనేక ఇతర దేశాలకూ తోడ్పడగలదు. ప్రగతి ప్రకృతి చెట్టాపట్టాలేసుకుని సాగడం సాధ్యమేనని చెప్పడానికి భారత్ తిరుగులేని రుజువుగా నిలుస్తోంది."
>
> – నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

జాతీయ పరిశుభ్ర ప్రాణవాయువు కార్యక్రమ పథకం కిందగల 131 నగరాలకుగాను 90 నగరాల్లో 2017–18 నాటితో పోలిస్తే 2022–23లో 'పిఎం10' సాంద్రత స్థాయి తగ్గింది.

**టోల్ కేంద్రాల వద్ద కాలుష్యం తగ్గుదల**

జాతీయ రహదారులపైగల రోడ్డు రుసుము (టోల్ ) వసూలు కేంద్రాల వద్ద అన్ని వరుసలూ 2021 ఫిబ్రవరి 15 అర్ధరాత్రి నుంచి 'ఫాస్టాగ్' ఆధారితంగా నడుస్తాయని ప్రకటించారు. ఇది లేకపోతే రెట్టింపు రుసుము చెల్లించాల్సి ఉం టుంది. ఈ నిబంధనతో ఏటా 35 కోట్ల లీటర్ల ఇంధనం ఆదాతోపాటు దాదాపు 10 లక్షల టన్నులదాకా కర్బన ఉద్గారాలు తగ్గాయి.

**జీవ ఇంధనంతో ఎగిరే వాణిజ్య విమానం**

అంతర్జాతీయ సౌర కూటమి పురోగమనం వల్ల జీవ ఇంధనంతో వాణిజ్య విమానాలు నడిపే ఏకైక దేశంగా భారత్ రూపొందే అవకాశం ఉంది.

**స్వల్ప కృషితో అనల్ప పరిష్కారాలు**

దేశంలో 'ఎల్‌ఇడి' బల్బుల వినియోగ ప్రణాళిక అమలు ద్వారా విద్యుత్ పొదుపుతోపాటు, 100 మిలియన్ టన్నులకు పైగా కర్బన ఉద్గారాల విడుదల తగ్గింది. ఇక తొమ్మిదేళ్లలో 11.5 కోట్లకుపైగా మరుగుదొడ్ల నిర్మాణంతో దేశం బహిరంగ విసర్జన విముక్తమైంది. తద్వారా పర్యావరణ పరిరక్షణకు ఊతం లభించింది. అలాగే ఉజ్వల పథకంతో మహిళలు పొగ నుంచి విముక్తులయ్యారు.

**భారత్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద పులుల శ్రేణి**

భారతదేశంలో 75,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 53 పులుల అభయారణ్యాలున్నాయి. ప్రపంచ పులుల జనాభాలో 70 శాతానికి పైగా మన దేశంలోనే ఉన్నాయి. ఆ మేరకు అంతర్జాతీయంగా అత్యధిక పులులుగల దేశంగా భారత్ రికార్డులకెక్కింది. పర్యావరణ వ్యవస్థ సమతౌల్యానికి పులుల సంరక్షణ దోహదం చేస్తుంది.

**ఆసియాలో అతిపెద్ద రామసర్ ప్రదేశాల నెట్‌ వర్క్ సిద్ధం**

భారత 76వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో అంతర్జాతీయ ప్రాముఖ్యంగల 10 రామసర్ ప్రదేశాలను తీర్మాన చట్రంలోని జాబితాలో చేర్చింది. దీంతో దేశంలోని రామసర్ ప్రదేశాల సంఖ్య 75కి చేరింది. ఇది ఆసియా మొత్తం మీద ఏ దేశంలోనూ లేనంత అతిపెద్ద రామసర్ సైట్ నెట్‌వర్క్‌గా నిలిచింది. కాగా, 2014 దాకా 26 రామసర్ ప్రదేశాలు మాత్రమే జాబితాలో చేర్చగా, అప్పటి నుంచి 49కిపైగా జోడించారు.

'న్యూ ఇండియా సమాచార్' నుంచి

# బాల జాగృతి

తెలుసుకుందాం

## మధ్యమహేశ్వర్ ఆలయం - ఉత్తరాఖండ్



శివుడికి అంకితమిచ్చిన ఈ ఆలయం ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచినది. గర్వాల్ ప్రాంతంలోని ఐదు శివాలయాలను కలిగి ఉన్న పంచ కేదార్ తీర్థయాత్ర (కేదార్‌నాథ్, తుంగనాథ్, రుద్రనాథ్, మధ్యమహేశ్వర్, కల్పేశ్వర్) లలో ఇదీ ఒకటి. శివుడి నాభి భాగం పూజలందుకోవడం ఇక్కడి విశిష్టత. ఈ దేవాలయాన్ని పాండవులు నిర్మించినట్లు స్థానికుల విశ్వాసం.

## కథ | అల్పులతో సహవాసం ప్రమాదకరం



ఉజ్జయిని నగరానికి సమీపాన ఉన్న అడవిలో ఒక పెద్ద రావిచెట్టు ఉంది.

దాని మీద ఒక కాకి, ఒక హంస నివసిస్తున్నాయి. కాకిది దుష్టస్వభావం, అల్పబుద్ధి అని తెలిసి కూడా పొరుగున ఉంటోంది కదా అని దాంతో స్నేహంగానే ఉండసాగింది హంస.

ఒకరోజు అడవికి వేటగాడు వచ్చాడు.

ఎంత ప్రయత్నించినా ఏమీ దొరకకపోవడంతో వెనుదిరిగి పోతూ కొంతసేపు విశ్రాంతి తీసుకుందామని ఆ చెట్టు కింద ఆగాడు. అలసిపోయి ఉండటంతో ఆ వేటగాడికి వెంటనే నిద్ర వచ్చింది.

అది వేసవి కాలం, గాలి లేదు. అతనికి శరీరం అంతా చెమట పట్టింది.

మంచి స్వభావం కలిగిన హంస కొమ్మ మీద నిలబడి అతడికి తన రెక్కలతో విసరసాగింది.

ఇంతలో అల్పబుద్ధి గల కాకి వచ్చింది.

హంస చేస్తున్న పరోపకారం చూసి నవ్వింది. "వాడు వేటగాడు! మనల్ని బాణాలతో వేటాడతాడు. వాడికి సేవ

## పద్యము

**ఎరుగ వాని దెలుప నెవ్వడైనను జాలు**
**నొరుల వశముగాదు ఓగుదెల్ప**
**యేటివంక దీర్ప నెవ్వరి తరమయా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

భావం : తెలుసుకోవాలనే జిజ్ఞాసగలవారికి తెలియజెప్పడం అందరికీ సులభమే. తాను పట్టిన కుందేలుకి మూడే కాళ్లు అని వాదించటం మూర్ఖుని సహజ లక్షణం. అలాంటి వాడికి తెలియజెప్పటం ఎవరి తరం కాదు. ఏటికుండే ప్రకృతి సిద్ధమైన వంపును సరిచేయటం ఎవరికీ సాధ్యం కాదు. అలాగే మూర్ఖుడిని కూడా సరిచేయలేము.

## శ్లోకము

**'మరణాంతాని వైరాణి**
**'మరణాంతాని వైరాణి**
**ప్రసవాంతం చ యౌవనమ్**
**కోపితా ప్రణతాంహి**
**యాచితాంతం చ గౌరవమ్**

భావం : మరణంతో పగ చెల్లిపోతుంది. ప్రసవంతో శరీర పటుత్వం తగ్గిపోతుంది. దండం పెట్టడంతో ఎదుటివారిలో కోపం మటుమాయమవుతుంది. యాచనతో గౌరవానికి భంగం వాటిల్లుతుంది.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| భూదానోద్యమం | వివేకానంద |
| రెడ్ క్రాస్ | దయానంద సరస్వతి |
| హెూం రూల్ | వినోబాభావే |
| రామకృష్ణ మిషన్ | బాలగంగాధర్ తిలక్ |
| ఆర్య సమాజం | హెన్నీ డ్యూనాంట్ |

సమాధానాలు : భూదానోద్యమం–వినోబాభావే
రెడ్ క్రాస్ –హెన్నీ డ్యూనాంట్
హెూం రూల్–బాలగంగాధర్ తిలక్
రామకృష్ణ మిషన్–వివేకానర
ఆర్య సమాజం–దయానంద సరస్వతి.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### కైలాసపతి మిశ్రా



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకుడు. 1923, అక్టోబర్ 5న బిహార్ రాష్ట్రంలో బక్సర్‌లోని దుధర్ చక్‌లో జన్మించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా అనేకసార్లు జైలుకు వెళ్లారు. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం రాజకీయాల్లోనూ రాణించారు. జన్‌సంఘ్, బీజేపీలో వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. గుజరాత్ గవర్నర్‌గా కూడా పనిచేశారు. 2012 నవంబరు 3 తుదిశ్వాస విడిచారు.



చేస్తున్నావు ఎంత పిచ్చిదానివి” అని ఎగతాళి చేసింది.

అంతటితో ఆగకుండా కాకి నిద్రపోతున్న వేటగాడిపై రెట్టవేసి, తలమీద తన్ని ఎగిరిపోయింది.

దాంతో వేటగాడికి నిద్రాభంగం కలిగింది. ఒంటి మీద ఉన్న రెట్ట చూశాడు. కోపం వచ్చింది. వెంటనే పైకి చూశాడు. హంస తప్ప అక్కడ ఏదీ లేదు. తన మీద హంస రెట్ట వేసిందనుకొని వెంటనే తన బాణాన్ని హంసకు గురి చూసి వదిలాడు. బాణం దెబ్బకి హంస చనిపోయింది. వేటగాడు దానిని తీసుకుని ఇంటికి వెళ్లిపోయాడు.★

## జనరల్ నాలెడ్జ్

1. మనదేశంలో ఎక్కువకాలం ఉపరాష్ట్రపతిగా పనిచేసినదెవరు?
2. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ విజయం సాధించి, అధికారాన్ని చేపట్టింది?
3. ప్రపంచంలోనే ఎత్తైన డ్యాం ఏది? ఎక్కడుంది?

సమాధానాలు : 1. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 2. కాంగ్రెస్ 3. దిగ్రాండ్ (స్విట్జర్లాండ్).

## మెదడుకు మేత

**అడవిలో అక్కమ్మ జుట్టు విరబోసుకుని కూర్చుంది.**

జవాబు : ఈతచెట్టు

## మంచిమాట

**హృదయానికి, మెదడుకు మధ్య సంఘర్షణ తలెత్తితే.. హృదయాన్నే అనుసరించడం ఉత్తమమైన మార్గం..**



# వారఫలాలు

11-17 డిసెంబర్ 2023




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

వీరికి పట్టింది బంగారమే అన్నట్టుం టుంది. ఆస్తి వ్యవహారాలలో చిక్కులు తొలగుతాయి. ప్రముఖులతో పరిచయాలు సంతోషం కలిగిస్తాయి. విద్యార్థులు, నిరుద్యోగులకు అనుకూల సమాచారం. ఆర్థిక విషయాలు ఆశాజనకం. ఉద్యోగులకు పైస్థాయి వారి ఆదరణ. పారిశ్రామికవర్గాలకు విదేశీ పర్యటనలు. రచయితలు, క్రీడాకారుల యత్నాలు సఫలం. 11,12 తేదీలలో ధనవ్యయం. కుటుంబంలో చికాకులు. శ్రీనృసింహస్తోత్రాలు పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

అనుకున్నది సాధించే వరకూ విశ్రమించరు. ఆత్మీయులు మరింత చేయూతనందిస్తారు. పెండింగ్ పనులు పూర్తి కాగలవు. వాహనాలు, విలువైన వస్తువులు కొంటారు. ఆలయాలు సందర్శిస్తారు. వేడుకలకు హాజరవుతారు. వ్యాపారాలలో లాభాలు అందుతాయి. ఉద్యోగులకు ఉన్నత హోదాలు. రాజకీయవర్గాలకు కొత్త ఆశలు. వైద్యులు, వ్యవసాయ దారులకు శుభవార్తలు. 13,14 తేదీల్లో వృథా ఖర్చులు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ముఖ్య కార్య క్రమాలు సజావుగా పూర్తి చేస్తారు. ఆస్తి వ్యవహారాలలో విజయం సాధిస్తారు. బంధువులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. విద్యార్థుల యత్నాలు సఫలం. ఉద్యోగులకు అనుకోని బాధ్యతలు దక్కుతాయి. వైద్యులకు మంచి గుర్తింపు రాగలదు. క్రీడాకారులు, సాంకేతిక నిపుణులకు అవకాశాలు మరింత దక్కుతాయి. 9,10 తేదీల్లో ధనవ్యయం. దుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

కొన్ని సమస్యలు పట్టుదలతో అధిగమిస్తారు. కార్యక్రమాలు సకాలంలో పూర్తి కాగలవు. ఆలోచనలు అమలు చేస్తారు. ఆస్తి వ్యవహారాలలో ఒప్పందాలు చేసుకుంటారు. వాహనయోగం. వ్యాపారాలలో అవరోధాలు అధిగమిస్తారు. ఉద్యోగులకు మంచి గుర్తింపు రాగలదు. కళాకారులు కొన్ని అవకాశాలు దక్కించుకుంటారు. రచయితలు, క్రీడాకారులకు మరిన్ని అవకాశాలు. 12,13 తేదీల్లో వృథా ఖర్చులు. ఆదిత్య హృదయం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

రాబడి ఆశాజకనంగా ఉంటుంది. కార్యక్రమాలు సజావుగాసాగుతాయి. చిన్ననాటి మిత్రులతో ఉత్సాహంగా గడుపుతారు. ఆధ్యాత్మికకార్యక్రమాలలో పాల్గొంటారు. విద్యార్థులకు శుభవార్తలు. ఉద్యోగులకు అనుకూల పరిస్థితులు ఉంటాయి. పారిశ్రామిక వర్గాలకు కొత్త ఆశలు చిగురిస్తాయి. వైద్యులు, సాంకేతిక నిపుణులకు ఆశ్చర్యకరమైన సంఘటనలు ఎదురవుతాయి. 11,12 తేదీల్లో అనారోగ్యం. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

ఉత్సాహంగా అనుకున్న కార్యక్రమాలు పూర్తి చేస్తారు. ఆస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. రాబడి సంతృప్తి నిస్తుంది. ఇంటి నిర్మాణయత్నాలు సానుకూలం. వ్యాపారాలు వృద్ధి. ఉద్యోగులకు నూతనోత్సాహం. రాజకీయవేత్తలకు ఊహించని సమాచారం. వైద్యులు, సాంకేతిక నిపుణులకు ఆహ్వానాలు రాగలవు. 15,16 తేదీల్లో అనారోగ్యం. ధనవ్యయం. దేవీస్తుతి మంచిది.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

అనుకున్న కార్యక్రమాలలో ఆటంకాలు. ఆర్థిక విషయాలలో ఆచితూచి వ్యవహరించండి. తొందరపాటు మాటలతో ఆప్తులతో వివాదాలు. ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి. ఒక ఆసక్తికర సమాచారం అందుతుంది. నిర్ణయాలు కొన్ని మార్చుకుంటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు. కళాకారులకు చికాకులు. 14,15 తేదీల్లో విందువినోదాలు. విష్ణుధ్యానం చేయండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

బంధువులు లేదా స్నేహితుల నుంచి ముఖ్య సందేశం అందుతుంది. బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి ప్రశంసలు పొందుతారు. భూములు, వాహనాలు కొనుగోలు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు కొత్తహోదాలు. కళాకారులు, రియల్ ఎస్టేట్ల వారికి శుభవార్తలు. రచయితలకు గుర్తింపు లభిస్తుంది. 16,17 తేదీల్లో వృథా ఖర్చులు. ఆంజనేయస్వామి దండకం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

కార్యక్రమాలు సజావుగా పూర్తి కాగలవు. కొంత శ్రమ పడ్డా ఫలితం కనిపిస్తుంది. విద్యార్థుల యత్నాలు అనుకూలిస్తాయి. పలుకుబడి పెరుగుతుంది. మన స్సాక్షికి అనుగుణంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారాలలో కొత్త పెట్టుబడులు అందుతాయి. రచయితలు, క్రీడాకారులు మరింత పట్టుదలతో ముందుకు సాగుతారు. 14,15 తేదీల్లో వ్యయప్రయాసలు. అనారోగ్యం. గణేశాష్టకం పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

అనుకున్న కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తి చేస్తారు. ఆలోచనలు అమలులో కొంత శ్రమ పడాల్సి వస్తుంది. చిరకాల ప్రత్యర్థులు మీకు మద్దతుగా నిలుస్తారు. కుటుంబంలో శుభకార్యాలపై చర్చలు సాగిస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు అనుకూల వాతావరణం. కళాకారుల యత్నాలలో కదలికలు. వైద్యులు, సాంకేతిక నిపుణుల కృషి ఫలిసతుంది. 13,14 తేదీల్లో ఆరోగ్యసమస్యలు. వ్యయప్రయాసలు. శివాష్టకం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

కార్యక్రమాలలో ప్రతిబంధకాలు తొలగుతాయి. ఆర్థిక విషయాలలో పురోగతి కనిపిస్తుంది. విద్యార్థులు, నిరుద్యోగులకు కొత్త ఆశలు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. వ్యాపారాలు లాభసాటిగాఉంటాయి. ఉద్యోగులకు హోదాలు పెరుగుతాయి. పారిశ్రామికవేత్తలు అనుకున్నది సాధిస్తారు. రచయితలు, క్రీడాకారులకు ఆహ్వానాలు. 13,14 తేదీల్లో వృథా ఖర్చులు, గణేశస్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సంఘంలో గౌరవం పెరుగుతుంది. విచిత్ర సంఘటనలు ఎదురవుతాయి. ఆలయాలు సందర్శిస్తారు. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారాలలో లాభాలు దక్కుతాయి. ఉద్యోగులకు శుభవార్తలు. పారిశ్రామిక వర్గాలకు విదేశీ పర్యటనలు. రచయితలు, క్రీడాకారులకు రివార్డులు దక్కవచ్చు. 11,12 తేదీలలో ధనవ్యయం. కుటుంబంలో చికాకులు. కాలభైరవాష్టకం పఠించండి. ★

# పదరసం-443

## ఆధారాలు

**అడ్డం**

1) ఆదిపరాశక్తి గురించిన మహాపురాణం (6)
4) గడ్డి, ఇంట్లో ఊడ్చిన చెత్త (3)
6) ఆలస్యం (2)
7) ఉంగరపు వేలు సరిగాలేదు (4)
8) ఉదాహరణ (2)
9) అసలే పెనుగాలి. అల్లకల్లోలంకూడా అయింది (5)
11) తిరగబడ్డ వివాహవేదిక / మండపం (5)
15) తూర్పు-ఉత్తరదిక్కు (3)
17) అదిరి పడుట (4)
18) దీవి (2)
19) ఇళ్ళలో తిరిగే దీనిని చూస్తే చాలామందికి జుగుప్స (2)
20) అలంపురంలో కొలువైన అమ్మవారు (4)
22) ఆపద, చెడుగు (2)
23) భార్యాభర్తలు (5)
24) రౌడీతనం వాడుక భాషలో (4)

**నిలువు**

1) సంస్కృత లిపి (5)
2) కూచిపూడి నృత్య విశేషం (5)
3) బృహదీశ్వరాలయం ఉన్న ఊరు (4)
5) ఉక్కిరి బిక్కిరి లాంటిది (4)
9) ఒక (సంగీత) తాళం (2)
10) మురికి (3)
12) తలక్రిందులైన మనస్సు (2)
13) "పైకి" ఇలా ఏడవడమంటే తీవ్రంగా దుఃఖించడం (4)
14) దీనిని చిలుకతో ముడిపెడతారు (3)
15) ఒకరికొకరు సరిపోతే ఇలా అంటారు(4)
16) పైకొచ్చిన దర్పం, భేషజం (4)
18) ఉత్తరాంధ్రలోని అతిచల్లని ప్రాంతం (4)
21) తడి (2)
22) మఱ (2)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | ■ | 4 | 5 | |
| | ■ | | ■ | ■ | 6 | | ■ | | ■ |
| 7 | | | | ■ | | ■ | ■ | 8 | |
| | ■ | | ■ | 9 | | | 10 | | ■ |
| 11 | 12 | | 13 | | ■ | | | ■ | 14 |
| ■ | | ■ | | ■ | 15 | | | ■ | |
| 16 | ■ | 17 | | | | ■ | ■ | 18 | |
| 19 | | ■ | | ■ | 20 | | | | ■ |
| | ■ | 21 | ■ | 22 | | ■ | ■ | | ■ |
| 23 | | | | | ■ | 24 | | | |

**పదరసం - 443**

పేరు : ..........................................................................................

చిరునామా:..........................................................................................

..........................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..............................................

**సమాధానాలను** పైగడులలో పూరించి,కత్తిరించి కవర్‌పై పదరసం నెం.వేసి 2023 డిసెంబర్ 25 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 439 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఆ | ము | క్త | 2 మా | ల్య | 3 ద | ✠ | 4 మే | ✠ | 5 అం |
| హా | ✠ | ✠ | న | ✠ | 6 ర | హా | ధ | 7 వి | బా |
| ద | ✠ | ✠ | 8 స | ల | హో | ✠ | ✠ | త్ర | ✠ |
| 9 మ | దా | ల | స | ✠ | 10 సం | 11 ద | ర్శ | నా | ర్థం |
| స్త | ✠ | ✠ | 12 రో | లు | ✠ | మం | ✠ | రా | ✠ |
| 13 కం | 14 కా | ✠ | వ | ✠ | 15 ణ | ✠ | ✠ | 16 యు | క్త |
| ✠ | 17 మే | దా | రం | ✠ | 18 క్ష | మా | 19 ప | ణ | ✠ |
| ✠ | శ్వ | ✠ | ✠ | 20 శ | శి | ✠ | ల | ✠ | 21 గో |
| 22 హా | రి | జా | 23 తం | ✠ | మ | ✠ | 24 నా | లు | క |
| య | ✠ | ✠ | 25 త్రి | వి | క్ర | ము | డు | ✠ | ర్ణం |

**విజేతలు:** కె.వి.రమణమూర్తి, రుద్రభట్ల సుగుణరాజారాం, వారణాసి సరస్వతి, ఎస్.ఫణిమంజరి, తిప్పావఝుల సుబ్రహ్మణ్యం, గొట్లూరు శక్తిబాల శ్రీవత్సశర్మ, ఎమ్.భాను, రాయవరపు శేషు, కొండేపూటి శంకరరావు, బండకింది సాయికుమార్, జి.వెంకటేశ్‌బాబు, మత్స్యరాజ విజయలక్ష్మి, గట్టుపల్లి భారతి, గుండ్లపల్లి సత్యంగౌడ్, తాళ్లూరి సుబ్బారావు, పూలాల చంద్రిక, తమ్మవరపు వెంకసాయి, మచ్చనందు, ఆర్.ఎస్.పి.కౌముది, డా.బి.ధన్వంతరి, బి.ఇందు శేఖర్, ఎమ్.నాగలక్ష్మి రాజయ్య, బోగపందరి, అప్పాశేషశాస్త్రి, ఆర్.అంజనీదేవి, మంచిరాజు రమణయ్య, నాగుల రాజేందర్‌గౌడ్, ఏ.గాయత్రి, భాగవతుల రామచంద్రమూర్తి, పున్నమరాజు వెంకట సుబ్బారావు, కె.వి.ఎస్.ఎన్.గణేశ్‌కుమార్, కె.సత్యనారాయణ, జి.వి.మురళీమోహన్ **ఈ వారం విజేత : శ్రీరాముల విజయకుమార్, కరినగరం.**

అరుణ



'అర్జున్ రెడ్డి'తో కల్ట్ మూవీ డైరెక్టర్స్ జాబితాలో చేరిపోయాడు సందీప్ రెడ్డి వంగ. సమాజానికి తన సినిమా ఎలాంటి మేలు చేస్తుందనే విషయాన్ని విస్మరించి, ఈ తరానికి నచ్చే విధంగా 'అర్జున్ రెడ్డి'ని తెరకెక్కించాడు. ఆ సినిమా మీద ఎన్ని విమర్శలు వచ్చినా... ప్రేక్షకాదరణ అయితే లభించింది. దాంతో పలు భాషల్లోకి అది రీమేక్ అయ్యింది. హిందీ రీ-మేక్ బాధ్యతలను తన భుజానికే ఎత్తుకుని షాహిద్ కపూర్ హీరోగా 'కబీర్ సింగ్' పేరుతో తీశాడు. అది ఘన విజయాన్ని సాధించింది. ఇదే సమయంలో రణబీర్ కపూర్‌తో 'యానిమల్' మూవీ చేసే ఛాన్స్ సందీప్ కు లభించింది. డిసెంబర్ 1న విడుదలైన 'యానిమల్' ను తెలుగులోనూ అదే పేరుతో డబ్ చేశారు.

# ఇలాంటి 'యానిమల్'కు దూరంగా ఉండాలి!

బల్‌బీర్ సింగ్ (అనిల్ కపూర్) దేశంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త. అతనికి ఒక్కగానొక్క కొడుకు రణ్ విజయ్‌సింగ్ (రణబీర్ కపూర్). అతనికి చిన్నప్పటి నుండి కుటుంబ సభ్యుల పట్ల విపరీతమైన ప్రేమ ఉంటుంది. అది తండ్రి పట్ల ఇంకా ఎక్కువ. అతనికి తండ్రే హీరో. అయితే బిజినెస్ వ్యవహారాలలో పడి బల్ బీర్ సింగ్ పిల్లలను నిర్లక్ష్యం చేస్తాడు. ఒకానొక సమయంలో తన అక్కయ్యను తమ కాలేజీలోని సీనియర్స్ ఏడిపించారని తెలిసి విజయ్ సింగ్ తుపాకీ తీసుకెళ్లి వాళ్లను బెదిరిస్తాడు. దాంతో తండ్రి ఆగ్రహానికి గురై బోర్డింగ్ స్కూల్‌కి షిఫ్ట్ అవుతాడు. యుక్తవయసు వచ్చిన తర్వాత బావ కారణంగా తండ్రితో గొడవ పడటంతో దేశమే వదిలి వెళ్లిపోతాడు. అలాంటి విజయ్ సింగ్ తన తండ్రిపై గుర్తు తెలియని వ్యక్తులు తుపాకీతో దాడి చేశారని తెలియగానే భార్య గీతాంజలి (రశ్మిక మందణ్ణ), పిల్లలతో దేశానికి తిరిగొస్తాడు. బల్ బీర్ సింగ్‌ను చంపాలనుకున్న శత్రువులు ఎవరు? అతని వ్యాపార సామ్రాజ్యాన్ని కూల్చడానికి ప్రయత్నించిన శక్తులు ఏవి? ఇంటిలోనే ఉన్న ఎలుకలను రణ్ విజయ్‌సింగ్ ఎలా కనిపెట్టి బయటకు లాగాడు? వాళ్లకు ఎలా బుద్ధి చెప్పాడు? అనేది మిగిలిన కథ. మనకు థియేటర్‌లో సినిమా ప్రారంభించే ముందు చట్టబద్ధమైన హెచ్చరిక... ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరం అని ఓ స్లైడ్ వేస్తారు. అలానే కొన్నే సినిమాలను అప్పటికే చూసిన వారు అలాంటి హెచ్చరికను తోటి వారికి చేయడం ద్వారా వారిని కాపాడిన వారు అవుతారు. అలా 'యానిమల్' విషయంలోనూ ముందస్తు హెచ్చరిక చేస్తే మంచిది.

సింపుల్‌గా చెప్పుకోవాలంటే... 'యానిమల్' మూవీ కార్పొరేట్ వరల్డ్‌లో జరిగే కుట్రలు, కుతంత్రాలకు సంబంధించిన రివేంజ్ డ్రామా. దానికి సందీప్ రెడ్డి వంగ ఫ్యామిలీ ఎమోషన్స్‌ను జత చేశాడు. పిల్లల పట్ల క్రూరంగా ఉండే తండ్రీ, అయినా ఆయనను అమితంగా ప్రేమించే కొడుకు కథ ఇది. తన ఎమోషన్స్‌ను ఏ మాత్రం కంట్రోల్ చేసుకోలేని ఈ కుర్రాడి చర్యల కారణంగానే కథ ముందుకు సాగుతుంది. ఇందులోని ప్రతి సన్నివేశానికి అతనికి లింక్ ఉంటుంది. తండ్రీ కొడుకుల మధ్య బాండింగ్‌ను మాత్రమే కాకుండా కలహాలతో విడిపోయిన ముందు తరం పెద్దలను కలుపుకునే భారీ సెంటిమెంట్ సీన్స్ కూడా ఇందులో ఉన్నాయి. బహుశా ఈ సన్నివేశాల కారణంగా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను థియేటర్‌కు రప్పించగలనని సందీప్ రెడ్డి వంగ భావించాడేమో తెలియదు.

కార్పొరేట్ ప్రపంచంలోని చీకటి కోణాలతో ఇప్పటికే చాలా సినిమాలు, వెబ్ సిరీస్ లు వచ్చాయి. అయితే వాటికి ఇది కాస్తంత భిన్నమైంది. వెబ్ సిరీస్‌లలో ఉండే ఎరోటిక్ డైలాగ్స్, రొమాంటిక్ సీన్స్ ఇందులోనూ ఉన్నాయి. వాటిల్లో లేని ప్రత్యేకత ఇందులో ఉన్నదేమంటే భారీ యాక్షన్ సీక్వెన్స్. పిచ్చిపట్టిన గజ్జికుక్క ఎలా గైతే కనిపించిన వాడిని కనిపించినట్టు కరిచేస్తూ ఉంటుందో... ఇందులో హీరో, విలన్ అలానే తమకు అడ్డువచ్చిన వారిని నరికేస్తూ ఉంటారు. కొన్ని యాక్షన్ సీన్స్ చాలా దారుణంగా ఉన్నాయి. మరికొన్ని సీన్స్ అత్యంత పర్వర్టెడ్ గా ఉన్నాయి. మొన్నటి వరకూ థియేట్రికల్ సినిమాలకు సెన్సార్ ఉంటుంది కాబట్టి... కొద్దో గొప్పో జుగుప్సాకరమైన సన్నివేశాలను వెండితెర మీద చూడమనే ధీమా ఉండేది. అలానే వినలేని, వినకూడని కొన్ని పదాలను మ్యూట్ చేస్తారనే నమ్మకం ఉండేది. కానీ ఈ సినిమాలో అలాంటిదేమీ లేదు. సెన్సార్ లేని ఓటీటీ కంటెంట్‌ను థియేటర్‌లో ప్రదర్శించినట్టుగా 'యానిమల్' ఉంది. మరి 'అర్జున్ రెడ్డి' తరహాలో సందీప్‌రెడ్డి ఏం చెప్పి సెన్సార్ సభ్యులను ఒప్పించాడో తెలియదు.

నటీనటుల విషయానికి వస్తే... రణబీర్ సింగ్ తన పాత్రను అవగాహన చేసుకుని అందులో ఒదిగిపోయాడు. 70 ఏళ్ళ ముసలివాడి దగ్గర నుండి పదహారేళ్ళ కుర్రాడి వరకూ నాలుగైదు ఏజ్ గ్రూప్స్‌లో కనిపిస్తూ దానికి తగ్గ బాడీ లాంగ్వేజ్ తో మెప్పించాడు. గీతాంజలిగా రశ్మికా మందణ్ణ బాగానే చేసింది. అక్కడక్కడా ఆమెలోని స్వతంత్ర భావాలను వెలిబుచ్చే ప్రయత్నం చేయడం బాగుంది. అనిల్ కపూర్‌తో పాటు శక్తి కపూర్, ప్రేమ్ చోప్రా, సురేశ్ ఓబెరాయ్, త్రిప్తి డిమ్రి తదితరులు కీలక పాత్రలు పోషించారు. 'పెళ్ళి' పృథ్వీ ప్రతినాయకుల్లో ఒకడిగా చేశాడు. మెయిన్ విలన్ అయిన బాబీ డియోల్ ఎంట్రీ మరీ ఆలస్యంగా జరిగింది. కనిపించిన కాసేపు ఒళ్లు గగుర్పొడిచేలా చేశాడు. బట్ అతని అభిమానులు మాత్రం ఈ నిడివితో సంతృప్తి పడటం కష్టమే. సాంకేతికంగా హర్షవర్ధన్ రామేశ్వర్ నేపథ్య సంగీతానికి పెద్దపీట వేయాలి. సన్నివేశాలను తన ప్రతిభతో బాగా ఎలివేట్ చేశాడు. 'కేజీఎఫ్, విక్రమ్, జైలర్" తరహాలోనే యాక్షన్ సీక్వెన్స్ కు ఇందులో అవసరానికి మించి ప్రాధాన్యమిచ్చారు. వాటి నిడివి తగ్గించుకుని ఉంటే బాగుండేది. దర్శకుడు సందీప్ రెడ్డే దీనికి ఎడిటర్ కూడా కాబట్టి 'తగ్గేదే లే' అనుకున్నట్టుగా ఉంది వ్యవహారం! దాదాపు మూడున్నర గంటల పాటు థియేటర్‌లో అతను ఆడియెన్స్ ను కూర్చోపెట్టినా... నిజానికి ఈ కథకు అంత నిడివి అవసరమే లేదు.

ప్రతి మనిషిలోనూ జంతు ప్రవృత్తి ఉంటుందని, అది సందర్భానుసారం ఒక్కోసారి బయటపడుతుందని సందీప్ రెడ్డి వంగ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చెప్పాడు. అందుకే ఇందులోని హీరో పాత్ర ప్రవృత్తికి తగ్గట్టుగా 'యానిమల్' అనే పేరు పెట్టామన్నాడు. ఇందులో హీరో లాంటి 'యానిమల్' పాత్రలు చాలానే ఉన్నాయి. సో... దీనికి 'యానిమల్స్' అని పెట్టి ఉండాల్సింది. బహుశా ఆ సత్యాన్ని గ్రహించే కావచ్చు 'జురాసిక్ పార్క్' తరహాలో దీని సీక్వెల్ కు 'యానిమల్ పార్క్' అని నామకరణం చేశారు. ఏదేమైనా... ఇలాంటి 'యానిమల్'కు ఎంత దూరంగా ఉంటే ఆరోగ్యానికి అంత మంచిది!

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# చిగురుటాకులా చెన్నై గజగజ


పేరుకు మెట్రో నగరాలు. చినుకు పడితే చిత్తడి. భారీ వర్షానికి బెంబేలు. తుపానైతే అతలాకుతలం. అలాంటి మరో చేదు అనుభవం చెన్నైది. డిసెంబర్ 4 నాటి 'మిచౌంగ్'తుపాన్‌కు ఆ మహానగరం నడిబొడ్డు అన్నాశాలైలోని ప్రధాన కూడలి జీవీ రోడ్ (జనరల్ పేటర్స్ రోడ్)  సాగరాన్ని తలపిస్తోంది. నగరంలో అడుగడుగున జలాశయం అనుభూతి. నగరంలోనూ, శివారు ప్రాంతాల్లోనూ పెద్ద సంఖ్యలో కార్లు నీటిలో కొట్టుకుపోయాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. సమాచార వ్యవస్థ ఛిద్రమైంది. ఎనిమిదేళ్ల క్రితం.. జూలై, 2015 నాటి 'కొమెన్' తుపానును మరిపించే స్థాయిలో 'మిచౌంగ్' ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ముంబయ్, బెంగళూరు, హైదరాబాద్..ఇలా ఏ నగరమూ ఇలాంటి ఉపద్రవాల నుంచి మినహాయింపు కాదు. ఒకవైపు ప్రకృతి విలయ తాండవం.. మరోవంక మానవ తప్పిదాలు.



From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 76 Issue : 05



# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు





వెల : ₹.220/-





వెల : ₹.200/-





వెల : ₹.390/-





వెల : ₹.250/-




వెల : ₹.250/-





వెల : ₹.360/-




వెల : ₹.100/-




వెల : ₹.200/-





వెల : ₹.100/-




వెల : ₹.150/-





వెల : ₹.799/-





వెల : ₹.499/-




వెల :₹.495/-




వెల : ₹.799/-




వెల : ₹.549/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!
సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329
సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687